అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
గురువారం 5-10-2023 సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 227 Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam 12 పేజీలు వెల : 6.50

ఇదే మన తెలంగాణ

ఇదే మన తెలంగాణ



మహానగరాన్ని సంకల్పించాం

విశ్వనగరాన్ని నిర్మించాం

తెలంగాణ ప్రగతి పథంలో పయనిస్తున్నది. రాష్ట్ర ప్రగతితోనే తెలంగాణ ప్రజల అభివృద్ధి సాధ్యమని మనసా, వాచా, కర్మణా నమ్మి నడిచింది తెలంగాణ ప్రభుత్వం. దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన స్వరాష్ట్ర పోరాట సారథి, ప్రియతమ ముఖ్యమంత్రి **శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు** గారి ముందుచూపే నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు శ్రీరామరక్ష.

తెలంగాణ మారుమూల పల్లెలను కూడా రాష్ట్ర రాజధానితో అనుసంధానం చేయాలన్న ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం ఆచరణలో పెట్టింది. రహదారులు, మౌలిక వసతుల కల్పనతో నగర ప్రజల ఆశలకు రెక్కలు తొడిగింది.

సమగ్ర, సమ్మిళిత, సమీకృత, సమతుల్య అభివృద్ధే అంతిమ లక్ష్యంగా, మానవతా విలువలతో పాలన కొనసాగిస్తున్నాం.

అదే స్ఫూర్తితో, అవే విలువలతో నాలుగు వందల యేండ్ల చరిత్ర గల హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దుకున్నాం.

తెలంగాణ రాష్ట్రం సుసంపన్నమైంది
తెలంగాణ ప్రజల స్వప్నం సాకారమైంది

జారీ చేసినవారు : స్పెషల్ కమీషనర్, సమాచార పౌరసంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం



భావితరాల భాగ్యప్రదాతగా పురోగమిస్తున్నది మన హైదరాబాద్

ఇదే మన తెలంగాణ



మహానగరంలో మరింత సాఫీగా ప్రయాణం

అభివృద్ధికి ఆనవాళ్ళుగా రహదారులు

- వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి ప్రాజెక్టు (ఎస్.ఆర్.డి.పి) కింద 36 ప్రాజెక్టుల పూర్తి (ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు, ఆర్వోబీలు, ఆర్యూబీలు)
- అంతర్జాతీయ ప్రమాణాలతో దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి
- ట్రాఫిక్ కష్టాలు తీర్చడానికి కొత్త లింక్ రోడ్లు.. మూసీ నదిపై 15 వంతెనల నిర్మాణానికి శంకుస్థాపన



నగర రవాణా వ్యవస్థలో విప్లవాత్మక మార్పు

హైదరాబాద్ మెట్రోరైలు

- దేశంలోనే రెండవ అతిపెద్ద మెట్రో రైలు వ్యవస్థ
- మెట్రోరైలులో రోజూ 5 లక్షల మంది ప్రయాణం
- మూడు కారిడార్లలో 69 కిలో మీటర్ల లైను
- రాయదుర్గం నుంచి విమానాశ్రయానికి మెట్రోరైలు విస్తరణ పనులు ప్రారంభం
- 400 కిలోమీటర్ల మేరకు విస్తరణ ప్రణాళికలు



అధునాతన పోలీసు వ్యవస్థ

ప్రజాభద్రతే మన ప్రభుత్వ ప్రాధాన్యత

- రాష్ట్ర ప్రజల భద్రత కోసం సమీకృత నిఘా వ్యవస్థగా కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (సీసీసీ) నిర్మాణం
- సర్వాంగులతో హైదరాబాద్ కమీషనరేట్
- విపత్తుల సమయంలో ఇతర శాఖలతో కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ సమన్వయం



ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు

అర్బన్ మిషన్ భగీరథ

- హైదరాబాద్ తాగునీటి అవసరాలు తీర్చేందుకు 62 రిజర్వాయర్లు, 2,100 కిలోమీటర్ల పైపులైన్ నిర్మాణం
- నగరానికి నిరంతర నీటిసరఫరాకు నాగార్జునసాగర్ వద్ద సుంకిశాల ఇన్‌టేక్ ప్రాజెక్ట్ నిర్మాణం
- కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల ద్వారా జంట నగరాలకు తాగునీరు
- ప్రతి ఇంటికి ఉచితంగా 20,000 లీటర్ల తాగునీటి సరఫరా





పెట్టుబడులకు స్వర్గధామం

తెలంగాణ పారిశ్రామిక ప్రగతి TS ఐ-పాస్

- టీఎస్ఐపాస్ - పరిశ్రమల అనుమతులకై సింగిల్ విండో విధానం
- 24,000 పరిశ్రమలకు అనుమతులు
- రూ. 4 లక్షల కోట్ల పెట్టుబడుల రాక
- 9 జిల్లాలలో 109 పారిశ్రామిక వాడలు, ఆహార శుద్ధి మండలాలు
- 2014 లో రూ. 57, 258 కోట్లుగా ఉన్న ఐటీ ఎగుమతుల విలువ 2023 నరికి రూ. 2,41,275 కోట్లు



ప్రతి పౌరుడికి రక్షణ, రాష్ట్రంలో సుస్థిర శాంతి

ప్రశాంత హైదరాబాద్ నగరం

- హైదరాబాద్ నగర మహిళల భద్రత కోసం 100 షీ టీమ్స్
- మహిళలు, పిల్లలపై లైంగిక, భౌతికదాడులను అరికట్టేందుకు భరోసా సహాయక కేంద్రాలు
- పోలీసులకు ఆధునిక సదుపాయాలు, శిక్షణ
- గత 9 ఏండ్లలో కర్ఫ్యూ, మత ఘర్షణలు అన్న మాటలు వినిపించని పాలన
- రోడ్డుభద్రత, ట్రాఫిక్ నిర్వహణ, షీ టీమ్స్, భరోసాకేంద్రాలు, CCTV ప్రాజెక్టులకు ప్రతిష్టాత్మక SKOCH అవార్డులు



స్వచ్ఛ హైదరాబాద్

హైదరాబాద్ మురుగుకు శాశ్వత పరిష్కారం

- 100 శాతం మురుగు శుద్ధి వసతి కలిగిన నగరం కానున్న హైదరాబాద్
- 1,259 MLD సామర్థ్యంగల 31 మురుగు శుద్ధి ప్లాంట్లు నిర్మించనున్న హైదరాబాద్ జలమండలి
- నగరంలో పరిశుభ్రత కోసం వివిధ ప్రాజెక్టుల అమలు



ఆవిష్కరణల గమ్యస్థానం

అంకుర సంస్థల రాజధాని హైదరాబాద్

- టీ హబ్, టీఎస్ఐసీ, వీ హబ్, టీ వర్క్స్, రిచ్ మరియు టాస్క్ వంటి సంస్థల ఏర్పాటుతో పటిష్ట ఆవిష్కరణల వ్యవస్థ
- సిద్ధమవుతున్న ప్రపంచపు అతి పెద్ద ఆవిష్కరణల ప్రాంగణం
- ఆవిష్కరణ సంస్కృతికి అత్యధిక ప్రోత్సాహం



అభివృద్ధిలో ప్రపంచ నగరాలతో పోటీ

హైదరాబాద్ నగరానికి అవార్డుల పంట

- భారతదేశంలో అత్యంత నివాసయోగ్యమైన నగరంగా మెర్సెర్ సంస్థచే వరుసగా 5 సార్లు ఎంపికైన హైదరాబాద్
- ప్రపంచ హరిత నగరంగా 2022లో AIPH గుర్తింపు
- హైదరాబాద్ ను ప్రపంచ వృక్ష నగరంగా గౌరవించిన ఆర్బర్ డే ఫౌండేషన్
- అంతర్జాతీయ సుందర కట్టడాల విభాగంలో ఐదు గ్రీన్ ఆపిల్ అవార్డులు

అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
గురువారం 5-10-2023
సంపుటి : 9 | సంచిక : 227 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 12 పేజీలు | వెల : 6.50

తెలంగాణ ఓటర్లు 3,17,17,389
కొత్త ఓట్లు 17.01 లక్షలు తుది జాబితా విడుదల

నవ తెలంగాణ- హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో ఓటర్ల తుది జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం విడుదల చేసింది. రాష్ట్రంలో మొత్తం 3కోట్ల17లక్షల 17వేల 389 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించింది. ఈ ఏడాది జనవరితో పోలిస్తే 5.8 శాతం ఓట్లు పెరిగినట్లు పేర్కొంది. పురుష ఓటర్లు - 1,58,71,493 మంది కాగా మహిళా ఓటర్లు 1,58,43,339 మంది ఉన్నారు. ట్రాన్స్‌జెండర్ ఓటర్లు - 2,557 మంది. సర్వీస్ ఓటర్లు 15,338 మంది. ఇందులో కొత్త ఓటర్ల సంఖ్య 17.01 లక్షలు కాగా తొలగించిన ఓట్లు - 6.10 లక్షలు. ఓటర్ల జాబితా ప్రకారం లింగ నిష్పత్తి - 998:1000గా ఉన్నట్లు సీఈసీ వెల్లడించింది. 6,98,133 మంది ఓట్లతో అత్యధిక ఓటర్లు కలిగిన నియోజకవర్గంగా శేరిలింగంపల్లి నమోదయింది. ఎల్బీ నగర్‌లో 5,66,866 మంది ఓటర్లు, రాజేంద్రనగర్ నియోజకవర్గంలో 5,52,455 మంది ఓటర్లు ఉన్నారు.



కులగణనతో బీజేపీకి కలవరం

అనేక అవరోధాలను అధిగమిస్తూ బీహార్ ప్రభుత్వం నిర్వహించిన కులగణన దేశ రాజకీయాలలో ప్రకంపనలు సృష్టిస్తోంది. కులగణనకు ప్రతిపక్ష పార్టీలు ఇప్పటికే మద్దతు తెలపగా బీజేపీ మాత్రం సందిగ్ధంలో పడింది. బీహార్‌లో వివిధ కులాల జనాభాపై స్పష్టత వచ్చిన నేపథ్యంలో దేశంలో ఏ కులం వారు ఎంత సంఖ్యలో ఉండవచ్చునన్న విషయంపై ఊహాగానాలు వినవస్తున్నాయి. ఎందుకంటే దేశంలోని పలు ప్రాంతాలలో కులాలే రాజకీయాలను ప్రభావితం చేస్తున్న విషయం తెలిసిందే. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అనేక రాష్ట్రాలలో సం'కుల' సమరం తప్పడం లేదు.

న్యూఢిల్లీ : దేశంలో పది సంవత్సరాలకు ఒకసారి జరగాల్సిన జనగణనను సకాలంలో నిర్వహించడంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం విఫలమైంది. 2021లో జనగణన జరగాల్సి ఉండగా కోవిడ్ కారణంతో వాయిదా పడింది. ఆ తర్వాత పరిస్థితులు చక్కబడినప్పటికీ ప్రభుత్వం మాత్రం జనాభా లెక్కల సేకరణకు శ్రీకారం చుట్టలేదు. అదే సమయంలో బీహార్‌లోని నితీష్ కుమార్ ప్రభుత్వం కులగణనను విజయవంతంగా పూర్తి చేసింది. తద్వారా జాతీయ స్థాయిలో సైతం కులగణన జరపవచ్చునని రాజకీయ సంకేతాలు పంపింది. ఒడిషా, జార్ఖండ్ రాష్ట్రాలలో ఇప్పటికే సామాజిక, ఆర్థిక కుల సర్వేలు జరుగుతున్నాయి. మరి దేశంలో అలాంటి కసరత్తు ఎందుకు చేపట్టలేకపోతోందో బీజేపీ వివరణ ఇవ్వాల్సి ఉంటుంది.

ఓబీసీల డిమాండ్ పెరిగితే...

ఇప్పటివరకూ బీజేపీ నేతలు హిందూత్వ వాదనను గట్టిగా విన్పించారు. అయితే ఇప్పుడు వారిలో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. దేశ జనాభాలో ఓబీసీలు, ఎస్సీలు, ఎస్టీలు కలిపి 84% వరకూ ఉండవచ్చునని ప్రతిపక్షాలు అంటున్నాయి. ఇది బీజేపీని కలవరపెడుతోంది. మత ప్రాతిపదికన ప్రజలను విభజించి రాజకీయ లబ్ధి పొందుతున్న బీజేపీకి ఇది కొరుకుడు పడని విషయమే. ఎందుకంటే హిందూ మతంలోని అనేక సామాజిక, ఆర్థిక అంతరాలు.... అగ్రవర్ణ ఆధిపత్యాలు బటబయలవుతాయి. కనుక హిందువులంతా ఒకటేనని నినదిస్తున్న మనువాద అనుచరులకు కులగణన అనేది మింగుడు పడని అంశం.

2019లో మోడీ ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడిన తరగతుల వారికి 10శాతం రిజర్వేషన్లు కల్పించింది. న్యాయ వ్యవస్థ కూడా దీనిని ఆమోదించి, రిజర్వేషన్లపై అమలులో ఉన్న 50 శాతం సీలింగ్‌ను తొలగించింది. బీహార్ తరహాలోనే దేశవ్యాప్తంగా కులగణన జరిపితే ఓబీసీల జనాభా ఎంతో కచ్చితంగా తేలిపోతుంది. అప్పుడు జనాభాకు అనుగుణంగా తమకు రిజర్వేషన్లు ఇవ్వాలని వారు పట్టుపట్టే అవకాశం ఉంది. దేశ జనాభాలో ఓబీసీలు 63.13 శాతం ఉండవచ్చునని ఓ అంచనా. వీరికి ఇప్పుడు కేవలం 27శాతం రిజర్వేషన్లు మాత్రమే అమలవుతున్నాయి. వాటిని పెంచితే దేశ రాజకీయ ముఖచిత్రమే మారిపోతుంది. ఇది హిందూ ఆధిపత్య వర్గాలు

బలం పెంచుకుంటున్న ప్రతిపక్షం

గత దశాబ్ద కాలంలో ఓబీసీలలో బీజేపీ బలం కొంతమేర పెరిగింది. దానిని నిలుపుకుంటేనే రాబోయే లోక్‌సభ ఎన్నికలలో ...2లో

తేలని న్యాయ పంచాయితీ
తుది తీర్పు ఇవ్వని సుప్రీంకోర్టు
వివరాలు 2లో

బీహార్ బాటలో ఒడిశా..!
కుల గణన షురూ
వివరాలు 2లో

అణచివేయడం కోసమే



పదేండ్లకోసారి జరిగే జనగణన దేశ చరిత్రలో ఎన్నడూ ఆగలేదు.... 1881లో జనాభా లెక్కలు మొదలైనప్పటి నుంచి ఎప్పుడూ వాటిని నిర్వహించకుండా ఉండలేదు... ప్రపంచ యుద్ధాల సమయంలోనూ వాటిని ఆపలేదు. కానీ మోడీ ఆ పని చేశారు! మనువాద సామాజిక అణచివేతను బలపరిచేందుకు కుల గణనను తిరస్కరిస్తున్నారు. అదే సమయంలో ఓబీసీల ప్రయోజనాలను కాపాడేది తామేనని ప్రగల్భాలు పలుకుతున్నారు. ఈ క్రూరమైన కపటత్వాన్ని ఓడించాలి.

- సీతారాం ఏచూరి,
ప్రధాన కార్యదర్శి సీపీఐ(ఎం)



ఐక్య పోరాటానికి
తలొంచిన సర్కార్
అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి హామీ

- 24 రోజుల సమ్మె ఫలితం
- మాట తప్పితే మరో ఉద్యమం తప్పదు : అంగన్‌వాడీ జేఏసీ హెచ్చరిక
- సమ్మె విరమిస్తున్నట్టు ప్రకటన
- 'చలో హైదరాబాద్' అందోళన విజయవంతం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అంగన్‌వాడీల ఐక్య పోరాటానికి సర్కారు తలొంచింది. వారి సమస్యల్ని పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. మరికొన్ని సమస్యల పరిష్కారానికి కొంత సమయం కావాలని అభ్యర్థించింది. గతంలో మాదిరి నమ్మించి మోసం చేసే చర్యలకు పాల్పడితే, ఈసారి సహించేది లేదని జేఏసీ నేతలు తేల్చిచెప్పారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌తో పాటు ఇతర అంశాలపై గతంలో ఇచ్చిన ఉత్తర్వుల్ని సవరించి, మళ్లీ కొత్త ఉత్తర్వులు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీనితో 24 రోజుల నుంచి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు చేస్తున్న సమ్మెను విరమిస్తున్నట్టు జేఏసీ నేతలు ప్రకటించారు. అయితే పోరాటానికి ఇది తాత్కాలిక విరామమేననీ, ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే భవిష్యత్ ఐక్య ఉద్యమాలకు అందరూ సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (సీఐటీయూ-ఏఐటీయూసీ) బుధవారం 'చలో హైదరాబాద్'కు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. తొలుత ఇందిరాపార్కు వద్ద మహా ధర్నా నిర్వహించాలని నిర్వాహకులు భావించారు. అయితే రాష్ట్రం నలుమూలల నుంచి వందలాదిమంది అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తరలివచ్చారు. దీనితో ధర్నా శిబిరాన్ని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్దకు మార్చారు. అయితే అంతకుముందు జేఏసీ నేతల్ని ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించింది. ఆర్థికమంత్రి టీ హరీశ్‌రావు, ఐసీడీఎస్ మంత్రి సత్యవతిరాథోడ్‌తో పాటు ఉన్నతాధికారులు ఈ చర్చల్లో పాల్గొన్నారు. జేఏసీ తరపున అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ)/ అసోసియేషన్ (ఏఐటీయూసీ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీత, పీ జయలక్ష్మి / సాయి ఈశ్వరి, ఎన్ కరుణకుమారి, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య, భూపాల్, రాష్ట్ర కార్యదర్శి జే వెంకటేష్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్‌డీ యూసుఫ్, కార్యదర్శులు సమ్మయ్య, సీతా మహాలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై మంత్రులతో జేఏసీ నేతలు చర్చించారు. గతంలో ఇలాగే చర్చలకు ఆహ్వానించి, ఇచ్చిన హామీలకు భిన్నంగా ప్రభుత్వ ఉత్తర్వులు ఇచ్చిన అంశాన్ని జేఏసీ నేతలు ప్రస్తావించారు. అయితే ఈసారి అలా జరగదని ఆర్థికమంత్రి హరీశ్‌రావు హామీ ...11లో

నేను సీఎం కావాలంటే మోడీ ఎన్‌ఓసీ అక్కర్లేదు
మేం ఎవరికీ బీ టీం కాదు



- కాంగ్రెస్ సచ్చిన పాముతో సమానం : నిర్మల్ సభలో మంత్రి కేటీఆర్

నవతెలంగాణ- దిలావర్‌పూర్

తెలంగాణకు నేను ముఖ్యమంత్రి కావాలంటే ప్రధాని మోడీ ఎన్‌ఓసీ(నిరభ్యంతర పత్రం) ఇవ్వాల్సిన అవసరం లేదని పురపాలక, ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. నిజామాబాద్ సభలో ప్రధాని చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. మేము ఢిల్లీకి గులాం కొట్టబోమని.. ఎవరికీ బీ టీం కాదని స్పష్టం చేశారు. గాలి మోటరు మీద వచ్చిన మోడీ గాలి మాటలు మాట్లాడి వెళ్లారని ఎద్దేవా చేశారు. బుధవారం నిర్మల్ జిల్లా పర్యటనకు వచ్చిన కేటీఆర్ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో కలిసి రూ.1157కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. అనంతరం బహిరంగ సభలో మంత్రి కేటీఆర్ ప్రసంగించారు. 2014లో గ్యాస్ ...3లో


గరీబోళ్లపై నిర్బంధాన్ని ఆపాలి
ప్రభుత్వ భూమిని కబ్జా చేసినోళ్లపై చర్యలు తీసుకోవాలి : ఎస్.వీరయ్య, జి.నాగయ్య

- కంది పేదలకు ఇండ్ల స్థలాలివ్వాలి
- పట్టాలిచ్చే వరకు పోరు ఆగదు
- తహసీల్దార్ కార్యాలయం ముట్టడి
- వ్యక్తిగత దరఖాస్తులతో వినతి



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

నిలువ నీడలేని పేదలు వేసుకున్న గుడిసెల్ని కూల్చేసి నిర్బంధం ప్రయోగించడం అన్యాయమని ప్రజాసంఘాల ఐక్య పోరాట వేదిక కన్వీనర్ ఎస్.వీరయ్య, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు జి.నాగయ్య, ఆర్.వెంకట్రాములు అన్నారు. సంగారెడ్డి జిల్లా కంది మండల కేంద్రంలోని 615 సర్వే నెంబర్ ప్రభుత్వ భూమిలో నిరుపేదలు గుడిసెలు వేసుకున్నారు. పట్టాలివ్వాలని కోరుతూ దరఖాస్తు చేశారు. పేదలు సాగిస్తున్న ఇండ్ల స్థలాల పోరాటానికి మద్దతుగా నిలిచేందుకు బుధవారం ఎస్.వీరయ్య, జి.నాగయ్య, ఆర్.వెంకట్రాములు భూ పోరాట క్షేత్రానికి వచ్చారు. గుడిసెలేసిన పేదల్ని కలిసి మద్దతు తెలిపారు. ఇండ్ల స్థలాలు సాధించే వరకు పోరాటం చేద్దామని, ప్రజా సంఘాలు, సీపీఐ(ఎం) అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పేదలు గుడిసెలేసుకున్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరుపేదలు నిలువ నీడ లేక అద్దె కొంపల్లో ఉంటూ కిరాయిలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు ...11లో



రసాయనశాస్త్రంలో ముగ్గురికి నోబెల్
బహుమతి గ్రహీతల పేర్లు ప్రకటనకు ముందే లీక్

స్టాకహోం : రసాయనశాస్త్రంలో ముగ్గురు శాస్త్రవేత్తలకు నోబెల్ పురస్కారం దక్కింది. మోంగి బావెండి, లూయిస్ బ్రుస్, అలెక్సీ ఎకిమోవ్‌లను ఈ ఏడాది నోబెల్ పురస్కారానికి ఎంపిక చేసినట్లు కమిటీ బుధవారం ప్రకటించింది. క్వాంటమ్ డాట్స్ విశ్లేషణ, ఆవిష్కరణలో, నానో పార్టికల్స్ అభివద్ధిలోనూ ఈ ముగ్గురు శాస్త్రవేత్తలు కీలక పాత్ర పోషించినట్లు నోబెల్ కమిటీ తెలిపింది.

క్వాంటమ్ డాట్స్, నానో పార్టికల్స్‌కు విశిష్టమైన గుణాలు ఉన్నాయి. ఎల్‌ఈడీ టెలివిజన్ స్క్రీన్‌లు, సోలార్ ప్యానెల్‌లు, వైద్య చికిత్సలో క్వాంటం డాట్‌లను అధికంగా వినియోగిస్తుంటారు. శస్త్ర చికిత్సలో కణితులను తొలగించడంలో వైద్యులకు సహాయపడతుంటాయి. భవిష్యత్తులో జరగబోయే క్వాంటమ్ కమ్యూనికేషన్ కోసం క్వాంటమ్ డాట్స్ కీలకం కానున్నట్టు నోబెల్ కమిటీ ...11లో

కేసీఆర్‌కు అధిష్టానం మోడీనే
సీట్ల సర్దుబాటు కూడా జరిగింది



- బీజేపీ, బీఆర్ఎస్ పొత్తు కుదిరింది
- ఎంఐఎం ఎటువైపో తేల్చుకోవాలి : రేవంత్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి బీజేపీ, బీఆర్ఎస్ పొత్తు కుదిరిందని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని బీఆర్ఎస్ ఎంపీ ఒకరు చెప్పారని తెలిపారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ ...11లో

గిరిజన వర్సిటీ బిల్లుకు ఓకే
పసుపు బోర్డుకు గ్రీన్ సిగ్నల్ 2లో

- కృష్ణా ట్రిబ్యునల్-2 ఏర్పాటు : కేంద్ర మంత్రివర్గం నిర్ణయాలు
- పీఎంయూవై వంట గ్యాస్ సిలిండర్ సబ్సిడీ రూ.100 పెంపు



అసత్య ఆరోపణలు
గతంలోనూ విచారించి భంగపడ్డారు

- న్యాయస్థానానికి ఆదాయ వ్యయాలను సమర్పించాం
- న్యూయార్క్ టైమ్స్‌ది బూటకపు, ప్రేరేపిత కథనం
- ప్రజావాణిని వినిపించనీయకుండా గొంతు నొక్కుతున్నారు
- పత్రికా స్వేచ్ఛ కోసం తుదికంటా పోరాడతాం : ఢిల్లీ పోలీసుల చర్యలపై న్యూస్‌క్లిక్ ప్రకటన

నవ తెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

తమపై ఢిల్లీ పోలీసులు రుజువుకు నిలవని, నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని న్యూస్‌క్లిక్ పోర్టల్ విమర్శించింది. గతంలో అనేకసార్లు ఈడీ, ఐటీ, ఢిల్లీ పోలీసులు తమను విచారించారని, కానీ వారు ఆశించినది ఏమీ లేకపోవడంతో భంగపడ్డారని వ్యాఖ్యానించింది. తమ ఆదాయ వ్యయాలు న్యాయస్థానం ముందే ప్రకటించామని, ఆర్బీఐ నిబంధనలకు అనుగుణంగానే నిధుల సమీకరణ జరిగిందని వివరించింది. ఢిల్లీ పోలీసులు తమ కార్యాలయంలో, ఉద్యోగుల నివాసాలలో సోదాలు నిర్వహించడం, అరెస్టులు చేయడంపై బుధవారం ఆ సంస్థ ఓ ప్రకటన విడుదల చేసింది. "న్యూస్‌క్లిక్ కార్యాలయం, జర్నలిస్టుల నివాసాలు, న్యూస్‌క్లిక్‌తో సంబంధమున్న ఉద్యోగుల నివాసాలతో సహా వివిధ ప్రదేశాలలో ఢిల్లీ పోలీసుల ప్రత్యేక విభాగం మంగళవారం దాడులు నిర్వహించింది. చాలా మందిని విచారించారు. చీఫ్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థ, అమిత్ చక్రవర్తిలను అరెస్టు చేశారు. మాకు ఎఫ్ఐఆర్ కాపీని ఇవ్వలేదు. మాపై మోపిన నేరాలేమిటో చెప్పలేదు. జప్తు చేసేందుకు అవసరమైన మెమోలు ఇవ్వలేదు. స్వాధీనం చేసుకున్న ...11లో



ఈ దాడులపై జోక్యం చేసుకోండి

- సీజేఐ చంద్రచూడ్‌కు 18 మీడియా సంస్థల లేఖ 11లో..

ఆర్టీసీ ఉద్యోగులకు
4.8 శాతం డిఏ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) ఉద్యోగులకు ఈ ఏడాది జులై నుంచి ఇవ్వాల్సిన 4.8 శాతం కరువుభత్యం (డిఏ)ను మంజూరు చేసినట్టు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ తెలిపారు. అక్టోబర్ నెల వేతనంతో కలిపి ఈ డిఏను సిబ్బందికి చెల్లిస్తామని బుధవారంనాడొక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. టీఎస్ఆర్టీసీ ఉద్యోగులు కష్టపడి పని చేస్తున్నారనీ, ప్రయాణీకులకు మెరుగైన, నాణ్యమైన సేవలందిస్తూ, వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేస్తున్నారని చెప్పారు. సంస్థ వృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకమనీ, వారి సంక్షేమానికి యాజమాన్యం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. 2019 నుంచి విడతల వారీగా ఇప్పటివరకు 9 డీఏలను మంజూరు చేశామన్నారు. దీనితో ఉద్యోగులకు ఎలాంటి డిఏ బకాయిలు లేవని స్పష్టం చేశారు.

భూసేకరణ నోటిఫికేషన్‌కు ముందు విధిగా గ్రామసభ : హైకోర్టు
వివరాలు 5లో

రెవెన్యూ (భూ సేకరణ) శాఖ

ఫారం - 6
(ప్రాథమిక ప్రకటన)
(తెలంగాణ సవరణ చట్టం 2016లోని చాప్టర్3ఎలోని 10ఎ అనుసరించి)
(చట్టంలోని సెక్షన్-11 క్రింద దీనిలో 10ఎ మినహాయింపు కలదు)
(నిబంధన 6/12 చూడుము)
తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (భూసేకరణ) శాఖ

గెజిట్ నెం.32/2023
ఫైల్ నెం. / / తేది:29-09-2023
జిల్లా కలెక్టర్ యాదాద్రి భువనగిరి ఫైల్ నెం. జి/732/2021 తేది:29-09-2023
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎల్ఏ) యాదాద్రి భువనగిరి ఫైల్ నెం. సి/364/2021,
తేది:-09-2023.

తెలంగాణ ప్రభుత్వం/ జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారి ఆదేశానుసారం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం వడపర్తి గ్రామములో విస్తీర్ణం ఎ.7.25 గుంటల భూమి ప్రజాప్రయోజనార్థం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణములో భాగముగా హైలెవెల్ మైన్ కెనాల్ (హెచ్.యల్.యం.సి.) ను నిర్మించుటకుగాను (బస్వాపురామ్ రిజర్వాయర్) కిమీ 0.950 నుండి 1.635 మరియు 2.175 నుండి 2.340 వరకు దిగువ చూపిన భూమి అవసరమైయున్నదని భావించినందున సదరు భూసేకరణ ప్రకటన జారీచేయనైనది.

ప్రభుత్వము ఉత్తర్వుల నెం.35, ఐ& కాడ్ (ఎల్.ఎ., ఆర్&ఆర్/ఎ2) డిపార్ట్‌మెంట్ తేది:30-06-2017 ద్వారా కాళేశ్వరం ప్రాజెక్ట్ కొరకు భూసేకరణ నష్టపరిహారం మరియు పునరుపాది కల్పన (పారదర్శకత మరియు న్యాయబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు) చట్టం, 2013లోని చాప్టర్-3 (సామాజిక ప్రభావ లెక్కింపు అధ్యయనం) మరియు చాప్టర్-3 (ఆహార భద్రత పరిరక్షణ) వర్తింపు నుండి మినహాయింపు ఇవ్వనైనది.

కావున, పైన తెలిపిన భాగముగా హైలెవెల్ మైన్ కెనాల్ (హెచ్.యల్.యం.సి.) నిర్మాణ నిమిత్తం యాదాద్రి భువనగిరి జిల్లా, భువనగిరి మండలం, వడపర్తి గ్రామములో విస్తీర్ణం ఎ.7.25 గుంటల భూమి యొక్క వివరములు ఈ దిగువ చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీ చేయనైనది.

షెడ్యూలు
గ్రామము: వడపర్తి మండలం: భువనగిరి జిల్లా: యాదాద్రి భువనగిరి

సర్వే నెం. విస్తీర్ణం	భూమి రకం (ఖుష్కి/తరి పట్టా/ప్రభుత్వ/ఇనాం)	పట్టాదారుని పేరు తండ్రి/భర్త పేరు	అనుభవదారుని పేర తండ్రి/భర్త పేరు	భూసేకరణ చేయు విస్తీర్ణం	చెట్ల రకం/నిర్మాణం రకం
13/ 0.02	పట్టా/తరి	మేడబోయిన మైసయ్య తండ్రి ముత్తయ్య	మేడబోయిన మైసయ్య తండ్రి ముత్తయ్య	0.02	వాటర్ సంపు-1 తుమ్మ-1, వాటర్ పైపులైను-1
		మేడబోయిన నర్సింహులు తండ్రి ముత్తయ్య	మేడబోయిన నర్సింహులు తండ్రి ముత్తయ్య		తుమ్మ-1.
		మేడబోయిన రాజు తండ్రి ముత్తయ్య	మేడబోయిన రాజు తండ్రి ముత్తయ్య		తుమ్మ-1.
		మేడబోయిన శ్రీశైలం తండ్రి ముత్తయ్య	మేడబోయిన శ్రీశైలం తండ్రి ముత్తయ్య		తుమ్మ-1.
568/ 0.04	పట్టా/తరి	బచాటి గోపాల్ తండ్రి రాములు	బచాటి గోపాల్ తండ్రి రాములు	0.04	---
567/ 0.01 1/4	ప్రభుత్వ ఖుష్కి	పోరంబోకు	పోరంబోకు	0.01 1/4	---
569/ 0.001 1/4	పట్టా/ఖుష్కి	మేడబోయిన గోపిక భర్త బాల మల్లేష్	మేడబోయిన గోపిక భర్త బాల మల్లేష్	0.001 1/4	---
		మేడబోయిన బాలయ్య భర్త వెంకయ్య	మేడబోయిన బాలయ్య భర్త వెంకయ్య		---
591/ 1.03	పట్టా/ఖుష్కి	మేడబోయిన బాలయ్య తండ్రి ఇస్తారి	మేడబోయిన బాలయ్య తండ్రి ఇస్తారి	1.03	రాక్ వాల్స్
		మేడబోయిన బాలయ్య తండ్రి బక్క నర్సయ్య	మేడబోయిన బాలయ్య తండ్రి బక్క నర్సయ్య		
		మేడబోయిన నర్సింహ్మ తండ్రి ఇస్తారి	మేడబోయిన నర్సింహ్మ తండ్రి ఇస్తారి		
		మేడబోయిన మల్లయ్య తండ్రి ఇస్తారి	మేడబోయిన మల్లయ్య తండ్రి ఇస్తారి		
		మేడబోయిన శ్రీశైలం తండ్రి ఇస్తారి	మేడబోయిన శ్రీశైలం తండ్రి ఇస్తారి		
		కోటకూర చంద్రయ్య తండ్రి మల్లయ్య	కోటకూర చంద్రయ్య తండ్రి మల్లయ్య		
		మేడబోయిన సత్తయ్య తండ్రి దశరథ	మేడబోయిన సత్తయ్య తండ్రి దశరథ		
		మేడబోయిన బాల మల్లేశం తండ్రి వెంకయ్య	మేడబోయిన బాల మల్లేశం తండ్రి వెంకయ్య		
592/ 1.28 1/2	పట్టా/ఖుష్కి	మేడబోయిన మల్లేష్ తండ్రి బాల నర్సింహ్మ	మేడబోయిన మల్లేష్ తండ్రి బాల నర్సింహ్మ	1.28 1/2	తుమ్మ-2, రావి-1, సర్కారు తుమ్మ-5 రాక్ వాల్స్-1
		కోటకూరి వెంకయ్య తండ్రి బాలయ్య	కోటకూరి వెంకయ్య తండ్రి బాలయ్య		[illegible]
		మేడబోయిన పాపయ్య తండ్రి నర్సయ్య	మేడబోయిన పాపయ్య తండ్రి నర్సయ్య		-
594/ 0.15	పట్టా / ఖుష్కి	మేడబోయిన బాలయ్య తండ్రి ఇస్తారి	మేడబోయిన బాలయ్య తండ్రి ఇస్తారి	0.15	-
		మేడబోయిన బాలయ్య తండ్రి బక్క నర్సయ్య	మేడబోయిన బాలయ్య తండ్రి బక్క నర్సయ్య		-
		మేడబోయిన నర్సింహ్మ తండ్రి ఇస్తారి	మేడబోయిన నర్సింహ్మ తండ్రి ఇస్తారి		-
		మేడబోయిన మల్లయ్య తండ్రి ఇస్తారి	మేడబోయిన మల్లయ్య తండ్రి ఇస్తారి		-
		మేడబోయిన శ్రీశైలం తండ్రి ఇస్తారి	మేడబోయిన శ్రీశైలం తండ్రి ఇస్తారి		
		కోటకూరి చంద్రయ్య తండ్రి మల్లయ్య	కోటకూరి చంద్రయ్య తండ్రి మల్లయ్య		-
		మేడబోయిన సత్తయ్య తండ్రి దశరథ	మేడబోయిన సత్తయ్య తండ్రి దశరథ		-
		మేడబోయిన బాల మల్లేశం తండ్రి వెంకయ్య	మేడబోయిన బాల మల్లేశం తండ్రి వెంకయ్య		-
596/ 0.18	పట్టా / తరి	కోటకూరి ఉప్పమ్మ భర్త వెంకయ్య	కోటకూరి ఉప్పమ్మ భర్త వెంకయ్య	0.18	-
606/ 0.34	చెర్వు శిఖం	చెర్వు శిఖం (పెద్ద చెర్వు)	చెర్వు శిఖం (పెద్ద చెర్వు)	0.34	-
610/ 0.10	పట్టా / ఖుష్కి	మేడబోయిన మైసయ్య తండ్రి ముత్తయ్య	మేడబోయిన మైసయ్య తండ్రి ముత్తయ్య	0.10	-
		మేడబోయిన నర్సింహులు తండ్రి ముత్తయ్య	మేడబోయిన నర్సింహులు తండ్రి ముత్తయ్య		-
		మేడబోయిన రాజు తండ్రి ముత్తయ్య	మేడబోయిన రాజు తండ్రి ముత్తయ్య		-
		మేడబోయిన శ్రీశైలం తండ్రి ముత్తయ్య	మేడబోయిన శ్రీశైలం		-
619/ 0.10	పట్టా / ఖుష్కి	మేడబోయిన మైసయ్య తండ్రి ముత్తయ్య	మేడబోయిన మైసయ్య తండ్రి ముత్తయ్య	0.10	వివాదంలో ఉంది
		మేడబోయిన నర్సింహులు తండ్రి ముత్తయ్య	మేడబోయిన నర్సింహులు తండ్రి ముత్తయ్య		
		మేడబోయిన రాజు తండ్రి ముత్తయ్య	మేడబోయిన రాజు తండ్రి ముత్తయ్య		
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
కాలువ ప్రభుత్వ 0.09 1/2		కాలువ	కాలువ	0.09 1/2	-
			మొత్తం :	7-25	

భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్టపరిహారాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం,2016 (చట్టం 21/2017) ద్వారా సవరించబడిన భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్టపరిహారాన్ని పొందే హక్కు చట్టం,2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 11 (1) యొక్క నిబంధనలను అనుసరించి సంబంధిత వ్యక్తులు అందరికీ తెలియచేయుటకుగాను ఈప్రకటన జారీ చేయడమైనది.

భూమి యొక్క ప్లాన్, ఏదైనా పని దినము మరియు పని వేళలలో జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే.), ఆర్ అండ్ ఆర్, విభాగము-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా వారి కార్యాలయములో తనిఖీ చేసుకొనవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం/ జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారు, ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే.) విభాగము-2, యాదాద్రి భువనగిరి జిల్లా గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించిన సెక్షన్ 12ప్రకారం పైన తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇతర పనులు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారి అనుమతి లేకుండా ఇట్టి ప్రకటన జారీ చేసిన తేదీ నుండి నోటిఫికేషనులో ప్రకటించిన భూములకు సంబంధించి ఎవరూ ఎటువంటి లావాదేవీలు/తాకట్టు మొదలగు చర్యలు చేపట్టరాదు.

సదరు చట్టంలోని సెక్షన్ (15) అనుసరించి ప్రతిపాదిత భూసేకరణపై ఏవైనా అభ్యంతరాలుగానీ, ఆక్షేపణలుగానీ ఉన్నట్లయితే సేకరణలో ఉన్న భూమితో ఎ లాంటి సంబంధం ఉన్న వ్యక్తులైనా, పరిహారం నిర్ణయం కొరకు జరిపే సంప్రదింపుల వల్ల ప్రభావితులయ్యే వారెవరైనా ఇట్టి ప్రకటన జారీ చేసిన తేదీ నుండి 60(అరవై) దినములలోపు జిల్లా కలెక్టర్/అధీకృత అధికారి గారికి వారి అభ్యంతరములు వ్రాత పూర్వకంగా తెలియజేయవచ్చును.

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే.) ఆర్ అండ్ ఆర్, విభాగము-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా
సం/- జాయింట్ కలెక్టర్, యాదాద్రి భువనగిరి
సం/- జిల్లా కలెక్టర్ యాదాద్రి భువనగిరి

DIPR Ro.No.686/LA-PP/Advt/Pub/2023-24

గిరిజన వర్సిటీ బిల్లుకు ఓకే

పసుపు బోర్డుకు గ్రీన్ సిగ్నల్

- కృష్ణా ట్రిబ్యునల్-2 ఏర్పాటు
- పీఎంయూవై వంట గ్యాస్ సిలిండర్ సబ్సిడీ రూ.100 పెంపు
- కేంద్ర మంత్రివర్గం నిర్ణయాలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు సంబంధించిన బిల్లుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే పసుపు బోర్డు ఏర్పాటుతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నీటి పంపిణీకి సంబంధించిన కృష్ణా ట్రిబ్యునల్-2 ఏర్పాటుకు కూడా కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధాని మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం బుధవారం సమావేశమైంది. ఢిల్లీలోని ప్రధాని నివాసంలో జరిగిన ఈ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇందులో భాగంగా తెలంగాణలోని పలు ప్రాజెక్టులకు కేంద్ర క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. అనంతరం నేషనల్ మీడియా సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి వర్గం నిర్ణయాలను కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ వెల్లడించారు. "ప్రధాన మంత్రి ఉజ్వల యోజన లబ్దిదారులకు ఎల్‌పీజీ సిలిండర్‌పై మరో రూ.100 సబ్సిడీ పెంచుతూ క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. అయితే ఇటీవల తగ్గించిన రూ.200 తో కలిపి మొత్తం ఇప్పుడు రూ. 300 మేర ఉపశమనం కల్పించినట్టయ్యింది" అని అన్నారు.



రూ.889.07 కోట్లతో గిరిజన యూనివర్సిటీ

"తెలంగాణలో సమ్మక్క సారక్క సెంట్రల్ గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు కేంద్ర వర్గం ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం-2014లోని 13 షెడ్యూలులో పేర్కొన్నదాని ప్రకారం తెలంగాణలోని ములుగు జిల్లాలో సమ్మక్క సారక్క కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయాన్ని స్థాపించడం కోసం కేంద్రీయ విశ్వ విద్యాలయాల చట్టం-2009లో సవరణ నిమిత్తం కేంద్రీయ విశ్వ విద్యాలయాల సవరణ బిల్లు-2023 పేరిట పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టడానికి కేంద్ర మంత్రివర్గ సమావేశం ఆమోదాన్ని తెలిపింది. దీనికోసం రూ.889.07 కోట్ల నిధులను సర్దుబాటు చేయనున్నది" అని అన్నారు.

పసుపు బోర్డుకు మోక్షం

నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు.. జాతీయ పసుపు బోర్డు ఏర్పాటుతో పసుపుపై అవగాహనతో పాటు వినియోగం, ఎగుమతులను పెంచడం, అంతర్జాతీయంగా కొత్త మార్కెట్లను అభివృద్ధి చేసేందుకు దోహదపడుతుందని కేంద్ర మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ పేర్కొన్నారు. నూతన ఉత్పత్తుల్లో పరిశోధనాభివృద్ధిని ప్రోత్సహించేందుకు, సంప్రదాయ పరిజ్ఞానాన్ని జోడించి పసుపు ఆధారిత ఉత్పత్తులకు అదనపు విలువను జోడించేందుకు ఉపయోగ పడనుంది. భారత్ నుంచి పసుపు ఎగుమతులు 2030 నాటికి 1 బిలియన్ అమెరికా డాలర్లకు పెరుగుతాయని అంచనా వేస్తున్నట్టు పేర్కొన్నారు.

కృష్ణా ట్రిబ్యునల్-2కి ఆమోదం

"తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు అంతర్ రాష్ట్ర నదీ జలాల వివాదాల (ఐఎస్ఆర్‌డబ్ల్యూడి) చట్టం-1956 కింద కృష్ణా జల వివాద ట్రిబ్యునల్-2కి సంబంధించిన నిబంధనలకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఐఎస్ఆర్‌డబ్ల్యూడి చట్టంలోని సెక్షన్ 5(1) కింద తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ప్రస్తుతం ఉన్న కృష్ణా జలాల వివాదాల ట్రిబ్యునల్-2 (కెడబ్ల్యూడిటి-2)కి మరింత టెర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టిఒఆర్) జారీకి ఆమోదం తెలిపింది. ఇది చట్టపరమైన అభిప్రాయాన్ని స్వీకరించడం, దాని ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం ఫిర్యాదులో అంతర్ రాష్ట్ర నదీ జలాల వివాదాల (ఐఎస్ఆర్‌డబ్ల్యూడి) చట్టం-1956 సెక్షన్ (3) కింద లేవనెత్తిన సమస్యలపై ఆధారపడి ఉంటుంది. కృష్ణా నదీ జలాల వినియోగం, పంపిణీ, నియంత్రణపై రెండు రాష్ట్రాల మధ్య వివాదాల పరిష్కారం తెలంగాణ, ఏపీ రెండు రాష్ట్రాలలో అభివృద్ధికి కొత్త మార్గాలను తెరుస్తుంది. ఈ రెండు రాష్ట్రాల ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుంది" అని తెలిపారు.

"ఐఎస్ఆర్‌డబ్ల్యూడి చట్టం-1956 సెక్షన్ 3 ప్రకారం రాష్ట్రాలు చేసిన అభ్యర్థనలపై కేంద్ర ప్రభుత్వం 2004 ఏప్రిల్ 2న కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్-2ని ఏర్పాటు చేసింది. తదనంతరం 2014 జూన్ 2న ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం (ఏపీఆర్ఏ)-2014లోని సెక్షన్ 89 ప్రకారం, ఏపీఆర్ఏ-2014లోని పేర్కొన్న సెక్షన్‌లోని క్లాజులు (ఎ), (బి)లను పరిష్కరించడానికి కెడబ్ల్యూడిటి-2 పదవీకాలం పొడిగించబడింది" అని అన్నారు.

"తదనంతరం, తెలంగాణ ప్రభుత్వం 2014 జులై 14న కేంద్ర జలవనరుల విభాగం, జలశక్తి మంత్రిత్వ శాఖలకు ఫిర్యాదును పంపింది. కృష్ణా నదీ జలాల వినియోగం, పంపిణీ, నియంత్రణపై వివాదాన్ని ఇది స్పష్టం చేసింది. 2015లో సుప్రీం కోర్టులో తెలంగాణ రాష్ట్రం రిట్ పిటీషన్ దాఖలు చేసింది. 2018లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ట్రిబ్యునల్ పరిధిని మాత్రమే పరిమితం చేయాలని తెలంగాణ రాష్ట్రం కేంద్ర జలవనరుల విభాగం, జలశక్తి మంత్రిత్వ శాఖలను కోరింది. ఆ తరువాత ఈ విషయం 2020లో జలశక్తి మంత్రి ఆధ్వర్యంలో జరిగిన రెండో అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో చర్చించారు. రెండో అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో చర్చించి నట్లుగా తెలంగాణ రాష్ట్రం 2021లో రిట్ పిటిషన్‌ను ఉపసంహరించుకుంది. తదనంతరం ఈ విషయంలో జలవనరులు విభాగం న్యాయ మంత్రిత్వ శాఖను చట్టపరమైన అభిప్రాయాన్ని కోరింది" అని తెలిపారు.

కులగణనతో బీజేపీకీ కలవరం

(మొదటిపేజీ తరువాయి)

విజయం సాధించే అవకాశం ఉంటుంది. అయితే ప్రతిపక్షాలు ఓబీసీలలోకి చొచ్చుకుపోతున్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికలలో ఓబీసీలలో 44% మంది బీజేపీకి ఓటు వేశారు. కొన్ని రాష్ట్రాల జనాభాలో ఓబీసీలే అధికం. వివిధ రాష్ట్రాలలో ముఖ్యమంత్రి పదవులు నిర్వహిస్తున్న సిద్ధరామయ్య, స్టాలిన్, పినరయి విజయన్, భూపేష్ బాఘేల్, అశోక్ గెహ్లాట్ ఓబీసీలే. అయితే ఓబీసీలలో కొన్ని కులాలే ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. రాజస్థాన్‌లో తన కులానికి పెద్దగా ప్రాధాన్యత లేదని ముఖ్యమంత్రి గెహ్లాట్ గత వారం వ్యాఖ్యానించారు కూడా. ఇదిలావుంటే మోడీ ప్రభుత్వం ఓబీసీలకు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వడం లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇటీవల గణాంకాలతో సహా ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వంలో 90 మంది కార్యదర్శులు ఉంటే వారిలో ముగ్గురు మాత్రమే ఓబీసీలని గుర్తు చేశారు. తాను ఓబీసీల పార్టీనని గొప్పలు చెప్పుకునే బీజేపీకి ఈ గణాంకాలు మింగుడు పడడం లేదు.

ముస్లిం రిజర్వేషన్లపై తప్పటడుగులు

ముస్లింలకు వ్యతిరేకంగా దేశ ప్రజలందరినీ సంఘటితపరచి, తద్వారా ఎన్నికలలో ప్రయోజనం పొందాలని బీజేపీ ఎత్తుగడలు వేస్తోంది. ముస్లింలకు రిజర్వేషన్లు అవసరమే లేదని వితండవాదం చేస్తోంది. అయితే అదృష్టవశాత్తూ ఆ పార్టీ పాచిక పారలేదు. ముస్లింలలో వెనుకబడిన వారికి రిజర్వేషన్లు ఎందుకు ఇవ్వకూడదని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. కర్నాటకలో మొన్నటి వరకూ అధికారం చెలాయించిన బసవరాజ్ బొమ్మై ప్రభుత్వం సుప్రీంకోర్టు ధర్మాసనం అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పలేక ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వరాదన్న తన విధానాన్ని పక్కన పెట్టింది. ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమని సాక్షాత్తూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు.

ఉప-వర్గీకరణ జరిపితే...

ఓబీసీలకు సంబంధించి జాతీయ స్థాయిలో రోహిణి కమిషన్ ఇచ్చిన నివేదిక, ఉత్తరప్రదేశ్‌లో సామాజిక న్యాయ కమిటీ ఇచ్చిన నివేదిక ప్రస్తుతం బీజేపీ పరిశీలనలో ఉన్నాయి. ఈ రెండూ ఓబీసీలలో ఉప-వర్గీకరణ జరపాలని సిఫార్సు చేశాయి. అయితే ఒకప్పుడు జనసంఘ్ దీనిని వ్యతిరేకించింది. అయినప్పటికీ బీహార్, కేరళ, కర్నాటకలో దీనిని అమలు చేశారు. ప్రస్తుతం 11 రాష్ట్రాలలో ఓబీసీలలో ఉప-వర్గీకరణ అమలులో ఉంది. 2019 ఎన్నికల తర్వాత దేశంలో రాజకీయ ముఖచిత్రం మారిపోయింది. 2019లో బీజేపీకి వచ్చిన ఓట్లలో 44% ఓట్లు ఓబీసీలలోని అన్ని కులాల వారివీ కలిసి ఉన్నాయి. ఇప్పుడు ఓబీసీలలో ఉప-వర్గీకరణ జరిపితే బీజేపీకి లేనిపోని తలనెప్పులు ఎదురవుతాయి. ఓబీసీలను ఓ తరగతిగా విభజించేందుకు ఆ పార్టీ చేస్తున్న ప్రయత్నాలు ఇప్పటివరకూ విజయవంతమే అయ్యాయి. ఆ పార్టీ చిన్న చిన్న ఓబీసీలను ఆకర్షిస్తోంది. అదే సమయంలో ఓబీసీలు సంఘటితం కాకుండా ప్రయత్నిస్తోంది.

ఆర్థిక సమాచారం ఏది?
సర్వే వివరాలు బయటపెట్టని నితీష్ ప్రభుత్వం

దేశంలోనే మొట్టమొదటిసారిగా బీహార్‌లోని నితీష్ కుమార్ ప్రభుత్వం కులగణన నిర్వహించి, ఫలితాలు ప్రకటించింది. అయితే కులగణనతో పాటు సామాజిక-ఆర్థిక సమాచారాన్ని కూడా సేకరించినప్పటికీ దానిని బయటపెట్టలేదు. ఇందుకు నితీష్ ప్రభుత్వం ఎలాంటి కారణాలు చెప్పడం లేదు. కులగణన వివరాలు వెల్లడించి, సామాజిక ఆర్థిక సర్వే సమాచారాన్ని గోప్యంగా ఉంచడం వల్ల ఏ కులం వారు అభివృద్ధి చెందారో, ఏ కులం వెనుక బడి ఉన్నదో తెలియడం లేదు. కుల గణాంకాలు కేవలం రాజకీయ ప్రయోజనాలకు మాత్రమే ఉపయోగపడతాయి తప్పించి వాటివల్ల వేరే ఉపయోగం ఏమీ ఉండదు.

కులాల ఆర్థిక పరిస్థితులు తెలిసినప్పుడే దానికి అనుగుణంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను రూపొందించుకొని, అమలు చేయడం సాధ్యపడుతుంది. ఆర్థిక సమాచారాన్ని బయటపెడితే కుల రాజకీయాల స్థానంలో 'ఆర్థిక' రాజకీయాలు ముందుకు వస్తాయి. ఆయా కులాల వారు తమకు ఎన్నికల రాజకీయాల్లో సముచిత ప్రాధాన్యత కల్పించాలని, ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేస్తారు. కులగణన వివరాలు విడుదల చేసిన తర్వాత ముఖ్యమంత్రి నితీష్ కుమార్ అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న ప్రతిపక్ష పార్టీలు సామాజిక-ఆర్థిక సర్వే వివరాలు కూడా బయటపెట్టాలని డిమాండ్ చేశాయి. మైనారిటీలలో చీలిక తెచ్చేందుకు నితీష్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కొన్ని పార్టీలు ఆరోపించాయి కూడా. దీనిపై నితీష్ సమాధానమిస్తూ 45 రోజుల్లో ఆర్థిక సర్వే వివరాలు బయటపెడతామని చెప్పారు. నవంబర్-డిసెంబర్ నెలల్లో జరిగే బీహార్ శాసనసభ శీతాకాల సమావేశాల్లో సామాజిక-ఆర్థిక సర్వే వివరాలు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. బీహార్ రాజకీయాల్లో ఓబీసీల ఆధిపత్యం కొనసాగుతోంది. రాష్ట్రంలో ఓబీసీల జనాభా 10% పెరిగింది. ఓబీసీలలో కుర్మీలు, యాదవుల సంఖ్య అధికం. ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కుర్మీ కాగా ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ యాదవ కులానికి చెందిన వారు.

హైదరాబాద్ నగరంలో డ్రగ్స్ సరఫరా

- ఐదుగురు నిందితుల అరెస్ట్
- రెండు లక్షల విలువగల డ్రగ్స్ పట్టివేత

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగర శివార్లో డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముగ్గురు అంతర్రాష్ట్ర నిందితులతోపాటు నగరానికి చెంది న మరో ఇద్దరిని నార్కొటెక్ బృందాలు, చందానగర్ పోలీ సులు సంయుక్తంగా అరెస్టు చేశారు. నిందితుల నుంచి 18గ్రాముల ఎండీఎంఏ, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసు కున్నారు. వాటి విలువ రూ. రెండు లక్షలుంటుందని ఎస్పీ జీ.చక్రవర్తి తెలిపారు. బుధవారం విలేకరుల సమా వేశంలో వివరాలు వెల్లడించారు. గోవాకు చెందిన అఖిల్ ఎం.జీ, ఈస్ట్ గోదావరి జిల్లాకు చెందిన సూర్య కిషన్, రోహన్ పౌల్ ఒక ముఠాగా ఏర్పడ్డారు. గోవాలో ఓ హోట ల్‌లో పనిచేస్తున్న నిందితులు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే టూరిస్టులకు డ్రగ్స్ సరఫరా చేసేవారు. ఈ క్రమంలో వారికి హైదరాబాద్ హబ్సిగూడకు చెందిన తోట సురేందర్, బీలా అరుణ్ కుమార్ పరిచయమయ్యారు. డ్రగ్స్ సరఫరాతో వారి మధ్య స్నేహం బలపడింది. ఈ క్రమంలో గోవా నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతోపాటు హైదరాబాద్‌కు చెందిన వారికి డ్రగ్స్ సరఫరా చేస్తున్నారు. హైదరాబాద్‌కు డ్రగ్స్ సరఫరా అవుతున్నాయని సమాచారం అందుకున్న నార్కొటెక్ పోలీసులు ప్రత్యేక నిఘా వేశారు. గోవా నుంచి నిందితులు చందానగర్‌కు వచ్చినట్టు సమాచారంతో స్థానిక పోలీసులతో కలిసి ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

రవాణారంగ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఓలా,ఊబర్‌లకు ప్రత్యామ్నాయంగా కేంద్రం యాప్ తీసుకురావాలి

6న రాజ్‌భవన్ ముట్టడి : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రవాణ రంగ కార్మికుల సంక్షేమ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని తెలంగాణ పబ్లిక్, ప్రయివేటు రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ -సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.వీరయ్య, పి.శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఓలా, ఊబర్‌లకు ప్రత్యామ్నాయంగా కేంద్ర ప్రభుత్వమే ఆన్‌లైన్ యాప్ తీసుకురావాలని కోరారు. మోటార్ వాహన చట్టం-2019ని సవరించాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై ఈ నెల ఆరోతేదీన రాజ్‌భవన్‌ను ముట్టడిస్తామని ప్రకటించారు. ఈ మేరకు బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హులైన రవాణారంగ కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలనీ, కార్మికశాఖలో వారి పేర్లను నమోదు చేసి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరారు. కార్మికులు కోరిన చోట అడ్డా లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రవాణా రంగంలో పని చేస్తున్న కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ, పని భద్రత, సరైన పని గంటలు కల్పించి వారిని ఆదుకోవాలని కోరారు. జాతీయ పిలుపులో భాగంగా రాజ్‌భవన్ ముట్టడికి ఆటో, ట్రాక్టర్, లారీ, ట్రాలీ, జీపు, ట్రక్కు, స్కూల్ బస్సు, అంబులెన్స్, హైర్ బస్, డీసీఎం, మినీ డీసీఎం, హార్వెస్టర్, ప్రొక్లైనర్, క్యాబ్ తదితర వాహనాలలో పనిచేసే కార్మికులం దరూ వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

15 శాతం ఐఆర్ ప్రకటించాలి

సీఎస్ ఓఎస్డీ విద్యాసాగర్‌కు యూఎస్‌పీసీ వినతి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఐదు శాతం మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించడం పట్ల తీవ్ర అసంతృప్తి ఉందని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) విమర్శించింది. 15 శాతానికి తగ్గకుండా ఐఆర్ ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) ఓఎస్డీ విద్యాసాగర్‌ను బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో యూఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు కె జంగయ్య, చావ రవి, వై అశోక్‌కుమార్, పి నాగిరెడ్డి, టి లింగారెడ్డి, రామకృష్ణ, టి లక్ష్మారెడ్డి కలిసి వినతిపత్రం సమర్పించారు. రెండో పీఆర్సీ కమిటీని నియమించడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. ఐదు శాతం ఐఆర్ ప్రకటించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పుడున్న జీవన వ్యయ ప్రమాణాలు, పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా ఉద్యోగులు గౌరవప్రదంగా జీవించడానికి వీలుగా వేతనాలను నిర్ణయించాలని కోరారు. 2023, జులై ఒకటి నుంచి అమలు జరగాల్సిన పీఆర్సీ ఆలస్యం అవుతున్న సందర్భంగా ఐఆర్ ప్రకటించారని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పలు సందర్భాల్లో ఉద్యోగుల గౌరవప్రదమైన జీవితం కోసం మంచి వేతనాలు ఇస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. కానీ ఇటీవల ప్రకటించిన ఐఆర్ అందుకనుగుణంగా లేకపోగా ఉద్యోగులను అవమానించేలా ఉందని విమర్శించారు. ఐదు శాతం ఐఆర్‌ను సవరించి కనీసం 15 శాతం మంజూరు చేయాలని కోరారు.





తేలని న్యాయ పంచాయితీ

న్యూఢిల్లీ : బీహార్‌లో జరిగిన కులగణన వివరాలను గాంధీ జయంతి రోజున ప్రభుత్వం ప్రకటించింది. అయితే కులగణన జరపాలని నితీష్ కుమార్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ న్యాయస్థానాలలో దాఖలైన పిటిషన్లపై ఇప్పటికీ నిర్ణయం వెలువడలేదు. దీనిపై సుప్రీంకోర్టు తుది తీర్పు ఇవ్వాల్సి ఉంది. గోప్యతకు సంబంధించి గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కులగణన ఉల్లంఘిస్తోందని, పైగా సర్వే పేరుతో గణాంక సేకరణ జరిపారని, ఇది రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో లేని విషయమని పిటిషనర్లు వాదించారు.

కులగణనను వ్యతిరేకిస్తూ జనవరిలో సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలైనప్పటికీ వాటిపై విచారణ జరిపేందుకు న్యాయస్థానం నిరాకరించింది. ముందుగా హైకోర్టును ఆశ్రయించాలని సూచించింది. దీంతో సర్వే నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ పాట్నా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ఏప్రిల్ 18న విచారణ జరిపిన హైకోర్టు తాత్కాలిక ఊరట కల్పించాలన్న పిటిషనర్ల అభ్యర్థనను మౌఖికంగా తోసిపుచ్చింది. దీనిని వ్యతిరేకిస్తూ పిటిషనర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిని విచారించిన అత్యున్నత న్యాయస్థానం పిటిషనర్ల తాజా దరఖాస్తుపై సాధ్యమైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని హైకోర్టుకు సూచించింది.

దీనిపై మే 4న విచారణ జరిపిన పాట్నా హైకోర్టు సర్వేను నిలిపివేయాలంటూ ఆదేశించింది. బీహార్ ప్రభుత్వ చర్య పార్లమెంట్ అధికారాలలో జోక్యం చేసుకోవడమే అవుతుందని, ఈ ప్రక్రియ గణాంకాల సేకరణే అవుతుందని స్పష్టం చేసింది. కుల ఆధారిత సర్వేను నిర్వయించే అధికారం రాష్ట్రాలకు లేదని తెలిపింది. హైకోర్టు ఆదేశాలను బీహార్ ప్రభుత్వం సుప్రీంలో సవాలు చేసింది.

అయితే స్టే ఎత్తివేతకు న్యాయమూర్తులు నిరాకరించారు. సర్వే పేరుతో గణాంక సేకరణ జరిగిందా లేదా అనే విషయాన్ని పరిశీలించాల్సి ఉన్నదని తెలిపింది. ఈ వ్యవహారంపై పాట్నా హైకోర్టు ఆగస్ట్ 1న మరోసారి విచారణ జరిపింది. సర్వేను సమర్థిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీనిపై పిటిషనర్లు మరోసారి సుప్రీంకోర్టు తలుపు తట్టారు. ప్రస్తుతం వీటిపై న్యాయస్థానం తీర్పు ఇవ్వాల్సి ఉంది.

బీహార్ బాటలో ఒడిశా..!

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ బాటలో ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నడుస్తున్నారు. బీహార్ లో ఇటీవల కుల గణన నివేదికను ఆ రాష్ట్ర ప్రభుత్వం బయటపెట్టింది. లోక్‌సభ ఎన్నికలకు ముందే నవీన్ పట్నాయక్ ప్రభుత్వం కుల గణన చేపట్టి సర్వే వివరాలు విడుదల చేయాలని భావిస్తోంది. ఇందులో భాగంగా తొలుత వెనకబడిన తరగతుల జనాభా గణనకు పూనుకుంది. ఇప్పటికే రంగంలోకి దిగిన అధికారులు విస్తృతంగా సర్వే చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను త్వరలో విడుదల చేయనున్నట్టు తెలుస్తోంది. ఓబీసీ గణనపై తమ ప్రభుత్వం కమిట్ మెంట్ తో ఉందని బిజు జనతాదళ్ ఎమ్మెల్యే ఒకరు వ్యాఖ్యానించారు. అదే సమయంలో బీహార్ ప్రభుత్వం కుల గణన సర్వే నివేదిక విడుదల చేయడంతో దేశ వ్యాప్తంగా మళ్లీ చర్చ మొదలైంది. ఆ సర్వే ప్రకారం.. బీహార్ లో 63 శాతం జనాభా ఓబీసీ, ఈబీసీలే ఉన్నారు. ఒడిశాలో ఈ ప్రక్రియ పూర్తయ్యాక మిగతా రాష్ట్రాలపై సైతం కుల గణన చేయాలని ఒత్తిడి చేసే అవకాశం ఉంది. అసోంలో మాత్రం మైనార్టీల(ముస్లిం) జన గణనను ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ చేపట్టారు.

పలువురికి పదోన్నతులు

హైదరాబాద్: పలువురికి పదోన్నతులు కల్పిస్తూ వైద్యారోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖైరతాబాద్ జోన్ డీఎంహెచ్‌ఓగా డాక్టర్ పుట్ల శ్రీనివాస్, చార్మినార్ జోన్ డీఎంహెచ్‌ఓగా డాక్టర్ జీ.సీ.సుబ్బారాయుడు, కూకట్‌పల్లి డీఎంహెచ్‌ఓగా డాక్టర్ సభావత్ దుర్గా రామ్‌కుమార్‌తో పాటు మొత్తం 13 మందికి సివిల్ సర్జన్ పదోన్నతులు కల్పించారు.

సన్న బియ్యం పిరం

15రోజుల్లో 25కిలోల బస్తాపై రూ.200పైనే పెంపు

- వరిసాగు విస్తీర్ణం తగ్గుదల.. మార్కెట్‌లో డిమాండ్
- స్టాక్ బ్లాక్ చేస్తున్న మిల్లర్లు, ట్రేడర్లు
- ధరలు పెంచుతూ సామాన్యుడి నడ్డివిరుస్తున్న వైనం
- కొన్నింటిలో రేషన్ బియ్యాన్ని కలుపుతూ సొమ్ము చేసుంటున్న తీరు..

సన్న బియ్యం పిరమయ్యాయి. పక్షం రోజుల్లోనే క్వింటాల్ బియ్యంపై రూ.800 నుంచి రూ.1200వరకు ధర పెరిగింది. బీపీటీ రకం బియ్యం 25కిలోల బస్తా రూ.వెయ్యి నుంచి రూ.1250పైనే పలుకుతోంది. హెచ్ఎంటీ, జైశ్రీరాం రకాలు రూ.1450 నుంచి రూ.1650 వరకు పలుకుతున్నాయి. దీనంతటికీ రాష్ట్ర వ్యాప్తంగా వరి సన్నాల సాగు విస్తీర్ణం తగ్గడం ఒకెత్తయితే.. ఇదే అదనుగా మిల్లర్లు, ట్రేడర్లు స్టాక్ బ్లాక్ చేసి మరీ వారం రోజులకోమారు ధరలు పెంచుతున్నారు. ఇందులో కొత్తవి, పాతవి అంటూ అయోమయానికి గురి చేస్తున్నారు. మరోవైపు బీపీటీలాంటి సన్నరకం బియ్యంలో రేషన్ బియ్యాన్ని కూడా కలుపుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇంతలా ధరలు పెరిగి సామాన్యుడి నడ్డి విరుగుతున్నా.. ఆ ధరలను నియంత్రించాల్సిన ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తోంది.

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

సాధారణంగా వానాకాలంలో 60:40నిష్పత్తిలో సన్న, దొడ్డు రకం వరిసాగు చేస్తారు. యాసంగిలో సన్నరకాలపై వాతావరణ ప్రభావం ఎక్కువగా ఉండటంతో 30:70నిష్పత్తిలో వరి వేస్తారు. ప్రస్తుతం వరి ధాన్యానికి ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొంటోంది. అయితే దొడ్డు రకానికి, సన్న రకానికి మధ్య పెద్దగా తేడా లేకుండా మద్దతు ధర చెల్లిస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా సీజన్‌తో సంబంధం లేకుండా వానాకాలం, యాసంగి సీజన్లలో 70శాతం దొడ్డు రకాలే పండిస్తున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు.. దొడ్డు రకాలు పండిస్తే ఎకరాకు రూ.23వేల పెట్టుబడి అవుతుండగా 25క్వింటాళ్ల నుంచి 28 క్వింటాళ్ల వరకు ధాన్యం దిగుబడి వస్తోంది. సన్నరకం సాగు ఖర్చు చూస్తే రూ.30వేలు దాటుతుండగా.. దిగుబడి 18క్వింటాళ్ల నుంచి 20క్వింటాళ్లు కూడా రావడం లేదు. శ్రమకోర్చి, పెట్టుబడి పెట్టి మరీ సన్నాలు సాగు చేసే బదులు దొడ్డు రకం సాగువైపే మొగ్గు చూపుతున్నారు. ఈ వానాకాలంలో వరి సాగు చూస్తే.. కరీంనగర్ జిల్లాలో 2,66,778 ఎకరాలు, పెద్దపల్లి జిల్లాలో 2,01,408, జగిత్యాల జిల్లాలో 3,02,517, రాజన్నసిరిసిల్ల జిల్లాలో 1,74,181 ఎకరాల్లో సాగవుతుండగా.. అందులో 70శాతం మేర దొడ్డురకం పంటనే పండుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో వినియోగదారులు తినే సన్నాలే కావడం, దిగుబడి లేక మార్కెట్‌లో ఆ బియ్యానికి డిమాండ్ పెరిగింది.



బ్లాక్ చేస్తున్న మిల్లర్లు, ట్రేడర్లు

నెల రోజుల వ్యవధిలోనే సన్నరకం ధరలు అమాంతంగా పెరిగాయి. బీపీటీ, హెచ్ఎంటీ బియ్యం క్వింటాల్‌కు రూ.400పైగానే పెంచి అమ్ముతున్నారు. నెల కిందట క్వింటాల్ జైశ్రీరాం బియ్యం పాతవి రూ.5800ఉండగా వ్యాపారులు దాని ధర రూ.6200వేలకు పెంచి విక్రయిస్తున్నారు. హెచ్ఎమ్‌టి రూ.4600గా ఉన్న ధరను రూ.5వేలకు పెంచారు. బీపీటీ రూ.4400గా ఉన్న ధరను రూ.4800కు పెంచి అమ్ముతున్నారు. మార్కెట్‌లో 25కిలోల బీపీటీ బియ్యం బస్తా ధర మొన్నటి వరకు రూ.1100గా ఉండేది. ప్రస్తుతం రూ.1250కి పెంచారు. కొన్నిచోట్ల పాత బియ్యం పేరుతో రూ.1400వరకూ అమ్ముతున్నారు. ఒక్కసారిగా పెరిగిన సన్న బియ్యం ధరలతో ఏం కొనాలో ఏం తినాలో తెలియడం లేదని సామాన్యులు వాపోతున్నారు. ఇదే సమయంలో సన్నరకం బియ్యం (ప్రధానంగా బీపీటీ, జైశ్రీరాం) రకాల్లో రేషన్ బియ్యాన్ని కలుపుతున్నారు. 25కిలోల బస్తాలో కనీసంగా కిలో నుంచి 2కిలోల వరకూ కలుపుతున్నట్టు తెలుస్తోంది. మరోవైపు బియ్యం స్టాక్‌ను మిల్లర్లు, ట్రేడర్లు బ్లాక్ చేస్తున్నారు. కొత్త బియ్యాన్నే పాత బియ్యం కింద చూపుతూ విక్రయిస్తున్నారు. ఇలా మాయ చేసి మరీ దోచుకుంటున్న తీరు ప్రస్తుతం మార్కెట్‌లో రాజ్యమేలుతోంది. దీన్ని అరికట్టాల్సిన అధికారులు, ధరలను నియంత్రించాల్సిన ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తోంది.



పథకాల అమలులో చిత్తశుద్ధి లేదు

- ఓట్ల కోసం ప్రజాధనం దుర్వినియోగం
- ఎమ్మెల్యే వ్యాఖ్యలు అహంకారానికి నిదర్శనం : విలేకరుల సమావేశంలో జూలకంటి

నవతెలంగాణ-మిర్యాలగూడ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్న సంక్షేమ పథకాలకు నిధుల కేటాయింపు.. అమలు విషయంలో ఏమాత్రం చిత్తశుద్ధి లేదని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలను మభ్యపెట్టేందుకు.. మళ్లీ మోసం చేసేందుకు మోడీ, కేసీఆర్ కొత్త పథకాలు, నిధులు ప్రకటిస్తున్నారని చెప్పారు. క్షేత్రస్థాయిలో వాటిని అమలు చేయడం లేదన్నారు. ఓట్ల కోసం ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని, ఆ పార్టీల కార్యకర్తలకే సంక్షేమ పథకాలు అందిస్తూ నిజమైన అర్హులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. యూనిట్ల వారీగా పథకాలు మంజూరు చేసి ఆ సామాజిక తరగతి మొత్తం డబ్బులను పంచుకోవాలని సూచించడం సరైంది కాదన్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చేందుకు, కాంగ్రెస్‌ను అడ్డుకునేందుకు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు నాటకాలు ఆడుతున్నాయని విమర్శించారు. గల్లీలో కుస్తీ.. ఢిల్లీలో దోస్తీ చేసుకుంటున్నారన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు అహంకారంతో ప్రజలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాసమస్యలపై సమాధానం చెప్పలేక దుర్భాషలాడుతున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు డాక్టర్ మల్లు గౌతమ్ రెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, తిరుపతి రామ్మూర్తి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

- రాష్ట్ర ఉన్నత విద్యామండలి భవనం ముందు కాంట్రాక్ట్ లెక్చరర్ల ధర్నా

నవతెలంగాణ-అంబర్‌పేట

రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న 1445 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి భవనం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆల్ యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ జేఏసీ చైర్మెన్ డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోధ్ మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని 153 రోజుల నుంచి విశ్వవిద్యాలయాల్లో అనేక విధాలుగా సదస్సులు, రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌లు, నిరసనలు, రిలే నిరాహార దీక్షలు చేసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. అనేక సార్లు యూనివర్సిటీ అధికారులను, ప్రభుత్వ అధికారులను, విద్యాశాఖ మంత్రిని కలిసినా ప్రయోజనం లేదన్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లోనే 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులందరూ విధుల్ని బహిష్కరించి నిరవధిక సమ్మెకు వెళ్లారని తెలిపారు. తెలంగాణ ఆల్ యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ జేఏసీ వర్కింగ్ చైర్మెన్ డాక్టర్ ఎం.రామేశ్వరరావు మాట్లాడుతూ.. డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను ఏ విధంగా అయితే రెగ్యులరైజ్ చేశారో అలాగే యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను కూడా చేయాలని డిమాండ్ చేశారు. జేఏసీ కన్వీనర్ డాక్టర్ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ.. ఉన్నత విద్యామండలి చైర్మెన్ స్పందించి కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు.



న్యూస్ క్లిక్‌పై దాడి పత్రికా స్వేచ్ఛను హరించటమే..

- డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు కోట రమేష్, అనగంటి వెంకటేష్
- ఆర్టీసీ క్రాస్ రోడ్డులో నిరసన ప్రదర్శన

నవతెలంగాణ - ముషీరాబాద్

ఆన్‌లైన్ పోర్టల్ న్యూస్ క్లిక్ కార్యాలయంపై పోలీసులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, అది పత్రిక స్వేచ్ఛను హరించడమేనని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు కోట రమేష్, అనగంటి వెంకటేష్ అన్నారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్డులో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కోట రమేష్ మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రశ్నించే వ్యక్తులపైనా, సంఘాలు, మీడియా సంస్థలపైనా అక్రమంగా కేసులు పెట్టి జైల్లో పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

న్యూస్ క్లిక్ కార్యాలయంపైనా, సిబ్బంది ఇండ్లపైనా ఢిల్లీ పోలీసులు తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు దాడులు నిర్వహించి.. ఉగ్రవాద నిరోధక చట్టం కింద న్యూస్ క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పుర్కయాస్థ, పోర్టల్ హెచ్ఆర్ విభాగం అధిపతి అమిత్ చక్రవర్తిని అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. నిజాలు చెప్పే న్యూస్ క్లిక్‌పై మోడీ సర్కార్ కక్షగట్టిందన్నారు. ఏమాత్రం పసలేని చైనా కుట్ర థియరీని తెరపైకి తీసుకొచ్చి న్యూస్ క్లిక్‌తో సంబంధం ఉన్న జర్నలిస్టులను, కళాకారులను, చరిత్రకారులను అరెస్టు చేయడం దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని అన్నారు. అనగంటి వెంకటేష్ మాట్లాడుతూ.. స్వతంత్ర మీడియా గొంతు నొక్కేందుకు దానిపై బనాయించిన తప్పుడు కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ బషీరుద్దీన్, డి.తిరుపతి, గడ్డం వెంకటేష్,పి.జగన్, శివ వర్మ, సహాయ కార్యదర్శులు జావేద్, భాస్కర్, తిరుపతి, నవీన్, హరిక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేను సీఎం కావాలంటే మోడీ ఎన్‌ఓసీ అక్కర్లేదు

(మొదటిపేజీ తరువాయి)

సిలిండర్ రూ.400 ఉండగా మోడీ ప్రధాని అయ్యాక ఏకంగా రూ.1450కి చేరిందని తెలిపారు. అప్పట్లో సిలిండర్ ధర పెరిగితే అప్పటి ప్రధాని మన్మోహన్‌ను మోడీ తీవ్రంగా విమర్శించారని, మరి ఈ రోజు బీజేపీని ఏమని తిట్టాలని ప్రశ్నించారు. రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మీ, నిర్మల్ జిల్లా సాకారం, మెడికల్ కళాశాల, తదితర పథకాలు అందించిన కేసీఆర్‌ను బండి సంజయ్ దెయ్యంతో పోల్చడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే ఒక్కొక్కరి ఖాతాల్లో రూ.15లక్షల చొప్పున జమ చేస్తామని చెప్పిన మోడీ ఇంత వరకు ఒక్క రూపాయి వేయలేదని విమర్శించారు.

ఆ రూ.15లక్షలు ఎక్కడ పోయాయో బీజేపీ నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ సచ్చిన పాముతో సమానమని విమర్శించారు. ఆరు గ్యారంటీలతో సచ్చిన పామును లేపే ప్రయత్నం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ, కాంగ్రెస్ దొందు దొందేనని విమర్శించారు. ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరుతున్న కాంగ్రెస్ 70ఏండ్ల పాలనలో ఏం చేసిందో చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మీ, ఎమ్మెల్సీ దండె విఠల్, నీటిపారుదలశాఖ కార్పొరేషన్ చైర్మెన్ వేణుగోపాలచారి, ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్, బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్‌జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒకే తానుముక్కలు ప్రకాష్ జవదేకర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒకే తానుముక్కలని బీజేపీ తెలంగాణ ఎన్నికల ఇన్‌ఛార్జీ ప్రకాష్ జవదేకర్ విమర్శించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్ గతంలో కలిసి పోటీ చేశాయనీ, కాంగ్రెస్‌లో గెలిచిన ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో చేరారనీ, బీఆర్ఎస్‌ను ఎన్డీఏలో చేర్చుకునేది లేదని స్పష్టమైందని తెలిపారు. బీఆర్ఎస్‌పై పోరాడేది ఒక్క బీజేపీ మాత్రమేనని చెప్పారు.

నీటి వాటా తేల్చని అసమర్థుడు మోడీ

తెలంగాణలో బీజేపీకి స్థానం లేదు

- రేవంత్ జైలుకెళ్లడం ఖాయం
- ప్రతిపక్షాలకు దిమ్మతిరిగేలా బీఆర్ఎస్ మ్యానిఫెస్టో : మంత్రి తన్నీరు హరీశ్‌రావు

నవ తెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి/ కోస్గి



మాట్లాడుతున్న మంత్రి తన్నీరు హరీశ్‌రావు, మంత్రి మహేందర్ రెడ్డి

"రాష్ట్రం ఏర్పడి పది సంవత్సరాలు దాటినా నేటికీ తెలంగాణ జలాల వాటా తేల్చని అసమర్థుడు ప్రధాని మోడీ. పార్లమెంటులో తెలంగాణ అభివృద్ధిని మెచ్చుకుంటూ.. రాష్ట్రానికి వచ్చి పచ్చి అబద్దాలు మాట్లాడారు.. బీజేపీకి అసలు తెలంగాణలో స్థానమే లేదు" అని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా కొత్తకోట మండల కేంద్రంలో, నారాయణపేట జిల్లా కోస్గి మున్సిపాలిటీ కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రగతి నివేదన సభల్లో మంత్రి ప్రసంగించారు.

రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్న తాము వచ్చే ఎన్నికల సందర్భంగా మహిళల కోసం కూడా బృహత్తర పథకాన్ని ప్రవేశపెట్టబోతున్నామని చెప్పారు. దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి నిరంతరం సాగునీటి కోసమే పరితపించేవారని గుర్తు చేశారు. ఇప్పుడు కొత్తకోటలో 30 పడకలు, దేవరకద్రలో వంద పడకల ఆస్పత్రిని నిర్మించి మెరుగైన వైద్యాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. మెడికల్ కళాశాలలో నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్య అందించినట్టు అవుతుందన్నారు. పార్లమెంట్‌లో సీఎం కేసీఆర్‌ని మెచ్చుకున్న మోడీ తెలంగాణలోకి రాగానే తిట్టడం ఆయనకు అలవాటే అని విమర్శించారు. కుటుంబ పాలన మోడీ క్యాబినెట్‌లోనే ఉందన్నారు.

ఢిల్లీలో మోడీని కలవడానికి వెళ్లినప్పుడు.. కేసీఆర్ నీకు ఎప్పుడూ నీటి సంగతేనా, రైతుల అభివృద్ధి గురించే మాట్లాడతావా అని మెచ్చుకుని.. రాష్ట్రానికి వచ్చి కుటుంబ పాలన గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేసీఆర్ కుటుంబ సభ్యులు ప్రజల మద్దతుతో గెలిచి నాయకులుగా ఎదిగారని చెప్పారు. ఐదు హామీలతో కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ చెప్పిన పథకాలు అమలు చేయకుండా ప్రభుత్వం చితికిల పడిందని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యేల కొనుగోలు ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డి తప్పు చేశారు.. ఇవాల కాకపోతే రేపు విచారణ అయ్యేది ఖాయం.. ఆయన జైలుకు పోయేది పక్కా అని అన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో ప్రజా సమస్యలను పరిష్కరించక పోతేనే ఆయన్ని మల్కాజిగిరికి పంపారని చెప్పారు. ఎమ్మెల్యేగా గెలిపించిన కొడంగల్ ప్రజలకు రేవంత్ రెడ్డి ఒక్క ఆస్పత్రి కూడా తేలేదని, నేడు నరేందర్ రెడ్డి ముఖ్యమంత్రి అండతో మూడు ఆస్పత్రులను ప్రారంభించారన్నారు. ఎవరు ఎన్ని జిమ్మిక్కులు చేసినా తెలంగాణలో బీజేపీకి స్థానం లేదన్నారు. కాంగ్రెస్ గెలిచేది లేదు.. హ్యాట్రిక్ ముఖ్యమంత్రి కేసీఆరేనని అన్నారు. పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించుకున్నామని, కృష్ణమ్మ నీరు బిరబిరా నార్లపాడు రిజర్వాయర్లో పడ్డాయన్నారు. ఏడాదిలోగా మీ పొలం వాకిట్లోకి కృష్ణమ్మ నీరు వస్తుందని చెప్పారు. త్వరలో నారాయణపేట జిల్లాలో మెడికల్ కళాశాలను ప్రారంభించబోతున్నామని, రూ.150 మంజూరు చేశామని అన్నారు. గ్రూపు తగాదాలతో కొట్లాడుకొని ఏమవుతుందో వాళ్లకే తెలియని పరిస్థితిలో కాంగ్రెస్ పార్టీ ఉన్నదని సమాచార శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాష్ అన్నారు. బీజేపీ ఉనికి కోల్పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు, టీఎస్ ఎంఐడిసి చైర్మెన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, నారాయణపేట డీసీసీబీ చైర్మెన్ నిజాం పాషా, ఈజీఎస్ డైరెక్టర్ ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన

- ఎమ్మెల్యేల కార్యాలయాల ముట్టడి
- రోడ్లు ఊడ్చిన ఆశాలు



నవతెలంగాణ- విలేకరులు

సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, ఆశాలు బుధవారం వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేల కార్యాలయాలను ముట్టడించారు. ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేశారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెంలో మధ్యాహ్న భోజన కార్మికులు కండ్లకు గంతలు కొట్టుకొని నిరసన తెలిపారు. భద్రాచలంలో ఎమ్మెల్యే పొదెం వీరయ్య క్యాంపు కార్యాల యాన్ని ముట్టడించారు. కార్మికుల సమస్యలు విన్న ఎమ్మెల్యే పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. దమ్మపేట మండలం, తాటిసుబ్బనగూడెంలో ఎమ్మెల్యే నివాసాన్ని ముట్టడించారు. మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన సమ్మె నల్లగొండ జిల్లా కేంద్రం లోని డీఈఓ కార్యాలయం ఎదుట సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో నూతన ఆర్డీఓ కార్యాలయాన్ని ప్రారం భించేందుకు వచ్చిన ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్‌ను మధ్యా హ్నభోజన కార్మికులు అడ్డుకున్నారు. వినతిపత్రాన్ని అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్య లపై సీఎం కేసీఆర్‌తో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మఠంపల్లి మండలంలో కార్మికులు భిక్షాటన చేశారు. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలో ఆశాల సమ్మెకు సీఐటీయూ మండల కన్వీనర్ నీలా రామ్మూర్తి మద్దతు తెలిపారు. మునగాల మండలంలో మాజీ ఎమ్మెల్యే ఉత్తమ్‌పద్మావతిరెడ్డి సంఘీభావం తెలిపారు.

రోడ్లు ఊడ్చిన ఆశాలు

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాలానగర్ మండల కేంద్రంలోని నర్సాపూర్ చౌరస్తాలోఆశావర్కర్లు రోడ్లు ఊడుస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం పెద్దతండా వద్ద ఆశాలు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట, ఆళ్లపల్లిలో భిక్షాటన చేశారు.

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్‌గా

బక్కి వెంకటయ్య ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్‌గా బక్కి వెంకటయ్య ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రులు హరీశ్ రావు, జగదీశ్ రెడ్డి, సత్యవతి రాథోడ్‌తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు కొత్త ప్రభాకర్ రెడ్డి, బీబీపాటిల్, ఎమ్మెల్యేలు మదన్ రెడ్డి, రవీందర్ నాయక్, కంచర్ల భూపాల్ రెడ్డి, గ్యాదరి కిషోర్, గువ్వల బాలరాజు, నోముల భరత్ తదితరులు పాల్గొన్నారు. చైర్మెన్‌తో పాటు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

న్యాయం జరిగేలా చూస్తా

డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్, మహాత్మాజ్యోతిభా ఫూలే ఆశయసాధనలో బడుగు, బలహీనవర్గాలకు తన పరిధిలో సాధ్యమైనంత వరకు న్యాయం జరిగేలా చూస్తానని తెలిపారు. తనకు అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు, మంత్రి హరీశ్ రావుకు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డికి వెంకటయ్య ధన్యవాదాలు తెలిపారు.

మనుషులను చంపగలరేమో కానీ
వారి ఆదర్శాలను మాత్రం కాదు - భగత్‌సింగ్

సంపాదకీయం

'న్యూస్‌క్లిక్'పై దుర్మార్గం

మేకపిల్లను తినదలచుకున్న తోడేలు ఏం చేసింది అన్న కథ తెలిసిందే. తోడేలుకు తర్కంతో పని లేదు, నీళ్లు మురికి చేసిందన్న మేకపిల్ల కాలువ చివరన ఉందన్న వాస్తవంతో నిమిత్తం లేదు. గత మూడేండ్లుగా వేటాడుతున్నప్పటికీ ఒక్క కారణం కూడా దొరకక పోవటంతో చివరకు నిరం కుశ అధికారంతో న్యూస్‌క్లిక్ సంస్థ మీద

> అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపలేరు - పురచేతిని ముందుకు చాచి తిరగబడిన జనాన్ని నిలువరించలేరు అన్న వాస్తవాలు తెలిసినప్పటికీ అధికార మదం, దానికి మతోన్మాదం తోడైన పాలకులకు తాము అనుకున్నదాన్ని చేశామా లేదా అని తప్ప పర్యవసానాలతో పనిలేదు. దేనికైనా సమయం వస్తుంది. తొలి స్వాతంత్ర్య సమరం విఫలమైన 90 ఏండ్లకు జనప్రభంజనంతో బ్రిటీష్ వాడు తోక ముడిచాడు. న్యూస్‌క్లిక్ వ్యాపార సంస్థకాదు, ప్రజా ఉద్యమాల గొంతుకగా ఉన్నదాన్ని జనం కాపాడుకుంటారు.

ఉగ్రవాద ముద్రవేసి అణచివేతకు పూనుకుంది, అంతే! ప్రభుత్వం, దాన్ని తెర వెనుక నుంచి ఆడించే సంఘ పరివార్ సంస్థల భావ జాలం, కుట్రలు, దుండగాల గురించి జనాన్ని చైతన్యం చేస్తున్న మీడియా సంస్థల సంగతి చూడాలని ఎప్పుడో నిర్ణయించుకున్న కేంద్ర ప్రభుత్వ దురంతాన్ని చూసి దేశంలోని యావత్ జర్నలిస్టులు నివ్వెర పోతున్నారు. తాము పని చేస్తున్న ఏ సంస్థ అయినా ప్రభుత్వాన్ని విమర్శిస్తూ రాస్తే లేదా టీవీల్లో చూపితే తమకూ ఇదే గతి పడు తుందా అని భయపడుతు న్నారు. న్యూస్‌క్లిక్ మీద దాడి ద్వారా సంఘ పరివార్ పెద్దలు తమ మీద రాసే విమర్శనాత్మక మీడియా సంస్థలకు వాటిలో పని చేసే జర్నలిస్టులకూ పంపదలచిన సందేశమదే. బహుశా ప్రపంచంలో ఏ మీడియా కంపెనీ మీదా ఇంత దుర్మార్గానికి ఏ ప్రభుత్వమూ పాల్పడి ఉండదు. ఏవైనా అక్రమాలు జరిగితే సంస్థ యజమా నులు, కీలకమైన బాధ్యతల్లో ఉన్న వేళ్ల మీద లెక్కించదగిన ముఖ్యుల మీద కేసులు మామూలే. కానీ వందల మంది ఢిల్లీ పోలీ సులు ఒక్కసారిగా తెగబడి వంద ఇళ్ల మీద దాడులు చేసి యాభై మందిని నిర్బంధిం చటం స్వతంత్ర భారత చరిత్రలో ఇంత వరకు జరిగి ఉండదు. దాడులకు గురైన ఇండ్లలో జర్నలిస్టులు, మాజీ సిబ్బంది, సంస్థ కోసం పని చేసే కాంట్రాక్టర్లవి ఉన్నాయి.

న్యూస్‌క్లిక్ చైనా నుంచి నిధులు పొంది దేశవ్యతిరేక రాతలు రాస్తు న్నదన్న ఆరోపణకు ఒక్కటంటే ఒక్క ఆధారం లేదు. ఫలానా తేదీ, ఫలాన విశ్లేషణ అలా ఉంది అనేందుకు ఒక్క ఉదాహరణ కూడా లేదు. గాలిపోగేసి జరుపుతున్న ప్రచారదాడి, ఆ సాకుతో అణచివేతకు ఎప్పటి నుంచో చూస్తున్నారు. ఆర్థికరపరమైన అవకతవకలేమీ దొరక్క చివరకు ఉగ్రవాద ముద్రవేశారు. భీమా కొరెగావ్ కేసులో నిందితుల



కంప్యూటర్లలో పోలీసు ఏజంట్లు కట్టుకథల సమాచారాన్ని చేర్చి దాన్నే సాక్ష్యాలుగా చూపిన దుర్మార్గం తెలిసిందే. ఇప్పుడు న్యూస్‌క్లిక్ కార్యాలయం, సిబ్బంది నుంచి స్వాధీనం చేసుకున్న వాటిలో అదే పునరావృతం అయినా ఆశ్చర్యం లేదు. చైనా నిధుల గురించి నిర్దిష్టమైన సమాచారం ఉంటే అక్కడి ప్రభుత్వానికి రాసి వివరాలు తెలుసుకోవచ్చు. చైనాతో సంబంధా లున్నట్లు వచ్చిన వార్తలను చూశామని వాటి ప్రామాణికత మీద మాట్లాడ లేమని అమెరికా వ్యాఖ్యానించింది. నిజానికి ఈ కుట్రలో అమెరికా పత్రిక న్యూయార్క్ టైమ్స్ కూడా తన పాత్ర పోషించింది. అమెరికా ప్రభుత్వం అదే నాటకం ఆడుతున్నది.

తమ అవినీతి, విధానాల మీద రాసినందుకు బ్రిటీష్ పాలకులు 1807లోనే బెంగాల్ గజెట్ పత్రికను తొలిసారిగా మూసివేశారు. తరువాత అనేక పత్రికల ముద్రణా యంత్రాలు, కార్యాలయాలను స్వాధీనం చేసుకున్న చరిత్ర తెలిసిందే. 1910లో తెచ్చిన చట్టంతో వెయ్యికి పైగా పత్రికలను మూసివేశారు. ఎందరో జర్నలిస్టులు మీద, పని చేస్తున్న పత్రికల మీద దేశద్రోహ నేరాలు మోపి కేసులు పెట్టారు, జైలుపాలు చేశారు. హితవాద పత్రికలో ప్రభుత్వ వ్యతిరేక విమర్శలు రాసిన జర్నలిస్టు పేరు చెప్పాలని వేధించింది, హిందూస్థాన్ టైమ్స్ పత్రిక కార్యాలయాల మీద దాడులు చేసింది. న్యూస్‌క్లిక్ మీద దాడులు చేసిన తీరు నాటి ఉదంతాలను కళ్ల ముందుంచింది. తెల్ల వారి పాలనలో ఎంత నిర్బంధం పెరిగితే అంతగా కొత్త పత్రి కలు రంగంలోకి వచ్చాయి. ఐదేళ్ల జైలు, అధికారిక రహస్యాల వెల్లడినేర చట్టం పేరుతో చివరికి మరణశిక్ష విధించేందుకు పూనుకుంది. రౌలట్ చట్టం ద్వారా ఎలాంటి విచారణ లేకుం డానే నిర్బంధించే నిరంకుశ చర్యలకూ దిగింది. దానిలో పత్రికల రాతలను అడ్డుకోవటం ఒక ప్రధాన లక్ష్యం. ఇప్పుడు న్యూస్‌క్లిక్ సంస్థ మీద మోపిన ఉపా ఉగ్రవాద చట్టం కూడా అలాంటిదే. నాడు వలస పాలకులు- నేడు మన స్వంత పాల కులు అన్న తేడా తప్ప అణచివేత సేమ్ సేమ్. అర చేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపలేరు - పురచేతిని ముందుకు చాచి తిరగబడిన జనాన్ని నిలువరించలేరు అన్న వాస్తవాలు తెలిసినప్పటికీ అధికార మదం, దానికి మతోన్మాదం తోడైన పాలకులకు తాము అనుకున్నదాన్ని చేశామా లేదా అని తప్ప పర్యవసానాలతో పనిలేదు. దేనికైనా సమయం వస్తుంది. తొలి స్వాతంత్ర్య సమరం విఫలమైన 90 ఏండ్లకు జన ప్రభంజనంతో బ్రిటీష్ వాడు తోక ముడిచాడు. న్యూస్‌క్లిక్ వ్యాపార సంస్థకాదు, ప్రజా ఉద్యమాల గొంతుకగా ఉన్నదాన్ని జనం కాపాడుకుంటారు. బ్రిటీష్ పాలకులు ఒక పత్రికను మూసివేస్తే మరోపేరుతో కొత్త పత్రిక రంగంలోకి వచ్చినట్లు మరో పేరుతో ప్రజాగళం పురుడు పోసుకుంటుంది. ఇది చరిత్ర చెప్పిన సత్యం.

సనాతన ధర్మంపై పోరాటం ఆగకూడదు...



ఆర్.రఘు
9490098422


సనాతన ధర్మం ఓ అధర్మమని, ఆ అధర్మంపై పోరాటం అది పుట్టినప్పటి నుండి ఏదో ఒక రూపంలో జరుగుతూనే ఉన్నదన్న వాస్తవాన్ని మర్చిపోరాదు. వాస్తవానికి సనాతన ధర్మం అనేది ప్రగతిశీల ధర్మాలపైన సాంఘిక వ్యవస్థలోని క్రూరమైన ఆచారాలను అంగీకరింపచేయడానికి లేపబడ్డ ప్రతిఘాత అభివఅద్ధి నిరోధక భావజాలానికి ప్రతీక. గత కొంతకాలంగా మన దేశంలో జరుగుతున్న సనా తన ధర్మంపై చర్చ 3000 యేండ్ల క్రితంతో పోలిస్తే పూర్తి భిన్నమైన భౌతిక పరిస్థితులలో జరుగుతున్నది. కానీ, నాటికి నేటికీ ఈ సనాతన ధర్మం అన్నది స్పష్టమైన దోపిడీ వర్గాల ప్రయోజ నాల నిమిత్తం లేవనెత్తబడుతున్నది. మార్క్సిస్టు మహోపాధ్యాయుడు ఏంగెల్స్ "16వ శతాబ్దంలో మత యుద్ధాలుగా చెప్పబడిన వాటిలో కూడా నిర్దిష్టమైన భౌతికవర్గ ప్రయోజనాలు ఉన్నాయి. ఆ తర్వాత కాలంలో ఇంగ్లాండు, ఫ్రాన్స్‌లలో జరిగిన ఘర్షణలన్నీ కూడా వర్గ యుద్ధాలే. మత గురువుల చేతుల్లో ఇతర అన్ని విజ్ఞాన శాఖల వలనే రాజకీయాలు, న్యాయశాస్త్రం కూడా మతశాస్త్రంలో అంతర్భాగాలు. ఈ పరిస్థితులలో భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా ఉద్దేశితమైన సాధారణ విమర్శలన్నీ చర్చికి వ్యతి రేక విమర్శలు. అన్ని సామాజిక రాజకీయ విప్లవ సిద్ధాంతాలు తప్పనిసరిగా మతశాస్త్రంపై తిరుగుబాటులుగా కూడా ఉండక తప్పదు. నాటి సామాజిక పరిస్థితులను ఎదిరించాలంటే వాటిపై ఉన్న గౌరవభావాన్ని ముందుగా తొలగించాలి" అని జర్మనీలో రైతు యుద్ధం అనే తన ప్రసిద్ధ గ్రంథంలో పేర్కొ న్నారు. అలానే 1961లో ఢిల్లీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎం.ఎస్.శ్రీనివాస్ "కార్యాచరణ ప్రాధాన్యాన్ని భగవద్గీత యోగవైశిష్ఠం, గీతా రహస్యం, బంకించంద్ర చటర్జీ ఆనంద మఠం, వివేకానంద, గాంధీ, రాధాకృష్ణన్ లాంటి వారందరూ నొక్కి చెప్పారు. కానీ ఇదంతా వేదాంత భావాల పరిధికి లోబడే జరిగింది. మతానికి వ్యతిరేకంగా శాస్త్ర జ్ఞాన ప్రాతిపదికపై కార్యాచరణ కొనసాగించవలసిన ఆవశ్యకతను పరిశీలించ వలసిన సమయం ఆసన్నమైంది" అని అన్నారు.

సనాతనాన్ని నిలబెట్టిన త్రిమూర్తులు

సనాతన ధర్మాన్ని నిలబెట్టిన వారు ఒకరు చాణుక్యుడు. రెండవవాడు మనువు. మూడవ వాడు శంకరాచార్యుడు. చాణుక్యుడు ఆర్థిక, రాజకీయ రంగంలో, మనువు సామాజిక రంగంలో, శంకరుడు తాత్విక రంగంలో సనాతన ధర్మం పేరిట హిందూ మతాన్ని, దానికి జవసత్వాలను పొందుపరిచే చాతుర్వర్ణ వ్యవస్థను నిలబెట్టారు. అందుకు నాటికి ఉన్న బ్రాహ్మణ లేక వైదిక మతానికి వ్యతిరేకంగా సామాజిక విప్లవంలా సాగుతున్న బౌద్ధ, జైనాలను, సాంఖ్యతత్వాన్ని, చార్వాక లేదా లౌకికవాదులను, వారి వాదనలను వివిధ రకాలుగా అంతం చేశారు. వర్ణ వ్యవస్థను ఒక శాశ్వత మైనదిగా, అది భగవంతుని సృష్టిగా నమ్మించారు. క్రీస్తు పూర్వం 6, 5 శతాబ్దాల నుండి ప్రారంభమైన ఈ ముప్పేట దాడి క్రీస్తు శకం 8, 9 శతాబ్దాల వరకు సాగింది. అంటే దాదాపు 1500 సంవత్సరాల పాటు తాత్విక, సామాజిక రంగంలో ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో బలమైన రాజ్యాంగ వ్యవస్థగా బ్రాహ్మణ క్షత్రియ ద్వయం వ్యవహరించింది. తర్వాత కాలంలో మధ్య ఆసియా నుండి వచ్చి స్థిరపడ్డ మొఘలులు, మహమ్మద్ తుగ్లక్ తదితర ఇస్లాం ఆరాధకుల పాలన, అనంతరం బ్రిటీష్ పెట్టుబడిదారుల పాలన 6, 7 వందల ఏండ్లు సాగినప్పటికీ పై త్రయం నిర్మించిన కుల వ్యవస్థ దానికి అండగా ఉన్న సనాతన హిందూ ధర్మం పెద్దగా చెక్కు చెదరలేదు. కానీ స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో మత సామరస్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం వంటి నినాదాలు ఊపందుకున్నాయి. బలమైన కుల వ్యవస్థ వ్యతిరేక పోరాటాలు, బ్రాహ్మణ వ్యతిరేక పోరాటాల రూపంలో పెల్లుబికాయి. వాటి పర్యవసానంగానే దేశ విభజన అనంతరం భారత దేశం ఒక లౌకిక రాజ్యాంగా ఏర్పడింది. అయిన ప్పటికీ సనాతన ధర్మం సమాజాన్ని వెంటాడు తూనే ఉంది. తాజాగా హిందుత్వ ఫాసిస్టు శక్తులు అధికారంలోకి వచ్చిన తరువాత మరలా తిరిగి 3వేల ఏండ్ల నాటి చర్చ ఆధునిక పద్ధతులలో పునరుద్ధరించబడుతున్నది.

సనాతనం ఆధారంగా అధికారం

తమిళనాడు రాష్ట్ర మంత్రి స్టాలిన్ వ్యాఖ్యలపై బహిరంగ దుమారం బీజేపీ రేపినా, అది తమకే నష్టమని భావించి వెనక్కి తగ్గినట్లు కనబడుతుంది. కానీ చాప కింద నీరులా సనాతన ధర్మ ప్రచారాన్ని అసంఖ్యాక పద్ధతులలో హిందుత్వ శక్తులు ప్రేరేపిస్తున్నాయి. సాంఘిక మాధ్యమాన్ని పెద్ద ఎత్తున వినియోగిస్తున్నారు. తాజాగా ఆర్‌ఎస్‌ఎస్ అధికార పత్రిక 'ది ఆర్గనైజర్'లో సంపాదకత్వాలు వస్తూనే ఉన్నాయి. సనాతన ధర్మం వెలుగులో మహిళా బిల్లు, సనాతన ధర్మం వెలుగులో మతమార్పిడి బిల్లు... ఇలా ప్రతి దానికి 'సనాతన ధర్మం వెలుగు'ని కలిపి చెప్పటం కనబడుతున్నది. క్రైస్తవ మతానికి జీసస్ క్రీస్తు చెప్పి నది ఆచరించడం. ఇస్లాం మతానికి మహమ్మద్ ప్రవక్త చెప్పినది ఆచరించడం. అటువంటిది హిందూ మతంలో ఉండదు. ఈ మతం ఆచరిం చేది వేదాలను. వేదాలు ఎవరూ రాసినవి కాదు. అవి ఆకాశవాణి ద్వారా చెప్పబడ్డవి. వినబడ్డవి. ఆ తర్వాత కాలంలో రాయబడ్డవి. అందు వలనే అవి అన్నింటికన్నా గొప్పవి అని వారు ఊదరగొడుతున్నారు. హిమాలయాల నుండి హిందూ మహాసముద్రం వరకు ఉన్న భూభాగంలో ఉన్న వారందరూ హిందు వులే అని, ఈ మధ్య అమిత్ షా, మోడీలు చెబుతున్నారు. భారతీ యులందరూ హిందువులే అంటే హిందువులు కాని వారు భారతీయులు కాదు అని అర్థం. ఈ దేశంలో ఉన్న వారందరూ సనాతన ధర్మాన్ని గౌరవించాల్సిందే. గౌరవించని వారికి ఈ దేశంలో పౌరులుగా ఉండే హక్కు లేదు. ఈ విధంగా ఇండియా అంటే భారత్ అని, భారత్ అంటే హిందూ అని, హిందూ అంటే వైదిక ధర్మం ఆచరించే వారని, వైదిక ధర్మం అంటే సనాతన ధర్మం అని కాబట్టి సనాతన ధర్మాన్ని వ్యతిరేకించేవారు భారతీయులు కానేరరని వారి వాదన. ఈ వాదనను వివిధ పద్ధతులలో సమాజంలోకి తీసుకెళ్తున్నారు. దీనిని ఖండించకుంటే, వ్యతిరేకించకుంటే, పూర్తిగా పూర్వపక్షం చేసి అంతం చేయకుంటే మన దేశం ఒక హిందూ తాలిబాన్ల దేశంగా, అడవుల్లో, గుహల్లో నివసించే కాలం నాటికీ వేగంగా వెనక్కి మళ్ళి పోతుంది.



వేదమంత్రాల్లో ఎంత గొప్ప ఉంది, ఎంత మంచి ఉంది అని వెతకటంలో ఉపయోగం లేదు. వేదాలను వివరించే వేదాంతం, బ్రాహ్మణికాలు, అరణ్యకాలు, పురాణాలు వంటి వన్నీ ఒక్క మాటలో చెప్పాలంటే క్రూరమైన వర్ణ వ్యవస్థని బలపరిచేవి. సమాజంలో నూటికి 80శాతంగా ఉండే శ్రామిక జనాన్ని శూద్రులుగా ముద్రించారు. 'శూద్ర నయేషా జన్మత:' అంటే శూద్రుడు పుట్టుకతో శూద్రుడు. శూద్రుడు గానే చావాలి. 'శూద్రంతు కరియేతా దాస్యం' అంటే బానిసత్వం చేయడానికి శూద్రుడు పుట్టాడు. శూద్రునికి జ్ఞానం అందించ కూడదు వంటివి ఈ సనాతన ధర్మం సారాంశం. శూద్రులను, మహిళలను హింసించడం తప్పు కాదని, ఏ వైదిక హింస హింసే కాదని మనువు స్పష్టంగా చెప్పాడు. అందువలన సనాతన వాదులకు సామాజిక హింస, హింసలా కనపడదు. అది ఒక గొప్ప ధర్మంగా, అది కూడా సనాతనమైనదిగా కనబడుతుంది. ఈ వాదన బలపడిందంటే ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి ప్రముఖ పురాతన చరిత్ర పండితుడు పి.సి.రే "బౌద్ధంపై శంకరాచార్యుడు విజయం మనదేశంలో మేదో స్తబ్దతకు బీజాలు నాటింది. అప్పటి నుండి భౌతిక వాదానికి భావవాదానికి మధ్య తీవ్రంగా సాగిన పోరాటం బౌద్ధంపై భావవాదం విజయం సాధించటంతో ముగిసింది. ఈ విధంగా భౌతిక వాదం అన్ని రకాల సహజ ఆలోచనలకి, వివిధ భావాల మధ్య సంఘర్షణలకి ముగింపు అయింది. అందువలన 9వ శతాబ్దము నుండి భారత సమాజం, భారతీయ శాస్త్ర పరిజ్ఞానం, భారతీయ కళలు, భారతీయ సాహిత్యం అన్ని మూలపడటం మొదలైంది. స్వాతం త్ర్యోద్యమం దాని ఫలితంగా ఏర్ప డిన స్వతంత్ర దేశంలో మెరుగ వుతున్న ఈ విలువలన్నింటినీ ధ్వంసం చేయడం పునరావృతం కానున్నది. దేశానికి అత్యంత ప్రయోజనంగా ఉండే నమ్మకాన్ని పాలకులు తెలుసుకొని, దాన్ని తమ అధీనంలో ఉన్న ప్రచార సాధనాల ద్వారాను, ఉపన్యాసాల ద్వారాను, కథల ద్వారాను, పాటల ద్వారాను ప్రచారం చేసి ప్రజ లను వాటికి వంత పాడేటట్లు చేయ టమే పాలకులు చేయవలసింది అని ఏనాడో ప్లేటో చెప్పాడు. దీనినే మన దేశ ప్లేటో అయిన చాణుక్యుడు చెప్పడం మనం చూస్తాం. వాటిని వర్ణిస్తూ కార్ల్ మార్క్స్... "భారతదేశం గురించి ప్రస్తా విస్తూ ఇక్కడ గ్రామీణ వ్యవస్థలో పైకి చూడ్డానికి స్తబ్దుగా, దూకుడు లేనివిధంగా కనబడుతున్నా, ఇవి ఆసియా తరహా నిరం కుశత్వానికి బలమైన పునా దులుగా ఉన్నాయి. అవి మానవ మేధస్సును ఒక చిన్నపెట్టెలో పెట్టినట్లుగా చేసి మూఢనమ్మకాలకు సాధనాలుగా, సాంప్రదాయ నియమాలకు ఊడిగం చేసేలా చేస్తున్నాయి. ఈ చిన్న సమూహాలు, కులాలు బానిసత్వంతో మలినమైపోయి ఉన్నాయి. తన చుట్టూ ఉన్న పరిస్థితులపై ఆధిక్యత సాధించాల్సిన మానవున్ని బాహ్య కారణాలకు బానిసగా మార్చేస్తున్నాయి." అని పేర్కొన్నారు.

ఆధునికతత్వానికి, అభివృద్ధికి, సనాతనానికి పొసగదు

సుదీర్ఘ భారత దేశ చరిత్రను పరిశీలిస్తే సనాతన ధర్మం, హిందూ మతం, ఒక మతంగా ఆవిర్భవించిన నాటి నుండి అంటే కులవ్యవస్థ పటిష్ఠీకరించిన నాటి నుండి దేశంలో అభివృద్ధి అంతరించిపోవడం మొదలైంది అని పైన చెప్పు కున్నాం. ఇప్పుడు ఉదారవాద ఆర్థిక విధానాలు ఓ మూడు

> ఈ మధ్యనే జగద్గురు రామభద్రాచార్య అనే పీఠాధిపతి ఏడుగురు జాతీయ పత్రికా సంపాదకులతో నడిపిన ఇంటర్వ్యూ ఒక ప్రముఖ ఛానల్లో వచ్చింది. అందులో ఆ సంపాదకులు రాజ్యాంగం ముఖ్యమా, సనాతన ధర్మం ముఖ్యమా అంటే సనాతన ధర్మమే ముఖ్యం. ఈ సనాతన ధర్మం ఆదేశాల మేరకే మేము అయోధ్యలో రామ మందిరాన్ని సాధించుకున్నాం. రేపు కాశీలో జ్ఞానవాపీ మసీదుని ఈశ్వరాలయంగా మారుస్తాము. మధురలోనే కాదు మరికొన్ని వేల మసీదులుగా మార్చబడిన దేవాల యాలను పునరుద్ధరిస్తామని ప్రకటించాడు.

దశాబ్దాలు అమలు చేయబడి ఆర్థిక రంగం తీవ్ర సంక్షోభంలోకి కుదించుకుపోయి, బయటపడే అవకాశం లేక కొట్టుమిట్టా డుతున్న భారత పాలకవర్గాలకు మిగిలిన ఆశ ఈ సనాతన ధర్మాన్ని పట్టుకు వేలాడటమే. అందుకు బీజేపీ హిందుత్వ శక్తులు వారికి అంది వచ్చాయి. కార్పొరేట్ శక్తుల పాలనలో మతోన్మాదం కీలక అంశమైంది. ఆధునిక విద్యా వ్యవస్థ మీద దాడి, తిరోగమన మూఢవిశ్వాసాలను, పుక్కిట పురాణాలను శాస్త్ర విజ్ఞానంగా పాలకులే ప్రశంసించే పరిస్థితి. లౌకికవాదం, సామాజిక న్యాయంపై ఎడతెరిపి లేని దాడి వంటివన్నీ మరలా మన సమాజాన్ని స్తబ్దతలోకి నెట్టేస్తున్నాయి. ఈ ప్రమాదాన్ని నిలవరించాలి. ఇప్పటికే సాధువులు, సన్యాసులు మీడియాలో ప్రచారం ప్రారంభించారు. ఈ మధ్యనే జగద్గురు రామభద్రాచార్య అనే పీఠాధిపతి ఏడుగురు జాతీయ పత్రికా సంపాదకులతో నడిపిన ఇంటర్వ్యూ ఒక ప్రముఖ ఛానల్లో వచ్చింది. అందులో ఆ సంపాదకులు రాజ్యాంగం ముఖ్యమా, సనాతన ధర్మం ముఖ్యమా అంటే సనాతన ధర్మమే ముఖ్యం. ఈ సనాతన ధర్మం ఆదేశాల మేరకే మేము అయోధ్యలో రామ మందిరాన్ని సాధించుకున్నాం. రేపు కాశీలో జ్ఞానవాపీ మసీదుని ఈశ్వరాలయంగా మారుస్తాము. మధురలోనే కాదు మరికొన్ని వేల మసీదులుగా మార్చబడిన దేవాలయాలను పునరుద్ధరిస్తామని ప్రకటించాడు. ఈ పరిస్థితి రానున్న కాలంలో మరింత పెరగనుంది. మఠాధిపతులు, సాధు సన్యాసుల ఆదేశాల మేరకు ఇరాన్‌లో లేదా ఆఫ్ఘనిస్తాన్లో లాగా పరిపాలన సాగే పరిస్థితి మన దేశానికి రానివ్వకూడదు.

నేడు మనం 3వేల సంవత్సరాల క్రితం కాలంలో లేము. బ్రాహ్మణ/ వైదిక మతాన్ని, మతాచారాల్ని, ద్విజుల సిద్ధాం తాన్ని, వారి రాజ్యాన్ని, ప్రతిఘటించిన కాలంతో పోలిస్తే మనం ఎంతో ముందుకు వచ్చాం. 19వ శతాబ్దం చివరి వరకు జరిగిన సంఘసంస్కరణ ఉద్యమాల్ని, వైదిక రాజ్యాధికారాన్ని తిరస్కరించడంలో, ప్రతిఘటించడంలో, ఉన్న భౌతిక పరిస్థితులలోనూ, పూర్వ రంగంలోనూ ఎంతో మార్పు వచ్చింది. నేడు లౌకిక రాజ్యాంగం ఉంది. దళిత, శూద్ర, మహిళా, అభ్యుదయ సాహిత్యం మనముందుంది. అంతేకాదు వాటి కోసం పోరాడే జనం అసంఖ్యాకంగా ఉన్నారు. పోరాడుతున్నారు. అనేక కారణాల రీత్యా ఈ వైదిక మతం, దాని ప్రధాన ఆయుధమైన సనాతన ధర్మంపై పోరాటం తుదికంటా, విజయం సాధించేంత బలంగా గతంలో సాగలేదు. అందువల్ల నేడు ఈ పోరాటం విరామం లేకుండా, నిరంతరాయంగా, తుదికంటా సాగిస్తేనే భారత సమాజం అభివృద్ధి వైపు శాశ్వతంగా మరలుతుంది. ఆ బాధ్యత లౌకిక, ప్రగతిశీల, వామపక్ష, విప్లవ శక్తుల మీద ఉంది.

'క్రాంతి ప్రధాతలు ఉపాధ్యాయులు'

ప్రపంచాన్ని మార్చే శక్తివంతమైన ఆయుధం విద్య మాత్రమే అని నల్లజాతి సూరీడు నెల్సన్ మండేలా అన్నారు. ఈ శక్తివంతమైన ఆయుధాన్ని ప్రజలకు అందించేవారు, మనిషిని పరిపూర్ణమైన వ్యక్తిగా తీర్చిదిద్దే క్రాంతి ప్రధాతలు ఉపాధ్యాయులు. అందుకే సమాజంలో తల్లిదండ్రుల తర్వాత గురువులకు విశిష్ట స్థానం ఉంది. సాధారణంగా మన దేశంలో 5 సెప్టెంబర్‌న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటాం. అయితే ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని మాత్రం అక్టోబర్ 5న జరుపుకుంటారు. దీనికి ఓ ప్రత్యేకత ఉంది. ఉపా ధ్యాయుల హక్కులు, బాధ్యతలు, విద్య, నియామకం, ఉపాధి, బోధ నాభ్యసనాలకు సంబంధించి నిర్దేశించే ఉపాధ్యాయుల ప్రమా ణాలను 1966లో అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ), యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ ఎమర్జెన్సీ ఫండ్ (యూనిసెఫ్), ఎడ్యు కేషన్ ఇంటర్నేషనల్(ఈఐ) సిఫార్సులను పారిస్‌లో ఆమోదించారు. దీన్ని పురస్కరించుకొని ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులు 1994 అక్టోబర్ 5న ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు.

ప్రపంచ దశ, దిశను మార్చిన ఎందరో మహనీయులు డాక్టర్లు, ఇంజనీర్లు, కవులు కళకారులు మేధావులు వ్యాపారవేత్తలు సామాజిక వేత్తలు, రాజకీయ నాయకులను అందించిన ఘనత ఉపాధ్యాయు లదే. "మనకు విద్యకు అందించేందుకు ఉపాధ్యాయులు కావాలి, ఉపాధ్యాయుల కొరతను అధిగమించడం ప్రపంచ ఆవశ్యకత" అనే థీమ్‌తో 2023 ప్రపంచ ఉపా ధ్యాయ దినోత్సవ వేడుకలు యునెస్కో ఆధ్వర్యంలో ఉపాధ్యా యులు ఘనంగా నిర్వహించను న్నారు. ఉపాధ్యాయుల సంఖ్య తగ్గ కుండా, ఆ సంఖ్యను పెంచడం, ప్రజలకు నాణ్యమైన విద్యను అందించడం లక్ష్యాలుగా ఈ థీమ్ ఉంది. అందరికీ నాణ్యమైన విద్యను అందించడానికి 2030 యునెస్కో ఎజెండాలోని విద్యా లక్ష్యా లను చేరుకోవడానికి సుశిక్షితులైన ఉపాధ్యాయులు అవసరం. ప్రపంచ వ్యాప్తంగా 69 మిలియన్ల ఉపాధ్యాయుల కొరత ఉంది. మానవాళి గ్లోబల్ టీచర్ల కొరతను ఎదుర్కొంటోంది. ఉపాధ్యాయుల కొరత వల్ల విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారు. ప్రపంచ మాన వాళి ఎదుర్కొంటున్న కీలక సవాళ్లను పరిష్కరించే నిపుణుల తయారీ సుశిక్షితులైన ఉపాధ్యాయులతోనే సాధ్యం. టీచర్ల కొరతను తగ్గించ డానికి, ప్రతి విద్యాసంస్థ సాంకేతికతను ఉపయోగించుకునేలా ఉపా ధ్యాయులకు శిక్షణ ఇవ్వడంతోపాటు, ప్రభావవంతమైన పాఠాలను అందించడానికి వారి బోధనా శైలిని మెరుగుపర్చడానికి కృషి చేయడం చాలా ముఖ్యం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని టీచర్లు ఉపయోగించేలా చూడడం ద్వారా నాణ్యమైన విద్య విద్యా ర్థులకు అందే అవకాశం ఉంది. 26.5 కోట్ల మంది విద్యార్థులు, 14.9 లక్షల పాఠశాలలు, 95 లక్షల మంది ఉపాధ్యాయులతో భారతీయ విద్యా వ్యవస్థ ప్రపంచంలోనే అతిపెద్ద విద్యావ్యవస్థగా గుర్తింపు పొందింది. అతి పెద్ద ప్రజాస్వామిక దేశం, అతిపెద్ద విద్యావ్యవస్థలో ఉన్న మనం విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చినప్పటికీ దేశ ప్రజలకు పూర్తి స్థాయిలో నాణ్యమైన విద్య అందించడంలో సఫలీకృతం కాలేక పోయాం. మన దేశంలో ఉపాధ్యాయులకు అత్యధిక డిమాండ్ ఉంది. భారత ప్రభుత్వం 2030 నాటికి ప్రాథమిక విద్యలో వంద శాతం స్థూల నమోదు (ఎన్రోల్మెంట్) లక్ష్యంగా పెట్టుకుంది. దీని కోసం ఎక్కువ మంది ఉపాధ్యాయుల అవసరం ఉంది. నేటి బాలలే రేపటి పౌరులు. వారికి నైతిక విలువలు, మానవీయత, శాస్త్రీయ పరిజ్ఞానం పర్యావరణ పరిరక్షణ, ప్రగతిశీల భావనలు, ఆధు నిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలు బోధించి రాబోయే తరాలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది. నూతన జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా ఉపాధ్యాయ నియా మకాలు చేస్తే ఉపాధ్యాయుల, అధ్యాపకుల మార్గదర్శనంలో నవ భారత నిర్మాణం జరుగుతుందని, ప్రపంచంలో భారతదేశం అగ్రస్థానం నిలుస్తుందని ఆశిద్దాం.



(నేడు ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం)

- పాకాల శంకర్ గౌడ్, 9848377734

'బిచ్చగాళ్లు' అంటే, 'క్షీణ' కార్మికులే!



రంగనాయకమ్మ

ఆ మధ్య, ఒక నెల కిందట, 'బెగ్గింగ్ మాఫియా' అనే పేరుతో, దాదాపు అన్ని టీవీ చానళ్ళలోనూ, హైదరాబాదు నగరంలో, 'బిచ్చగాళ్ళ బెడద' ఎంతగా వుందో, ఒక వార్తని చాలా సేపు ప్రసారం చేశారు. వేరే రాష్ట్రం నించీ ఇక్కడికి వచ్చి, భిక్షాటననే ఒక పెద్ద వ్యాపారంగా నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అరెస్టు చేశారట 'పోలీసులు'. ఆ వ్యక్తి పిల్లల్నీ, వృద్ధుల్నీ, ఆడవాళ్ళనీ, హిజ్రాల వేషాలు వేయించి మగవాళ్ళనీ, భిక్షాటనలోకి దింపి వ్యాపారం చేస్తున్నాడట! ఆ అడుక్కునే వాళ్ళందరూ, ఉదయం నించీ, రాత్రి చీకటి పడేవరకూ, రద్దీ ప్రాంతాల్లో నిలబడి, అడుక్కు తెచ్చుకున్న డబ్బుల్లో నించి, రోజుకి రెండో, మూడో వందలు, వాళ్ళకి కూలిగా ఇచ్చి, మిగతా వేల, వేల రూపాయలు తను వుంచుకుని,పెద్దఎత్తున వాళ్ళని దోపిడీ చేస్తున్నాడని అతని మీద కేసు!

భిక్షాటనని ఒక వ్యాపారంగా నడపడానికి వీలునిచ్చిన పరిస్థితులు ఏమిటి? అసలు భిక్షాటన చెయ్యవలిసిన అగత్యం ఎవరికైనా ఎందుకు వస్తుందీ?- అనే ప్రశ్నలు, ఏ చానలు వారూ వేసుకోలేదు. కేవలం పోలీసులు ఇచ్చిన సమాచారాన్నే తిరిగి వల్లించారు. అనాథలైన పిల్లలూ, ఆడవాళ్ళూ, వృద్ధులూ, పనీ పాటా లేని సోమరి మగవాళ్ళూ భిక్షాటన మీద ఆధారపడి బ్రతుకుతున్నారని చెప్పుకొచ్చారు. భిక్షాటనే బతుకుతెరువుగా ఎందుకు మారిందో, తెలుసుకోవడానికి జరిగిన కొన్ని సర్వేలు కూడా, దానికి గల మూల కారణాలను పట్టుకుని, సరిఅయిన పరిష్కారాలను సూచించే పని చెయ్యలేదు. చానళ్ళ వారే కాక, ప్రభుత్వ శాఖల వారూ, సంఘసంస్కరణవాదులుగా వున్న స్వచ్ఛంద సంస్థల వారూ కూడా, పై పై కారణాలను మాత్రమే చూసి, చిట్టిపొట్టి సంస్కరణలనే సూచించారు!

తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలూ, పోషించే భర్తలు లేని స్త్రీలూ, కుటుంబసభ్యుల ఆదరణ లేని వృద్ధులూ, బొత్తిగా పనులు దొరకని పేదలూ, ఉన్న పనులు పోయిన నిరుద్యో గులూ, చాలీచాలని పైసలతో చితికిపోయి, అప్పులపాలై ఊళ్ళు వదిలేసి తిరిగే వాళ్ళూ, అన్యాయంగా సంఘ చీత్కారానికి గురై వేరే దారిలేని 'హిజ్రా'లూ... ఇలా అనేక రకాలుగా దిక్కులేని వాళ్ళు, గత్యంతరం లేక ఈ భిక్షాటన అనే 'ఆత్మ గౌరవం' లేని జీవితాల్ని గడపవలిసి వస్తున్నదని సర్వేలు చెబుతున్నాయి.

సర్వేలు గానీ, స్వచ్ఛంద సంస్థలు గానీ, ప్రభుత్వాలు గానీ చూపే పరిష్కారాలు సమస్యని తిరిగి తలెత్తకుండా చేసేవికాదు. పిల్లలకు అనాథా శ్రమాలూ, వృద్ధులకు పెన్షన్లూ, వృద్ధాశ్రమాలూ, స్త్రీలకు చిట్టి చిట్టి స్వయం ఉపాధి పథకాలూ, పనులు లేనివారికి నిరుద్యోగ భృతీ... వంటివి కొంత ఉపశమనం కలిగించే పరిష్కారాలు మాత్రమే! ఇవి కూడా, అవసరమైన వారిలో అతి కొద్దిమందికి మాత్రమే అందుతాయి! ఎంత సక్రమంగా అమలు పరిచినా! పైగా, భిక్షాటన మీద ఆధారపడి బతకవలిసిన జనాల సంఖ్య సాధారణంగా పెరుగుతూనే వుంటుంది.

ఈ భిక్షాటన అనేది బ్రతుకుతెరువుగా వుండడం ప్రపంచం లో అన్ని దేశాలలోనూ, తరతమ భేదాలతో కనిపి స్తుంది. మానవ సమాజ చరిత్రలో, ఈ భిక్షాటన అనేది ఎప్పుడు తలె త్తిందీ, ఏ రూపాల్లో, ఏ స్థాయిల్లో వుండేదీ... అదంతా ఇక్కడ చూడలేము. పెట్టుబడిదారీ ఆర్థిక విధానం మొదలైనప్పటినించీ మాత్రం భిక్షాటన ఒక బ్రతుకుతెరువు మార్గంగా స్థిరపడి పోయింది! ఈ సంగతిని, పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ గురించి, లోతుగా పరిశోధించిన మార్క్సు, ఎంగెల్సుల రచనల్లో చూడవచ్చు.

పెట్టుబడిదారీ విధాన లక్ష్యం అంతా'లాభం'! ఆ లాభం కోసం ఒకర్ని ఒకరు నాశనం చేసేటంత పోటీ! లాభాల కోసం జరిగే ఈ పోటీలో, మధ్య స్థాయి పెట్టుబడిదారులు, కార్మికులు గానూ, కార్మికులలో ఒక సెక్షను పనులు పోయి బిచ్చగాళ ్ళగానూ మారతారని నిరూపించాడు మార్క్సు. ('1844 నాటి ఆర్థిక, తాత్విక రాత ప్రతులు')

మార్క్సు : "పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ఏమి చేస్తుం దంటే, శ్రమజీవుల జనాభాలో ఒక భాగంతో శక్తికి మించిన పని చేయించుతుంది. ఇంకోభాగాన్ని, పూర్తిగానో పాక్షికంగానో నిరు పేదలుగా ఉంచుతుంది." ('అదనపు విలువ సిద్ధాంతాలు-2'లో). ఆ నిరుపేద జనాలు, పెట్టుబడి దృష్టిలో అవసరంలేని "అదనపు జనాభా"! అంటే, వారితో ఇక పెట్టుబడికి అవసరం లేదని! ఉన్నవారితోనే ఎక్కువ పని చేయించుతారు గనక! దీని వల్ల పని దొరకని వారికి నిరంతరం బ్రతుకు తెరువుకి దారి మూసుకుపోతుంది. ఇంక అప్పుడు, భిక్షాటనా, దొంగతనాలూ, వ్యభిచారమూ వంటి దుర్భరమైన పనులే బ్రతుకు తెరువులు



అవు తాయి. ఈ పనుల్లో వుండే వారిని 'అలగా జనం' అని అంటారు. 'అలగా' అనే అర్థం, హిందీలో 'అలగ్' (వేరు) అనే మాటనించీ తెలుగులోకి వచ్చింది. అంటే, ఆ పనులు చేసే వారు, మామూలు మనుషుల నించీ 'వేరు'గా, పనికిరానివారిగా వుండే వారు- అని వ్యతిరేక అర్థం. కానీ, వీళ్ళని "క్షీణించిన" ("రూయిన్డ్") కార్మికులుగా మార్క్సు ప్రస్తావిస్తాడు, ఒక చోట! అంటే, వీళ్ళంతా, తమ గతంలో, కార్మికులుగా పని చేసిన వారే. కానీ, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం వల్ల, పనులు పోయి, చేద్దామన్నా ఏ చిన్న పనులూ దొరక్క, జీవితాలు నాశనం అయ్యి, కటిక దారిద్ర్యం వల్ల వేరే దారేలేక, ఈ బాట పట్టారు.

మార్క్సుని వినండి : "కటిక దారిద్ర్య పరిస్థితులకు సంబంధించిన గణాంక వివరాలను పరిశీలిస్తే, ప్రతీ పారి శ్రామిక సంక్షోభంతో పాటు, కటిక దరిద్రుల సంఖ్య పెరుగు తుందనీ, ప్రతీ పారిశ్రామిక పునరుద్ధరణతో బాటుగా వీరి సంఖ్య తగ్గుముఖం పడుతుందనీ, ఎవరైనా గమనించగలరు... అదనపు జనాభాతో పాటు, 'కటిక దారిద్ర్యం' అనేది, పెట్టుబడి దారీ ఉత్పత్తికీ, పెట్టుబడి దారీ తరహా సంపదకూ, ఒక షరతు. ... అయితే, ఈ కటిక దరిద్రులలో అత్యధిక సంఖ్యాకులను, తన భుజస్కంధాల మీద నుంచీ తీసేసి, కార్మిక వర్గపు భుజస్కంధాల మీదకూ, దిగువ మధ్య తరగతి భుజస్కంధాల మీదకూ, ఎలా విసిరి వెయ్యాలో పెట్టుబడికి తెలుసు." ('కాపిటల్-1', చాప్టర్-25).అంటే, బిచ్చగాళ్ళుగా మారిన నిరుపేదలకు బిచ్చాలు దొరికేది ఎవరి వల్ల? ఏదో ఒక వేతన శ్రమలోనూ, స్వతంత్ర శ్రమల్లోనూ బ్రతికే శ్రామిక జనాల కొంపల ముందే గానీ, మహా భవనాల ముందు మాత్రం కాదు. అంటే, బిచ్చాలు వేసి, బిచ్చ గాళ్ళని పోషించేది కార్మిక జనాభాయే!

మనుషులు తమ పోషణను భిక్షాటన వంటి అవమాన కరమైన పద్ధతిలో కాక, "గౌరవంగా" సంపాదించుకునే వీలుని, పెట్టుబడిదారీ సమాజం కల్పించదు. ఈ వాస్తవాన్ని, 1845 నాటి ఒక ఉపన్యాసంలో, **ఎంగెల్సు** ఎంత గొప్పగా చెప్పాడో చూడండి: "ప్రతి నాగరిక సమాజంలోనూ, సంతోషంగా పని చేయడానికి యిష్టపడినా, పని సంపాయించుకోజాలనట్టి నిరు ద్యోగ కార్మికులు పెద్ద సంఖ్యలో వున్నారు. సాధారణంగా అను కునే దానికంటే వాళ్ళ సంఖ్య యెక్కువగా వుంది. ఇలా వీళ్ళు యేదో ఒక మార్గాన, తమని తాము నీచపరుచుకునే కార్యాలు సాగించడం మనకు కనపడుతుంది- బిచ్చమెత్తుకోవడమో, అడుక్కుంటూ వీధులూడ్వడమో, వీధి మలుపుల్లో నిలుచుకో వడమో, అప్పుడప్పుడు దొరికే చిన్న పనుల ద్వారా ప్రాణం నిలుపుకోవడమో, వీధులు తిరిగి రక రకాల చిల్లర సరుకులు అమ్ముకోవడమో, లేదా, ఈ సాయంత్రం ఇద్దరు బీద అమ్మాయిలు చేసిన దానిని మనం చూసినట్లు, గిటార్ పట్టుకొని ఒక చోట నుండి మరొక చోటికి పోతూ, డబ్బు కోసం ఆడుతూ, పాడుతూ, నాలుగు పైసలు సంపాయించుకోడానికి రకరకాల సిగ్గుమాలిన మాటలనూ, ప్రతి అవమానకరమైన సూచననూ భరించడమో! చివరకు యెంత మంది నిజమైన సాని వృత్తికి లోబడుతారో! మిత్రులారా, యేదో ఒక మార్గాన సానితనం సాగించడం తప్ప గత్యంతరం లేని యీ బీద జనుల సంఖ్య చాలా పెద్దదిగా వుంది... మరి, సమాజం వీళ్ళ పోషణ ఖర్చును భరించవలసి వుంటే, యీ నిరుద్యోగులు తమ తిండి ఖర్చును తామే గౌరవంగా సంపాయించుకోవడం వీలయ్యేటట్లు సమాజం చేయాలి. కానీ, ప్రస్తుత పోటీ సమాజం యిది చేయజాలదు." (ఎంగెల్స్)

> మన ప్రయత్నాలు ఫలించాలంటే, దీర్ఘకాలం పట్టే మాట నిజమే! అందుకే, ప్రస్తుతం తాత్కాలిక ఉపశమనాన్ని అయినా కల్పించే పథకాల్నీ, ఏర్పాట్లనీ, పెద్ద స్థాయిలోనూ, సక్రమం గానూ అమలయ్యేలా ప్రభుత్వాల మీద వత్తిడి తేవాలి. కానీ, ఈ ఉపశమనాలతో సంతృప్తి పడకూడదు. పడితే, సమస్య ఎన్నటికీ పరిష్కారం కాదు అని గ్రహించలేమా? మానవ సమాజంలో భిక్షాటన ఒక శాశ్వత ధర్మంగా వుండవలిసిందేనా?

మరి ఈ భిక్షాటన వంటి దుస్థితికి పరిష్కారం ఏమిటి? ప్రతీ మనిషీ, తన తిండిని గౌరవంగా సంపాయించుకోవడానికి వీలునిచ్చే సమాజం కోసం ప్రయత్నాలు ప్రారంభించడమే కదా? అవి ఎంత చిన్న చిన్న ప్రయత్నాలైనా!

మన ప్రయత్నాలు ఫలించాలంటే, దీర్ఘకాలం పట్టే మాట నిజమే! అందుకే, ప్రస్తుతం తాత్కాలిక ఉపశమనాన్ని అయినా కల్పించే పథకాల్నీ, ఏర్పాట్లనీ, పెద్ద స్థాయిలోనూ, సక్రమం గానూ అమలయ్యేలా ప్రభుత్వాల మీద వత్తిడి తేవాలి. కానీ, ఈ ఉపశమనాలతో సంతృప్తి పడకూడదు. పడితే, సమస్య ఎన్నటికీ పరిష్కారం కాదు అని గ్రహించలేమా? మానవ సమాజంలో భిక్షాటన ఒక శాశ్వత ధర్మంగా వుండవలిసిందేనా?

నవతెలంగాణ
5
కరీంనగర్
గురువారం | అక్టోబర్ 5, 2023 | www.navatelangana.com

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి

ఎస్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, రాస్తారో



నవతెలంగాణ - జమ్మికుంట : రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.5,177కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి ఏడివిఎస్ వై థామస్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి ఇమ్రాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జమ్మికుంట పట్టణంలో ఎస్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో వందలాది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించి స్థానిక గాంధీ చౌరస్తాలో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా స్కాలర్‌షిప్ పెంచాలని డిమాండ్ చేశారు. వెంటనే నిరుద్యోగ భృతిని అమలు చేయాలన్నారు. మెగా డీఎస్సీ పెట్టి వెంటనే 25,000 పోస్టులు వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు పల్నాటి అభిలాష్, పర్వీస్, అస్మత్, అఖిల్, సమీర్, నాయకులు హనుమంత్ ప్రసాద్, అన్వేష్, అవినాష్, అరుణ్, అరవింద్, వంశీ, శివ గణేష్ ,హర్ష అజయ్, రాకేష్, పవన్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల షెడ్యూల్ విడుదలకు కౌంట్‌డౌన్

ఓటర్ల తుదిజాబితాను విడుదల చేసిన చీఫ్ ఎలక్షన్ కమిషన్

- ఎన్నికల షెడ్యుల్‌పై బీఆర్ఎస్ నేతలకు అధిష్టానం సంకేతాలు
- హడావిడిగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- అగ్రనేతల పర్యటనలకు ఆయా పార్టీల స్కెచ్
- ఇప్పటికే ఉమ్మడి జిల్లా కలియ తిరిగిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

చీఫ్ ఎలక్షన్ కమిషన్ రాష్ట్రంలోని ఓటర్ల తుదిజాబితాను బుధవారం సాయంత్రం విడుదల చేసింది. దీంతో ఓటర్ల జాబితా.. ఓటర్లు సిద్ధం కావడంతో ఎన్నికల రణరంగమే తరువాయిగా మిగిలింది. ఈ నేపథ్యంలో 2018ముందస్తు ఎన్నికల మాదిరిగానే షెడ్యూల్ విడుదల చేసిన తరువాత రోజు నుంచి రెండు నెలల్లో ప్రచారం, పోలింగ్, ఫలితాల విడుదల, ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం చేయించాలనే ఆలోచనలో ఎన్నికల కమిషన్ ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో నేటి నుంచి ఈ నెల పదోతేదీలోపు ఎన్నికల షెడ్యుల్ విడుదలకు కౌంట్‌డౌన్ మొదలైంది. ఇప్పటికే బీఆర్ఎస్ నేతలకు ఆ పార్టీ అధిష్టానం ఇచ్చిన సంకేతాలతో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల హడావిడిలో ఎమ్మెల్యేలు పడ్డారు. ఆయా పార్టీలు తమ అగ్రనేతల రాక కోసం ప్లాన్ చేసుకుంటున్నారు.

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఎన్నికల పోరుకు పార్టీలు సిద్ధం

ఓటర్ల తుదిజాబితా సిద్ధం చేయడంతో ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూల్ విడుదలకు కౌంట్‌డౌన్ మొదలైంది. ఇప్పటికే ఈ విషయాన్ని బీఆర్ఎస్ నేతలకు ఆ పార్టీ అధిష్టానం చేరవేసింది. దీంతో హడావిడిగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో మునిగిపోయారు. ప్రభుత్వ పథకాలు, హామీల జోరును పెంచారు. ఆయా నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ఏదోరకంగా నిర్ణయాలు చేస్తున్నారు. లేదంటే ఉపశమనచర్యలుగా కొన్ని నిధులు విడుదల చేయిస్తున్నారు. రాష్ట్రంతోపాటు ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మిజోరాం రాష్ట్రాల అసెంబ్లీలకు కూడా ఒకేసారి నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో జాతీయ పార్టీలు ఇప్పటికే తమ రాష్ట్ర నాయకత్వాలకు దిశానిర్దేశాలు చేస్తోంది. ఈ క్రమంలో అధికార బీఆర్ఎస్ సైతం ఎన్నికల నిర్ణయాలను వేగంగా అమలు చేసే ప్రయత్నాలు చేస్తోంది. నేడు (గురువారం) ప్రభుత్వం కీలక నిర్ణయాలు ప్రకటించే ఛాన్స్ ఉందని రాజకీయవర్గాల్లో చర్చ సాగుతోంది. షెడ్యల్ ప్రకటించిన వెంటనే కోడ్ అమల్లోకి రానుంది. దీంతో, ఎన్నికల రాజకీయంగా మొదలు కానుంది.

ఎన్నికల షెడ్యుల్‌కు కౌంట్‌డౌన్..

ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు ఎన్నికల నిర్వహణ పైన రెండు రోజులుగా ఉమ్మడి జిల్లాలో కసరత్తు చేస్తున్నారు. పర్యటన ముగిసిన వెంటనే కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిక ఇవ్వనున్నారు. ఆ నివేదిక ఆధారంగా షెడ్యూల్ విడదల కానుంది. షెడ్యూల్ జారీ నుంచి ఎన్నికలకు 2 నెలల సమయాన్ని నిర్దేశించాలని నిర్ణయించనున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 10 దాటకుండా షెడ్యూల్ జారీకే చీఫ్ ఎలక్షన్ కమిషన్ (సీఈసీ) మొగ్గు చూపుతోంది. ఈ నేపథ్యంలో అక్టోబర్ 5నుంచి 10లోగా షెడ్యూల్ ఖరారు కానుంది. తద్వారా డిసెంబర్ రెండో వారంలోగా ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ప్రణాళికలు రూపొందిస్తోంది. రాష్ట్ర అసెంబ్లీ గడువు 2024 జనవరి 16 వరకు ఉంది. 2018లో అక్టోబర్ 6న ఈసీ షెడ్యూల్ విడుదల చేసింది. సరిగ్గా రెండు నెలలకు అంటే డిసెంబర్ 7న పోలింగ్ నిర్వహించారు. ఎమ్మెల్యేలంతా జనవరి 17న అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో జనవరి 16వ తేదీ వరకు ప్రస్తుత అసెంబ్లీ మనుగడలో ఉండనుంది.

రాజన్నసిరిసిల్ల జిల్లా

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
వేములవాడ	104943	113186	31	218160
రాజన్నసిరిసిల్ల	117872	122920	06	240798
మొత్తం	**222815**	**236106**	**37**	**458958**

కరీంనగర్ జిల్లా

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
కరీంనగర్	171254	170615	44	341913
చొప్పదండి(ఎస్సీ)	111197	118141	8	229346
మానకొండూర్(ఎస్సీ)	107371	111041	1	218413
హుజూరాబాద్	119676	124833	5	244514
మొత్తం	**509498**	**524630**	**58**	**1034186**

పెద్దపల్లి జిల్లా

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
పెద్దపల్లి	123768	125555	9	249332
రామగుండం	108233	106716	25	214974
మంథని	113828	116458	20	230306
మొత్తం	**345829**	**348729**	**54**	**694612**

జగిత్యాల జిల్లా

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
జగిత్యాల	109300	117315	20	226635
కోరుట్ల	113030	123692	4	236726
ధర్మపురి(ఎస్సీ)	109963	114622	6	224591
మొత్తం	**332293**	**355629**	**30**	**687952**

స్వామినాథన్ సూచనలను అమలు చేయాలి

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి



మాట్లాడుతున్న మిల్కూరి వాసుదేవరెడ్డి

నవతెలంగాణ - జమ్మికుంట : హరిత విప్లవ పితామహుడు స్వామినాథన్ ఆలోచనలు, సూచనలను ప్రభుత్వాలు అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక రైతు సంఘం కార్యాలయంలో స్వామినాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామినాథన్ వ్యవసాయ రంగంలో శాస్త్రీయ ఆలోచనలను తీసుకొచ్చి హరిత విప్లవాన్ని సృష్టించారని చెప్పారు. ఆధునిక పద్ధతులు, సేద్యంలో మెళుకువలు, తక్కువ పెట్టుబడి అధిక దిగుబడి, శాస్త్రీయ పద్ధతులపై రైతులకు విస్తత అవగాహన కల్పించారన్నారు. అన్ని రకాల పంటల సాగుపై ఆయన చేసిన పరిశోధనలు యావత్తు రైతంగానికి ఎంతో దోహదపడ్డాయన్నారు. వ్యవసాయ సంక్షోభంలో నష్టాలనుండి రైతులు అధిగమించేందుకు స్వామినాథన్ చేసిన సూచనలు, సలహాలు ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. పాలకులు స్వామినాథన్ సిఫారసులు, ఆలోచనలు అమలు చేసి రైతుల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. 2004లో కేంద్ర ప్రభుత్వానికి స్వామినాథన్ అనేక సిఫార్సులు చేశారని, వాటిని కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెట్టుబడికి 50 శాతం అదనంగా కలిపి మద్దతు ధర నిర్ణయించాలని డిమాండ్ చేశారు. సన్న, చిన్నకారు రైతులకు ఎరువులు, పురుగు మందులు ఉచితంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. పెట్టుబడి వేయాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శీలం అశోక్, నాయకులు సంపత్‌రావు, శంకర్, కాయిత లింగారెడ్డి, సదానందం, శ్రీకాంత్, రావుల ఓదెలు, సతీష్ పాల్గొన్నారు.

ఒక్కసారి అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా

టీపీసీసీ అధికార ప్రతినిధి మేడిపల్లి సత్యం



అభ్యర్థిస్తున్న మేడిపల్లి సత్యం

నవతెలంగాణ - గంగాధర

తనను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే చొప్పదండి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని టీపీసీసీ అధికార ప్రతినిధి మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర మండలం నాగిరెడ్డిపూర్ గ్రామంలో గడపగడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించిన సత్యం తనకు ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలని ప్రజను కోరారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోనే అభివృద్ధి సాధ్యమని, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని, 500 రూపాయలకే సిలిండర్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, నాయకులు రామిడి రాజిరెడ్డి, బుర్గు గంగన్న, చిప్ప చక్రపాణి, సత్యనారాయణ, రాచమల్ల భాస్కర్, ముచ్చ శంకర య్య, బండారి నర్సయ్య, ఒడ్నాల యగ్నేష్, అజయ్, రంజిత్, కూమరస్వామి, మహేష్, తోట కరుణాకర్, నాగేందర్, మహేందర్, షాదుల్ల పాల్గొన్నారు.

పీవీ హుజరాబాద్ జిల్లా ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ - హుజూరాబాద్ : పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద బుధవారం రోజున పీవీ హుజూరాబాద్ జిల్లా సాధన కమిటీ ఆధ్వర్యంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. బీఎస్పీ రాజ్యాధికారాన్ని చేపట్టినట్లయితే హుజురాబాద్ కేంద్రంగా పీవీ జిల్లాగా ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. జేఏసీ చేపడుతున్న ఉద్యమానికి తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సాధన జేఏసీ నాయకులు వేల్పుల రత్నం, చందుపట్ల జనార్ధన్, పల్లాల ఈశ్వర్‌రెడ్డి, పోడిశెట్టి వెంకటరాజం, జున్నోజు సదానందం, వేల్పుల ప్రభాకర్, సందేల వెంకన్న, ఒగ్గే శేఖర్ పాల్గొన్నారు.

ఓటర్ లిస్టుపై సమీక్ష



నవతెలంగాణ - జమ్మికుంట : ఓటర్ లిస్టులో తప్పొప్పులపై మండలంలోని బీఎల్ఓలతో జమ్మికుంట తహసీల్దార్ రజినిరెడ్డి కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. బీఎల్ఓ నూతన ఓటర్ లిస్ట్ క్రమం మళ్లీ ఏమైనా చిన్న తప్పుప్పులు, కరెక్షన్స్, ఎర్రర్స్, ఒకరి ఫొటోకి బదులు మరొకరికి ఫొటో రావడం, పోలింగ్ కేంద్రం పేరు, వివిపి, తాజా, మాజీ ప్రజాప్రతినిధుల ఓట్లు ఉన్నాయా లేవా చూడాలన్నారు. ఓటర్ లిస్ట్ గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అంటించాలని తెలిపారు. నాయబ్ తహసీల్దార్ సమ్మయ్య, ఆర్ఐలు తిరుపతి, సంతోష్ కుమార్, ఏఎస్ఓ హైమ, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

క్రీడా సామగ్రిని వినియోగించుకోవాలి


మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ



నవతెలంగాణ - చొప్పదండి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన క్రీడా ప్రాంగణాలకు అందిస్తున్న క్రీడా సామగ్రిని వినియోగించుకోవాలని చొప్పదండి మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ అన్నారు. పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయ ఆవరణలో బుధవారం మున్సిపల్ కమిషనర్ పి.శాంతి కుమార్ ఆధ్వర్యంలో క్రీడా ప్రాంగణాలకు సంబంధించిన క్రికెట్, వాలీబాల్, టీ షర్ట్స్, డంపెల్స్ కిట్లను వార్డుల వారీగా ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, మేనేజర్ ప్రశాంత్ కుమార్, జూనియర్ సహాయకులు, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చల్లూరులో ఘనంగా పోచమ్మ బోనాలు



నవతెలంగాణ - వీణవంక : మండలంలోని చల్లూరు గ్రామంలోని పద్మశాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం పోచమ్మ బోనాల ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులు బోనం ఎత్తుకుని డప్పు చప్పుళ్లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ శివారులోని పోచమ్మ ఆలయం వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంక్షేమ సంఘం గ్రామ అధ్యక్షుడు గంజి కుమారస్వామి, వార్డు సభ్యులు గంజి రాజు, గంజి రాజమణిశ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ రంగానికి ప్రపంచవ్యాప్తంగా డిమాండ్



నవతెలంగాణ - తిమ్మాపూర్

ఫార్మసీ రంగానికి ప్రపంచ వ్యాప్తంగా మంచి డిమాండ్ ఉందని వాగేశ్వరి విద్యాసంస్థల ప్రధాన కార్యదర్శి డాక్టర్ గండ్ర శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలో రామకృష్ణ కాలనీలో వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, వాగేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసిటికల్ సైన్సెస్‌లో చేరిన నూతన విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో అవగాహన సదస్సు కల్పించారు. కళాశాల సంయుక్త కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు వినోద్, ప్రకాష్‌రెడ్డి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

పత్తి కింటాల్‌కు గరిష్ట ధర 7100

నవతెలంగాణ - జమ్మికుంట : జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు విడిపత్తి 1595 క్వింటాళ్లు 82 వాహనాలలో బుధవారం రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. గరిష్ట ధర క్వింటాల్‌కు రూ.7100, మోడల్-7000, కనిష్ట-6000 పలికింది. అలాగే కాటన్ బ్యాగ్స్‌లలో 21క్వింటాళ్లు 15మంది రైతులు విక్రయానికి తీసుకురాగా గరిష్ట ధర-6200, మోడల్ ధర 6000, కనిష్ట ధర 5500 పలికిందని మార్కెట్ సెక్రటరీ గుగులోత్‌రెడ్డి పేర్కొన్నారు.

ఆరెపల్లి బస్తీ దవాఖానా ప్రారంభం



నవతెలంగాణ - కొత్తపల్లి : కొత్తపల్లిలోని ఆరెపల్లి బస్తీ దవాఖానాను బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరీంనగర్‌లో నాలుగో బస్తీ దవాఖానా అని, దీని ద్వారా ఆరేపల్లి గ్రామస్తులందరికి వైద్య ఆరోగ్య సేవలు ఉచితంగా త్వరగా అందించడానికి వీలు కలుగుతుందని తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే.లలితాదేవి, మేయర్ సునీల్‌రావు, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేకు ప్రజల గోస పట్టదా..

ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి



నవతెలంగాణ - హుజూరాబాద్

ప్రజల ద్వారా ఎన్నికైన ఎంపీ బండి సంజయ్ కుమార్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు ఈ ప్రాంత ప్రజల గోస పట్టదా అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. బుధవారం హుజూరాబాద్ పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నియోజకవర్గంలోని యువకులకు 138 క్రికెట్ కిట్లు, మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ, పట్టణ శివారులోని అహల్య నగర్ సమీపంలో వివిధ కుల సంఘాలకు భూమి పట్టాలు, కరీంనగర్ రోడ్‌లోని కెసిఆర్ ఆటోనగర్ కార్మికులకు, వివిధ కుల సంఘాలకు భూమి పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్‌లో రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హుజురాబాద్ పట్టణ అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ కోట్లాది రూపాయల నిధులు కేటాయించారన్నారు. 10 కోట్లతో హుజురాబాద్ ప్రభుత్వ హైస్కూల్లో స్టేడియం నిర్మాణం చేపట్టామని, ప్లాన్‌లో కొన్ని మార్పుల మూలంగా పనుల ప్రారంభం ఆలస్యం అయిందని అన్నారు. ప్రజలు ఆశ్చర్యపోయేలా అభివద్ధి పనులు చేసి హుజూరాబాద్ పట్టణ రూపురేఖలు మారుస్తానని ఆయన అన్నారు ఇల్లందకుంట దేవాలయాన్ని 25 కోట్లతో మినీ యాదాద్రిగా మారుస్తానని అన్నారు

ప్రజల ఓట్లతో గెలిచిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఎలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం లేదని వారికి ప్రజా సమస్యలు పట్టవా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఈటల రాజేందర్ సెంటిమెంటును రాజేసి లబ్ది పొందాలని చూశారని అన్నారు. ప్రోటోకాల్ విస్మరించడం లేదని, ఆయనకు సమాచారం ఇచ్చినా అధికారిక కార్యక్రమాలకు హాజరు కావడం లేదని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, జమ్మికుంట జెడ్పిటిసి శ్రీరామ్ శ్యామ్, ఎంపీపీలు రాణి, మమత, రేణుక, వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల, డిపిఓ వీరబుచ్చయ్య, కమిషనర్ సమ్మయ్య, కౌన్సిలర్లు తోట రాజేంద్రప్రసాద్, తోగరు సదానందం, ముక్క రమేష్, తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, కుమార్, అధికారులుపాల్గొన్నారు.

బిక్షాటన చేసి ఆశా కార్యకర్తల నిరసన



నవతెలంగాణ - సైదాపూర్

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆశా కార్యకర్తలు మండల కేంద్రంలో బుధవా రం బిక్షాటన చేసి నిరసన తెలిపారు. అలాగే బతుకమ్మ ఆడి తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. ఆశా కార్యకర్త శ్యామల మాట్లాడుతూ కనీస వేతనం నిర్ణయం చేసేంతవరకు సమ్మె విరమించేది లేదని అన్నారు. కార్యక్రమంలో స్వరూప, రుద్రమ్మ, నిర్మల, లక్ష్మీ, రాజేశ్వరి, స్వరూప, ఇందిరా, కవిత పాల్గొన్నారు.

కూరగాయల విత్తనాలు పంపిణీ

నవతెలంగాణ - కొత్తపల్లి : కొత్తపల్లిలోని దుర్శెడ్ గ్రామంలో 60 మంది రైతులకు ఫాతిమా నగర్ అడోరేషన్ సొసైటీ ఆధ్వర్యంలో 5 రకాల కూరగాయల విత్తనాలను బుధవారం పంపిణీ చేశారు.ప్రాజెక్టు కో ఆర్డినేటర్ సిస్టర్ దీప్తి సేంద్రియ ఎరువులపై అవగాహన కల్పించారు. సిస్టర్ అరుణ, సంస్థ ప్రతినిధులు మర్రి మల్లేశం, నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రమేష్ రూప, స్రవంతి, మౌనిక పాల్గొన్నారు.

తెలంగాణ పల్లెలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి

మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

నవతెలంగాణ - తిమ్మాపూర్



వారసంతను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

తెలంగాణ పల్లెలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని మహాత్మానగర్, తిమ్మాపూర్, పోరండ్ల, మల్లాపూర్, రామకృష్ణకాలనీ, గొల్లపల్లి గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే పర్యటించారు. మహాత్మానగర్‌లో వారసంత ప్రారంభించి, తిమ్మాపూర్ కులసంఘాలు, పోరండ్ల సొసైటీ గోదాంతో పాటూ హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా యువకులు భారీ బైక్ ర్యాలీ తీశారు. మల్లాపూర్‌లో మహిళా భవనం, గ్రామపంచాయతీ భవనం, శ్మశానవాటికను ప్రారంభించారు. అనంతరం పోరండ్లలో కులసంఘాలు, మహిళా సంఘం, పోరండ్ల సొసైటీ గోదాంలను టెస్కాబ్ చైర్మెన్ కొండూరు రవీందర్‌రావుతో కలిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో నిర్వహించిన సభల్లో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ రైతుల కోసం ఎంతగానో చేస్తున్నారని.. తెలంగాణలో రామరాజ్యం వచ్చిందన్నారు. కాళేశ్వరం జలాలతో తెలంగాణ సస్యశ్యామలం అయిందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతిరెడ్డి వనితదేవేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రావుల రమేష్, ఆత్మ కమిటీ చైర్మన్ పాశం అశోక్ రెడ్డి, సహకార సంఘం చైర్మన్ సింగిరెడ్డి స్వామిరెడ్డి, సర్పంచులు జక్కని శ్రీవాణిరవీందర్, దుండ్ర నీలమ్మరాజయ్య, రెడ్డి త్రివేణితిరుపతిరెడ్డి, మామిడి సతీష్, మల్లెత్తుల అంజయ్య, మీసాల అంజయ్య, ఉప సర్పంచులు మడుపు శ్రీనివాస్‌రెడ్డి, కేతిరెడ్డి తిరుపతిరెడ్డి, కిన్నెర సతీష్, పరుశరాములుగౌడ్, సత్యనారాయణరెడ్డి, పొన్నం అనిల్‌గౌడ్, ఎంపిటిసిలు పుప్పాల కనకయ్య, కనకం కొమురయ్య, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

ట్రాక్టర్ సంఘ భవనానికి మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తన కోటా నుంచి 4లక్షల రూపాయల నిధులు మంజూరు చేశారు. నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు.

ఆటోవాలలతో సుంకె ఆత్మీయ సమ్మేళం

మద్దతు ప్రకటించిన ఆరు మండలాల ఆటో కార్మికులు

నవతెలంగాణ - గంగాధర



ఆటో నడుపుతున్న ఎమ్మెల్యే రవిశంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

చొప్పదండి నియోజకవర్గంలోని ఆరు మండలాల ఆటోవాలలతో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ బుధవారం ఆత్మీయ సమ్మేళం నిర్వహించారు. గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో శుభమస్తు ఫంక్షన్ హాలులో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం ఆద్యంతం ఉల్లాసంగా సాగింది. మధురానగర్ హనుమాన్ టెంపుల్ నుండి ఫంక్షన్ హాలు వరకు ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆటోవాల డ్రెస్సు వేసుకుని స్వయంగా ఆటో నడుపగా ఆటోవాలలు తమ ఆటోలతో భారీ ర్యాలీ తీశారు. సమ్మేళనంలో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆటోవాలలకు అన్ని విధాలు అండగా నిలుస్తానని భరోస నిచ్చారు. ఆటోవాలలకు రక్షణకు హెల్త్ ఇన్సూరెన్స్ ఎంతగానో ఉపయోగం ఉంటుందంటూ హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులను అందించారు. ఆటోవాలలు, ప్రయాణీకుల సౌకర్యార్థం మధురానగర్ చౌరస్తాలో మరుగుదొడ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. స్థానిక బిడ్డనైన నన్ను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అనంతరం మధురానగర్ లోని అంతర్గత రోడ్ల నిర్మాణం పాలనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, మధురానగర్ సర్పంచ్ వేముల లావణ్యఅంజి, ఆత్మ చైర్మన్ మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు వేముల భాస్కర్, ఆరు మండలాల ఆటో నాయకులు, ఆటోవాలాలు పాల్గొన్నారు.

అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రెషర్స్ డే వేడుకలు

నవతెలంగాణ - కరీంనగర్





నగరంలోని స్థానిక రాజశ్రీ గార్డెన్‌లో అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థినులకు స్వాగతం చెపుతూ ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థినులు 'అల్ఫోర్స్ ఇగ్నైట్ 2023' అనే పేరుతో స్వాగతోత్సవం వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల కరెస్పాండెంట్ వి.రవీందర్రెడ్డి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, విశిష్ట అతిథి ఘన్ శ్యామ్ ఓజా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థినులు ఆత్మన్యూనతా భావాన్ని తగ్గించుకోవాలని, గమ్యాన్ని నిర్దేశించుకున్నప్పుడు దానికి తగిన సమయాన్ని కేటాయించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. క్రమశిక్షణతో కూడుకున్న విద్య కలలను సాకారం చేసుకొనేలా ప్రతి ఒక్కరు జీవితంలో ఎదగాలన్నారు. ఓటు హక్కు విలువను తెలుపుతూ భావితరాలకు ఉపయోగపడే ప్రభుత్వాలను నెలకొల్పాలని సూచించారు. కళాశాల కరెస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ డిగ్రీ విద్యకు ఉజ్వల భవిష్యత్తు ఉందని, కళాశాలలో డిగ్రీతో పాటు స్కిల్ డెవలప్మెంట్, కాంపిటెటివ్ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. విద్యార్థినులు అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోని కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలతో సంబరాలు మిన్నంటాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గోలి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ బి.విజయలక్ష్మి, జి.చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి పెంచాలి

నవతెలంగాణ-జగిత్యాల

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణకు సంబంధించి ప్రభుత్వం కమిటీని నియమించడం పట్ల జగిత్యాల టిఎన్జీవో జిల్లా అధ్యక్షులు భోగ శశిధర్, జిల్లా కార్యదర్శి నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగులకు మధ్యంతర భృతి కేవలం 5శాతం మాత్రమే ప్రకటించడం వలన ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని, దీనిపై ప్రభుత్వం మరొకసారి పునరాలోచించాలని కోరారు. టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ళ రాజేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ ఆధ్వర్యంలో ఆర్థిక మంత్రి హరీశ్‌రావుకు వినతి పత్రం ఇచ్చినట్టు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న రెండు కరువు భత్యాలను విడుదల చేయడం, ఎంప్లాయిస్ హెల్త్ స్కీం అమలు చేయడం, కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పురాతన పెన్షన్ విధానాన్ని అమలుపరచడం వంటి పెండింగ్ సమస్యల పై ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టిఎన్జీవో నాయకులు సాహిద్ బాబు, రాజేశం, మధుకర్, ఉద్యోగులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీఎన్జీవో జిల్లా నాయకులు

కుక్కలు బాబోయ్

నవతెలంగాణ-మేడిపల్లి

మేడిపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు వెళ్లే దారిలో కుక్కల విద్యార్థులను బెంబేలెత్తిస్తున్నాయి. ఎస్సారెస్పీ సరస్వతి కెనాల్ కాల్వ నుంచి వెళ్లే మార్గంలో వ్యర్థ పదార్థాలు వేయడంతో కుక్కలు సైరవిహారం చేస్తున్నాయి. దీంతో ప్రతినిత్యం ఆటోలో ఆదర్శ పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, పంట పొలాలకు వెళ్లే రైతులకు వెంట పడుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని కుక్కల బారి నుంచి రక్షించాలని వేడుకుంటున్నారు.


రోడ్ల వెంట తిరుగుతున్న కుక్కలు

ఎమ్మెల్సీ పరామర్శ

నవతెలంగాణ-జగిత్యాల టౌన్

జగిత్యాల పట్టణంలోని నంబి వేణుగోపాలచార్య కౌశిక సోదరులు నంబి పార్థసారథి ఇటీవల గుండెపోటుతో మరణించగా ఎమ్మెల్సీ ఎల్. రమణ వారి నివాసానికి వెళ్లి నంబి వేణుగోపాలచార్య కౌశికను వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట టీవీ సత్యం, గుండేటి రాజు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సంబరాలు

నవతెలంగాణ-వెల్గటూర్

24 రోజులుగా సీఐటీయూ ఆధ్వర్యంలో అలుపెరుగని పోరాటం చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం హామీ ఇవ్వడంతో అంగన్‌వాడీలు సంబరాలు చేసుకున్నారు. అంగన్ వాడీలు స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. తమకు అండగా నిలిచిన సీఐటీయూ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దొరిశెట్టి తిరుమల, సంగ ప్రేమలత, బండారి సత్య, బండమీది మల్లేశ్వరి,బుద్దె జయలక్ష్మి, మిట్ట మమత, కె పద్మ బచ్చల తార, సత్య, గుమ్మడి మౌనిక పాల్గొన్నారు.


స్వీట్లు పంచుకుంటున్న అంగన్‌వాడీలు

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన రాసూరి పెంటయ్య అనారోగ్యంతో మరణించగా వారిది నిరుపేద కుటుంబం కావడంతో దహన సంస్కారాల కోసం డబ్బా సర్పంచ్ లింగంపల్లి గంగాధర్ తన సొంత డబ్బులు రూ.10వేలు అందజేశారు. ఆయనతోపాటు సింగిల్ విండో డైరెక్టర్ ఎల్క అశోక్ గౌడ్, బైన నడిపి మల్లయ్య, రాడె రాజారెడ్డి ఉన్నారు.


నగదు అందజేస్తున్న సర్పంచ్

ఆశావర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం అమలు చేయాలి

నవతెలంగాణ-కథలాపూర్

ఆశావర్కర్లకు ఫిక్స్ వేతనం అమలు చేయాలని బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కోడిపల్లి గోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సమ్మె చేస్తున్న ఆశాలకు ఆయన సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఆశాలు ప్రజల విస్తృత సేవలందిస్తున్నారని, వారి సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల నాయకులు బద్రి సత్యం, వినోద్ కుమార్, సాయి ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్‌పై అవగాహన

నవతెలంగాణ- కోరుట్ల

పట్టణంలోని రామకృష్ణ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు ప్రిన్సిపాల్ సకినాల రాజు ఓటుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు యొక్క ప్రాధాన్యత, పోలింగ్ బూత్‌లో ఏ విధంగా ఉంటుందో తెలియజేస్తూ, రాబోయే ఎలక్షన్‌లో నాయకులు చూపే ఎటువంటి ప్రలోబాలైన మందు, డబ్బులు, మాంసానికి లోనుకాకుండా స్వచ్ఛందంగా ఓటు వేయాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం పాల్గొన్నారు.

మంత్రి హరీశ్‌రావు పర్యటన ఖరారు.

నవతెలంగాణ-మెట్‌పల్లి

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు కోరుట్ల నియోజకవర్గంలో శుక్రవారం పర్యటించనున్నట్టు ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు తెలిపారు. శుక్రవారం ఉదయం 9.00 గంటలకు పట్టణంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వాస్పత్రి భవనాన్ని ప్రారంభిస్తారని తెలిపారు.

రైతు విజ్ఞాన యాత్రలో మండల రైతులు

నవతెలంగాణ -మెట్‌పల్లి

మెట్‌పల్లి మండలంలోని జగ్గసాగర్, ఆత్మకూరు, చౌల్లమద్ది, కోనరావుపేట, రాజేశ్వర్‌రావు పేట్ గ్రామాలకు చెందిన రైతులు, జగిత్యాల ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో విజ్ఞాన యాత్ర అశ్వారావుపేట పామ్ ఆయిల్ పరిశ్రమకు వెళ్లారు. పామ్ ఆయిల్ పంట సాగు, సాంకేతిక సలహాలు, సాగువిధానం, దిగుబడి, మార్కెటింగ్, అంశాలపై అవగాహన కల్పించారు. పామ్ ఆయిల్ తోటలో వేసే అంతర పంటలు వాటి సాగు మొదలైనవాటిని రైతులు ప్రత్యక్షంగా సందర్శిం చడం ద్వారా రైతులకు ఆయిల్ పామ్ సాగుపై ఉన్న అనుమానలను నివృత్తి అవుతాయని తెలిపారు. ఈ విజ్ఞాన యాత్రలో గ్రామ వ్యవసాయ అధికారి భూమేశ్వర్, లోహియా ఆయిల్ ఫామ్ సమన్వయ కర్త రాహుల్, రైతులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


పంట పరిశీలిస్తున్న రైతులు

మేడిపల్లి మండలంలో తెరుచుకోని గ్రంథాలయం

నవతెలంగాణ-మేడిపల్లి

మేడిపల్లి మండల కేంద్రంలో శాఖ గ్రంథాలయం కొన్ని రోజులుగా మూత పడడంతో పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రంథాల యాలు విజ్ఞాన బాండాగారాలు అన్న కవుల సూక్తులు ప్రస్తుతం ఆచరణలో లేకుండా పోయా యి. గ్రంథాలయంలో వివిధ వార్తాపత్రికలు, మ్యాగజైన్స్, సండే స్పెషల్, పలు కథల పాఠ్యాంశాలు, పాఠకులకు అందుబాటులో ఉంటాయి. సంబంధిత అధికారుల పర్యవేక్షణ పూర్తిగా లేకపోవడంతో మేడిపల్లి గ్రంథాల యం పాఠకులకు అందకుండా పోయింది. జిల్లా ఉన్నత స్థాయి అధికారులు ప్రత్యేక చొరవచూపి గ్రంథాలయాన్ని వాడుకలోకి తీసుకురావాలని మేడిపల్లి మండల ప్రజలు కోరుచున్నారు.



ఆశావర్కర్లకు సంఘీభావం తెలిపిన జువ్వాడి నర్సింగ్‌రావు

నవతెలంగాణ -మెట్ పల్లి

ఫిక్స్ వేతనం ఇవ్వాలని సమ్మె చేస్తున్న ఆశాలకు జువ్వాడి నర్సింగ్‌రావు సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అందె బాపూజీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ తోడు దొంగలే..

- అవకాశం ఉన్నంత మేరకు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశా
- రోడ్డు విస్తరణలో గురించి మంత్రి కేటీఆర్ ఎందుకు మాట్లాడలేదు..
- కాంగ్రెస్‌పై విమర్శలు చేసే అర్హత మంత్రి కేటీఆర్‌కు లేదు.
- కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-జగిత్యాల

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రెండు తోడు దొంగలే అని, అవకాశం ఉన్నంత మేరకు జగిత్యాల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో ప్రధాన అంశం రోడ్డు విస్తీర్ణంపై మంత్రి కేటీఆర్ ఎందుకు మాట్లాడలేదని ఎమ్మెల్సీ ప్రశ్నించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జీవన్‌రెడ్డి మాట్లాడారు. గత ఎన్నికల్లో యావర్ రోడ్డు విస్తరణ ప్రధాన అంశంగా మారిందని, సంబంధిత శాఖ మంత్రి కావడంతో పరిష్కారం చూపిస్తారని భావిస్తే, ఆ అంశమే ప్రస్తావించకపోవడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. 2017లో 100 ఫీట్ల రోడ్డు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తే నాలుగు ఏళ్ల నాన్చి, అమలుకు చర్యలు తీసుకోలేదన్నారు. చట్టబద్ధంగా పరిహారం చెల్లించే దిశగా చర్యలు లేదని, యావర్ రోడ్డు విస్తరణలో భూములు కోల్పోయే వారికి పరిహారం చెల్లించకుండా టీడీఆర్ తెరపైకి తీసుకొ చ్చారన్నారు. యావర్ రోడ్డును గత ఎన్నికల్లో ప్రధాన అంశం చేశారు కదా.. పరిష్కారం కోసం రూ.100 కోట్లు ప్రకటించలేదన్నారు. నర్సింగాపూర్, అంబారి పేట, హస్నాబాద్, తిప్పన్నపేట, తిమ్మాపూర్, మోతె గ్రామాల భూముల రైతులు తమ భూములపై హక్కులు కోల్పోయే విధంగా ఆంక్షలు విధిస్తే రైతులను చైతన్య పర్చడం తప్పా.. మాస్టర్ ప్లాన్ పట్టణానికి పరిమితమై యావర్ రోడ్డు 100ఫీట్లు విస్తరణ చేస్తే ఎవరు వద్దంటున్నారని పేర్కొనాను. పాలన వికేంద్రీకరణలో భాగంగా ఏ రాష్ట్రంలోనైనా జిల్లాలు ఏర్పాటు చేయడం సహజం. పాలనా సౌలభ్యం కోసం జిల్లాలు ఏర్పాటు చేసి, జగిత్యాల జిల్లా ఏర్పాటు చేశామంటూ గొప్పలు చెప్పుకోవడం ఆశ్చర్యం కలిగి స్తోందని విమర్శంచారు. మంత్రి ఉన్న సమయంలో ఉమ్మడి రాష్ట్రానికి ఒకే ఒక్క జేఎన్టీయూ కళాశాల మంజూరైతే అది జగిత్యాల జిల్లాలో ఏర్పాటు చేశామని, వ్యవసాయ కళాశాల జగిత్యాలలో ఏర్పాటు చేశామని, నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చేందుకు రీజినల్ కేంద్రాన్ని జగిత్యాలలో ఏర్పాటు చేసినట్టు గుర్తు చేశారు.ఉచిత విద్యుత్ అమలు తలపెట్టినప్పుడు మంత్రి కేటీఆర్ ఎక్కడ ఉన్నారో చెప్పాలన్నారు. జగిత్యాల పట్టణంలోని ఇల్లు లేని నిరుపేదలకు గృహ నిర్మాణం కోసం 2008-09లో ఇళ్ల నిర్మాణాలకు ఆలోచన రూపకల్పన చేశామని, 4000 మంది నిరుపేద వర్గాలను గుర్తించి, ఒక్కొక్కరికీ 100 గజాల కేటాయించి, ఇల్లు మంజూరు చేశామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నిలిచిన పోయిన ఇండ్ల నిర్మాణం పూర్తి చేస్తే కాంగ్రెస్ పేరు వస్తుందని, 1600 ఇండ్లు వివిధ దశల్లో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై లేదా అని ప్రశ్నించారు. బీజేపీ.. టీఆర్ఎస్ రెండు ఒక్కటేనని లోకమంతా తెలుసు అని, . 2018 వరకు కేంద్రంలో బీజేపీ ప్రవేశపెట్టిన ప్రతి బిల్లును సీఎం కేసీఆర్ సమర్థించారని గుర్తు చేశారు. వారంటీ లేని కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రాన్ని ఇవ్వాలేదా.. మహిళలకు ఉచిత వడ్డీ రుణం ఇవ్వలేదా.. అర్హతకు అనుగుణంగా ఇంటి నిర్మాణం చేప ట్టిందా.. మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ చేయ లేదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రచార కమిటీ సభ్యులు గిరి నాగభూషణం, బండ శంకర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటి పర్తి విజయలక్ష్మి దేవేందర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు జున్ను రాజేందర్, మాజీ కౌన్సిలర్ గాజుల రాజేందర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దుర్గయ్య, గుంటి జగదీశ్వర్, వీసీసీ ఎ సెట్ కన్వీనర్ చాంద్పాషా, జిల్లా కాంగ్రెస్ కార్మికవిభాగం అధ్యక్షుడు బొల్లి శేఖర్, వేణు, మహిపాల్, నరేశ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

లక్ష్మీపూర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాలరూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలో రూ.20 కోట్లతో నిర్మించిన డబల్ బెడ్రూమ్ ఇండ్ల ప్రొసిడింగ్స్ పత్రాలను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ బుధవారం అందజేశారు. అనంతరం మహిళలకు ఎమ్మెల్యే బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు క్రీడా పరికరాలను అందజేశారు. గ్రామంలో రూ. 20 లక్షలతో నిర్మిస్తున్న జీపీ భవనం, రూ.10 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం, రూ.8 లక్షలతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్. రమణ, జడ్పీ చైర్‌పర్సన్ దావా వసంత, జిల్లా గ్రంథాయ చైర్మెన్ డాక్టర్ చంద్రశేఖర్‌గౌడ్, ఎంపీపీ రాజేంద్రప్రసాద్, సర్పంచ్ చెరుకు జాన్, ఎంపీటీసీ సునీత లక్ష్మణ్, ఆత్మ చైర్మెన్ రాజీరెడ్డి, ఎంపీడీవో రాజేశ్వరీ పాల్గొన్నారు. జగిత్యాల పట్టణం 28వ వార్డు బంజరు దొడ్డికి చెందిన 30 మంది యువకులు కడమండ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ ఎల్. రమణ కండవా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


కండువా కప్పుతున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్య

ప్రభుత్వ భూమి చదను చేస్తున్న ట్రాక్టర్లు సీజ్

నవతెలంగాణ-కథలాపూర్

కథలాపూర్ మండలంలోని ఇప్పపెల్లి గ్రామంలో ప్రభుత్వ భూమి 25 ఎకరాలను ఆ ఊరి ముదిరాజ్, యాదవ సంఘ సభ్యులు అక్రమంగా చదును చేస్తుండగా రెవెన్యూ అధికారుల బ్లేడ్ ట్రాక్టర్లను పట్టుకున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇప్పపెల్లి గ్రామ శివారులో ఉన్న గుట్ట వద్ద ముదిరాజ్, యాదవ సంఘం సభ్యులు కలిసి 25 ఎకరాల భూమిని చదును చేసి మామిడి తోట సాగు చేస్తున్నారు. ఈ విషయంపై అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయ్యారు. మళ్లీ బుధవారం కొంత మంది సభ్యులు కలిసి ప్రభుత్వ భూమి చదును చేస్తుండగా తహసీ ల్దార్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే ఆర్ఐ నగేష్ ఘటనా స్థలానికి చేరుకుని రెండు బ్లేడ్ ట్రాక్టర్లను పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమానులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇప్పపెల్లి గ్రామ స్తులు నరేష్, నర్సరెడ్డి, మల్యాల జలంధర్, ముదం స్వామి, పొన్నాల రాజరెడ్డి, మహిపాల్, చిన్న రెడ్డి, కుమ్మరి నరేష్, తదితరులు పాల్గొన్నారు.


చదును చేస్తున్న ట్రాక్టర్లు

లింగ నిర్ధారణ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం

నవతెలంగాణ-మల్లాపూర్

గ్రామాల్లో లింగ నిర్ధారణ చేసే వారిపై కఠిన చర్యలు తీసు కుంటామని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.. ఆస్పత్రుల్లో జన్యు పరీక్షలు నిర్వహించే ప్రయివేట్, ప్రభుత్వ సంస్థలు తమ అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాలు, పరికరాలు ప్రదేశాలను సంబంధిత జిల్లా వైద్య, ఆరోగ్యశాఖా ధికారి వద్ద తప్పని సరిగా నిర్దేశిత రుసుముతో రిజిస్ట్రేషన్ చేసుకోవాన్నారు. నిబంధనలకు విరుద్ధంగా స్కానింగ్లు తీసే వారికి మొదటి తప్పుకు 3ఏండ్లు జైలు, రూ 50వేల జరిమానా, అదే తప్పు మరొకసారి చేస్తే 5 ఏండ్ల జైలు, లక్ష జరిమానా విధిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి వాహిని, సిహెచ్ఓ రామ్మోహన్, హెల్త్ సూపర్వైజర్ శ్రీనివాస్, సిబ్బంది తదితరులున్నారు.


మాట్లాడుతున్న వైద్యాధికారి

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అన్నారు. ఇబ్ర హీంపట్నం మండలంలోని కోమటి కొండాపూర్ గ్రామంలో జీపీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మన ఊరు మనబడి కార్యక్రమం కింద మంజూరైన పనులను కూడా ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి చేసే వారికే పట్టం కట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పొనకంటి వెంకట్, సర్పం చులు సర్పంచ్ కొప్పెల శ్రీనివాస్, సోమ ప్రభాకర్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.


నాయకులతో ఎమ్మెల్యే

ఆశావర్కర్ల బిక్షటన

నవతెలంగాణ-వెల్గటూర్

రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించి ఫిక్స్ వేతనం రూ.18వేలు ఇవ్వాలని మండల కేంద్రం లో ఆశాలు బిక్షాటన చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న ఆశాలు బడుగు బలహీన వర్గాలకు చెందిన వారని, కరోనా సమయంలో కూడా ప్రాణాలు ఫణంగా పెట్టి పోరాటం చేశారని పేర్కొన్నారు. గతంతో పోలిస్తే ఈ కాలంలో ఆశావర్కర్లకు పని భారం పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు, విజయ, క్యాతం పూల, గవ్వల యమునా, హరిత, చొప్పదండి సుమలత, తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్:మండల కేంద్రంలో ఆశాకార్యకర్తలు రాష్ట్ర ప్రభుత్వం న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం భిక్షాటన చేపట్టారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆశాల కు హెల్త్ కార్డులు అందజేయాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం రూ. 5 లక్షలు ఇవ్వాలనీ, ఆశాలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లయ, శిరీష, లావణ్య, స్వప్న, రమ, వసంత, లత, శాంత, రాజేశ్వరి, ప్రేమలత, సరిత పాల్గొన్నారు.


మల్లాపూర్: బిక్షటన చేసిన ఆశాలు

పూలే, ఐలమ్మల విగ్రహావిష్కరణ

నవతెలంగాణ -మెట్‌పల్లి

మెట్‌పల్లి పట్టణంలో జ్యోతిరావు పూలే, చాకలి ఐలమ్మల విగ్రహాలను ఎమ్మెల్యే విద్యాసాగం రావు బుధవారం ఆవిష్కరించారు. ఈ మహా నుభావుల త్యాగాల ఫలితంగా పేద మధ్యతరగతి, బడుగు బలహీన వర్గాలకు విద్య ఫలాలు అందయాన్నారు. అనంతరం పట్టణంలోని వెంకట్ రెడ్డి గార్డెన్ లో మున్సిపాలిటీలోని పెన్షన్ దారులకు కార్డులను, బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. మైనారిటీ లబ్ధిదారులకు లక్ష రూపాయల రుణ సౌకర్యం చెక్కులను 11 మంది లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రానావేని సుజాత సత్య నారాయణ, వైస్ చైర్మన్ బోయినపల్లి చంద్రశేఖరరావు, కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, కౌన్సిల ర్సు కోఆప్షన్స్ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రానావేని సుజాత సత్య నారాయణ, వైస్ చైర్మన్ బోయినపల్లి చంద్రశేఖం రావు, పట్టణ నాలుగు రజక సంఘ అధ్యక్షులు పిప్పర దశరథం, వన్నెల నరసయ్య, పుల్లూరి అంశయ్య, వడ్లాల లక్ష్మణ్, పిప్పర రాజేష్, పిప్పర రాజం, వన్నెల అంజయ్య, కల్లూరు సురేష్ ,మైలారం భూమయ్య, మైలారపు లక్ష్మణ్, పుల్లూరు బుచ్చి రాజం, రజక సంఘ నాయకులు కౌన్సిలర్లు కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.


పూలే విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ఘనంగా మాజీ మంత్రి జువ్వాడి జయంతి



నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు జయంతిని ఘనంగా బుధవారం ఘనంగా నిర్వహించార. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్‌రెడ్డి, నరేందర్, కృష్ణ, దశరథ్, లింగారెడ్డి, రాములు, నిఖిల్, చందు, రాజు, రమేష్, రాకేష్, కాంగ్రెస్ పాల్గొన్నారు.

మల్లాపూర్:మండల కేంద్రంలో మాజీ మంత్రి స్వర్గీయ జువ్వాడి రత్నాకర్ 96వ జయంతి వేడుకలు కాంగ్రెస్ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లను పంపిణీ చేపట్టారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఎంపీటీసీ సత్తమ్మ మల్లయ్య, టౌన్ ప్రెసిడెంట్ జీవన్ రెడ్డి, కేడీసీసీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, ఎలా సోమారెడ్డి, కోటగిరి ఆనంద్ గౌడ్, ఎర్ర భూమయ్య, నల్ల ఏకంబర్, నూతిపెల్లి రాజం, సుంకేట నారాయణ, ఇట్టేదినారాయణ, బండారి రమేష్ పాల్గొన్నారు.

కోరుట్ల : పట్టణంలో మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు జయంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళలర్పించారు. ఈ కార్యక్రమంలో జువ్వాడి నర్సింగారావు, జువ్వాడి కృష్ణారావు, జువ్వాడి చంద్రశేఖర్‌రావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమ్మె విరమణ

నవతెలంగాణ-మల్యాల

24 రోజులుగా అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె విజయవంతం అయిందని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జగిత్యాల జిల్లా కమిటీ జిల్లా అధ్యక్షురాలు కే. రజిత పేర్కొన్నారు. చలో హైదరాబాద్‌కు సందర్భంగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ సమక్షంలో సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ నాయకులతో జరిగిన చర్చలు సఫలం అయినట్టు తెలిపారు. జేఏసీ పెట్టిన డిమాండ్ల మీద స్పష్టమైన హామీ రావడంతో అంగన్‌వాడీ ఉద్యోగులు సమ్మె విరమించడం జరిగిందని పేర్కొన్నారు. ప్రధానంగా అంగన్‌వాడీ ఉద్యోగులు పీఆర్సీలో కలుపుతామని గతంలోని హామీ ఇచ్చారని, ప్రభుత్వ ఉద్యోగులకు 5శాతం ఐఆర్ ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అదేవిధంగా రిటైర్మెంట్ బెనిఫిట్ టీచర్‌కి రెండు లక్షలు ఆయా ఒక లక్ష రూపాయలు సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. సమ్మె కాలపు వేతనం ఇస్తామన్నారు డిపార్ట్మెంట్ పరిధిలో పరిష్కారం అయ్యే సమస్యలను చర్చించి సర్క్యులర్లు జారీ చేస్తామ న్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇవ్వడంపై ఐ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు)జగిత్యాల జిల్లా కమిటీ స్వాగతిస్తున్నదని ఆమె పేర్కొన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు పేస్కేల్, పర్మినెంట్ తదితర సమస్యల పరిష్కారానికి భవిష్యత్తులో మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు.

మహా పాదయాత్రతో కేంద్రం కండ్లు తెరిపిస్తాం

ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ దూమాల గంగారాం

నవతెలంగాణ-జగిత్యాల టౌన్

ఎస్సీ వర్గీకరణపై నిర్ణయం తీసుకోకుండా మాదిగలకు అన్యాయం చేస్తున్న కేంద్ర బీజేపీ పాలకుల కండ్లు తెరిపించేందుకే మాదిగల విశ్వరూప మహాపాదయాత్ర చేపట్టినట్టు ఎంఎస్పీ జగిత్యాల జిల్లా కన్వీనర్ దూమాల గంగారాం అన్నారు. బుధవారం తహసీల్దార్ చౌరస్తాలో మాదిగల విశ్వరూప మహా పాదయాత్ర పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గంగారాం మాట్లాడుతూ.. ఈ నెల 7న జోగులాంబ-గద్వాల జిల్లా అలంపూర్ నుంచి మాదిగల విశ్వరూప మహా పాదయాత్ర ప్రారంబమవుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌తో పల్లెలను, పట్టణాలను ఏకం చేస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ సురుగు శ్రీనివాస్, మాదిగ సీనియర్ నాయకులు కట్ట భూమేశ్వర్, ఈరెల్లి శంకర్, గుడిసె రవి, ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ బలవంతులు, సురేష్, జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి బోనగిరి కిషన్, కో ఇన్చార్జ్ మీసాల సాయిలు, ఎంఎస్పి ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జి అరకిల సతీష్ పాల్గొన్నారు.

గల్ఫ్ దేశాల్లో మృతి చెందిన కార్మికుల రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలి

-సామాజిక కార్యకర్త, గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘాల ప్రతినిధి బత్తిని రాజా గౌడ్

నవతెలంగాణ -మెట్‌పల్లి

తెలంగాణకు చెందిన 2000 మందికి పైగా గల్ఫ్ కార్మికులు ఇప్పటి వరకు వివిధ దేశాల్లో మృతి చెందారని సామాజిక కార్యకర్త, గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘాల ప్రతినిధి బత్తిని రాజాగౌడ్ అన్నారు. ప్రవాసి భారతీయ బీమా యోజన అనే రూ.10 లక్షల విలువైన ప్రమాద బీమా పథకంలో సహజ మరణంను కూడా చేర్చాలన్నారు. 18 దేశాల్లో కార్మికులుగా పని చేస్తున్న 15 లక్షల గల్ఫ్ కార్మికుల కోసం, ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్ర గల్ఫ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. భద్రత, నిబద్ధత, భరోసాతో కూడిన ప్రత్యేక విధానాన్ని రూపొందించి గల్ఫ్ కార్మికులకు భరోసా కల్పించాలన్నారు.గల్ఫ్ ఉద్యోగాల పేరుతో మోసం చేసే ఏజెంట్ వ్యవస్థను నిర్మూలించాలి. గల్ఫ్ దేశాల్లో మతి చెందిన వ్యక్తుల కుటుంబాలకు ప్రభుత్వ పరిహారాన్ని అందించాలి. గల్ఫ్ సమస్యల పరిష్కారానికి ప్రవాస తెలుగు వ్యవహారాల కేంద్రం ఏర్పాటు చేసి నిరంతర సహాయక కేంద్రం సిబ్బందిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.


గల్ఫ్ కార్మిక సంక్షేమ ప్రతినిధి రాజా గౌడ్

పసుపుబోర్డు ప్రకటన రైతుల విజయం

నవతెలంగాణ -మెట్ పల్లి

పసుపు బోర్డు ప్రకటన రైతుల విజయం అని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ చైర్మెన్ అన్వేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మెట్‌పల్లి మండలంలోని బండలింగపూర్ గ్రామంలో రైతులు ఆయన్ని ఘనంగా సన్మానించారు. పసుపు బోర్డు కంటే ప్రాంతీయ కార్యాలయం బోర్డు కంటే గొప్పదని చెప్పి ఎంపీ అరవింద్ రైతులను మోసం చేసాడన్నారు. బోర్డు రాదు ఉన్న బోర్డులు తీసేస్తున్నారు అన్న ఎంపీ పసుపు బోర్డు ప్రకటనతో రైతులకు ఎం సమాధానం చెప్తుతారన్నారు. పసుపు బోర్డును రాజకీయ లబ్ధిగా కాకుండా రైతులకు మేలు చేసేలా ఎన్నికల నోటిఫికేషన్‌కి ముందే అధికా రికంగా ప్రకటించాలని, బోర్డుకు ప్రత్యేక బడ్జెట్ ఎంత ఇస్తున్నారో చెప్పాల న్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, జిల్లా కిసాన్ సెల్ కార్యదర్శి గంగోని క్రాంతికుమార్, కిసాన్ సెల్ మండ లాధ్యక్షులు పిడుగు తిరుపతిరెడ్డి, కిసాన్ సెల్ టౌన్ ప్రెసిడెంట్ కొమ్ముల సంతోష్‌రెడ్డి, పార్లమెంట్ కో-ఆర్డినేటర్ గోరుమంతుల ప్రవీణ్‌కుమార్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షులు అల్లూరి సురేందర్‌రెడ్డి, బండలిం గాపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు జంగిటి రాజేందర్ పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న కిసాన్ కాంగ్రెస్ నాయకులు

అంగన్‌వాడీల అక్రమ అరెస్టు

నవతెలంగాణ- మల్యాల

మల్యాల మండల కేంద్రంలో నుంచి చలో హైద రాబాద్‌కు వెళు న్న అంగన్‌వాడీ ఉద్యోగులను పోలీసులు అరెస్టు చేసి స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. వారికి కాంగ్రెస్ పార్టీ చొప్పదండి నియోజ కవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం సంఘీభావం తెలిపారు.

వెల్గటూర్ :చలో హైదరాబాద్‌కు వెళ్తున్న అంగన్‌వాడీలను వెల్గటూర్ మండల కేంద్రంలో పోలీసుల అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో దొరిశెట్టి తిరుమల, సంగ ప్రేమలత, బండారి సత్య, బండమిది మల్లేశ్వరి, బుద్దె జయలక్ష్మి, గుమ్మడి మౌనిక ఉన్నారు. వారికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తాటిపర్తి శైలందర్ రెడ్డి సంఘీభావం తెలిపారు.

మెట్ పల్లి: చలో హైదరాబాద్‌కు వెళ్తున్న అంగన్‌వాడీలను మెట్‌పల్లి పోలీసులు మంగళవారం రాత్రి అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌ఖు తరలించారు.


మెట్‌పల్లిలో అరెస్టు అయిన అంగన్‌వాడీలు

సుకుమార్ జ్ఞాపకార్థం బస్ షెల్టర్ ఏర్పాటు

నవతెలంగాణ-మల్లాపూర్

మండలంలోని ముత్యంపేట గ్రామంలో కీ.శే. వుయ్యాల సుకుమార్ (కోరుట్ల) జ్ఞాపకార్థం వుయ్యాల సుకుమార్ చారిటబుల్ ట్రస్ట్, సుమన్ యూత్ ఆధ్వర్యంలో బస్ షెల్టర్‌ను బుధవారం ప్రారం భించారు. ప్రారం భించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ.. ప్రజల సౌకర్యార్థం నూతన మిని బస్ షెల్టర్ ను ముత్యంపేట్‌లోని మహాత్మ జ్యోతి రావుపూలే విగ్రహం వద్ద ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు గొడిసెల సజన్,బొల్లం రాజు,బొల్లం రఘు పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న నరసయ్య

లక్కీడ్రా స్కీం పేరుతో మోసం

నవతెలంగాణ-మేడిపల్లి

భీమారం, కథలాపూర్ మండలాలకు చెందిన పలువురు రైతులను లక్కీ డ్రా స్కీం పేరుతో మోసం చేసిన వ్యక్తిని పోలీసులు అరెసు చేశారు. మేడిపల్లి స్టేషన్ హౌస్ అధికారి కథనం ప్రకారం మెట్‌పలి కి చెందిన గోనె ప్రతాప్ మోటార్ సైకిల్ లక్కీ డ్రా స్కీం కింద అమాయకులైన రైతులను నుంచి డబ్బులు వసూలు చేశారు. భీమారం మండలానికి చెందిన చెక్కపల్లి రఘు, దాసరి నాగరాజు ఫిర్యాదు మేరకు గోనె ప్రతాప్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఎం. చిరంజీవి తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్ల అరెస్ట్

నవతెలంగాణ-రుద్రంగి:

రుద్రంగి మండలంలోని అంగన్‌వాడీ టీచర్లను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లు మాట్లాడుతూ గత 25 రోజులుగా తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో ఈ రోజు చలో హైదరాబాద్ కు పిలుపునివ్వడం జరిగిందన్నారు. చలో హైదరాబాద్ వెళ్తున్న సమయంలో పోలీసులు ముందస్తు అరెస్ట్ చేయడం సరికాదని అన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు.



రుద్రంగి పోలీస్ స్టేషన్లో అంగన్‌వాడీ టీచర్లు

ప్రగతి భవన నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-ఎల్లారెడ్డిపేట:

ఎల్లారెడ్డిపేట మండలంలోని హరిదాస్‌నగర్‌లో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మంచనున్న ప్రగతి భవన్‌కు బుధవారం సర్పంచ్ అమృత, ఎంపీపీ పిల్లి రేణుక కిషన్, జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అనేక ప్రజా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఉప్పుల మల్లేశం, సెస్ డైరెక్టర్, మండల అధ్యక్షులు వరుస కృష్ణహరి, సింగిల్ విండో అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు జంగిడి సత్తయ్య, పట్టణ అధ్యక్షులు బండారి బాల్‌రెడ్డి, ఎఎంసీ వైస్ చైర్మన్ బందారపు బాల్‌రెడ్డి, డైరెక్టర్ మెండె శ్రీనివాస్ యాదవ్, ఎఎంసీ మాజీ డైరెక్టర్ ఉప్పుల రాజిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కర్ల శేఖర్, సిరికొండ నాగరాజు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు

కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా రొడ్డ రామచంద్రం

నవతెలంగాణ-ఎల్లారెడ్డిపేట:

రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా రొడ్డ రామచంద్రంను నియమించినట్లు బుధవారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆది శ్రీనివాస్ పంపిన నియామక పత్రాన్ని ఎల్లారెడ్డిపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అందజేశారు. మండల ప్రధాన కార్యదర్శిగా తిమ్మాపూర్ గ్రామానికి చెందిన దండు శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. మండల కార్యదర్శిగా హరిదాస్‌నగర్ గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ ఊరడి ఎల్లయ్య బాధ్యతలు చేపట్టారు. మండల అధికార ప్రతినిధిగా మానుక నాగరాజు బాధ్యతలు స్వీకరించారు. వీరిని మండల కాంగ్రెస్ కమిటి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు చెన్ని బాబు, వంగ మల్లారెడ్డి, కొత్తపల్లి దేవయ్య, అన్నవేని రవి, ఎండి రఫీక్, సూడిది రాజేందర్, బిపేట రాజు, తిరుపతిగౌడ్, బాలయ్య, పందిర్ల శ్రీనివాస్, కోనేటి పోచయ్య, ఎండి హిమాం, ఉప్పుల రవి, చెట్పల్లి బాలయ్యలు పాల్గొన్నారు.

జాతీయ అవార్డు గ్రహీత

ముత్యాల ప్రభాకర్‌కు సన్మానం

నవతెలంగాణ-ఎల్లారెడ్డిపేట:


పభాకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఫోటో గ్రాఫర్ ముత్యాల ప్రభాకర్‌కు జాతీయ అవార్డు రావడంతో బుధవారం మండల రెడ్డి సంఘం ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ముత్యాల ప్రభాకర్ రెడ్డి ఫోటో రంగంలో ఇటీవల తెలుగు వెలుగు సాహితీ వేధిక ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో జాతీయ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా మండల రెడ్డి సంఘం అధ్యక్షులు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభాకర్‌రెడ్డి రాష్ట్ర, జాతీయ స్థాయిలో వివిధ రంగాలలో ఫోటోలు తీసి ఉత్తమ అవార్డులను సొంతం చేసుకున్నందున గర్వకారణంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెడ్డి సంఘం అధ్యక్షులు గుండాడి వెంకట్‌రెడ్డి, సభ్యులు వంగల గిరిధర్‌రెడ్డి, ముడుసు సాయిరెడ్డి, మోతే లక్ష్మారెడ్డి, ప్రవీణ్ రెడ్డి, జింక ఆరుట్ల సత్యం రెడ్డి, ముచ్చట తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

విద్యాధికారి కార్యాలయం ముట్టడించిన కార్మికులు

నవతెలంగాణ-కోనరావుపేట:


ముట్టడించిన కార్మికులు

మధ్యాహ్న భోజన కార్మికులు గత ఏడు రోజులుగా చేస్తున్న నిరవధిక సమ్మె భాగంగా బుధవారం మండల విద్యాధికారి కార్యాలయాన్ని ముట్ట డించారు. మా సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆందోళన చేపట్టి అనంతరం విద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నాయకులు గురజాల శ్రీధర్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం 15000, రూపాయలు చెల్లించాలి. పెంచిన వేతనాలు చెల్లింపులకు బడ్జెట్ విడుదల చేయాలని, కొత్త మెనుకు బడ్జెట్ కేటాయించాలని, పెండింగ్ బిల్లులు తక్షణం విడుదల, జీవో నెంబర్ 8 ప్రకారం వేతనాలను ఏరియర్స్ తో సహా చెల్లించాలి. గుర్తింపు కార్డులు ప్రభుత్వం ఇవ్వాలి. వంట షెడ్లు, వంట పాత్రలు తదితర మౌలిక వసతులు కల్పించాలి. కాటన్ బట్టల యూనిఫామ్ ఇవ్వాలి, సామాజిక భద్రత కల్పించాలి. ప్రమాద బీమా, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి. షరతులు లేకుండా బ్యాంకు ద్వారా రుణాలు ఈ కార్యక్రమంలో గొట్టే బాలామణి, కవిత, వెంకటలక్ష్మి, లక్ష్మి తదితర కార్మికులు పాల్గొన్నారు.

తాటి చెట్టుపై నుంచి పడి గీతకార్మికునికి గాయాలు

నవతెలంగాణ-కోనరావుపేట:

కోనరావుపేట మండల కేంద్రంలో బుధవారం తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికునికి గాయాలయ్యాయి. మండల కేంద్రం చెందిన లింగపురం వెంకటస్వామి గౌడ్ అనే కార్మికుడు కల్లుగీతకు వెళ్లి మోకుజారి ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. వెంటనే రిసిల్ల ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. యన పరిస్థితి బాగానే ఉందని డాక్టర్లు తెలిపారు. వెంకటస్వామి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

వికలాంగులకు ఉచిత బస్సు పాసులు అందజేత

నవతెలంగాణ-తంగళ్ళపల్లి:

వికలాంగులకు ఉచిత బస్సు పాసులను పత్తిపాక సురేశ్ ఆధ్వర్యంలో ఆర్టీసీ సిబ్బంది బుధవారం అందజేశారు. మండలంలోని కేసీఆర్‌నగర్ కాలనీకి చెందిన 45 వికలాంగులకు ఉచితంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసేందుకు అవకాశాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో కూరపాటి శ్రీదర్, మహేశ్, గుండెటి రవితేజ, సమలేటి గన్ శ్యాం, హిందు సాంస్కృతిక సమితి సభ్యులు పాల్గొన్నారు.

భిక్షాటనతో ఆశా కార్యకర్తల నిరసన

నవతెలంగాణ-సిరిసిల్ల రూరల్:


బిక్షాటన చేస్తున్న ఆశా కార్యకర్తలు

తమ సమస్యలను పరిష్కరించాలని ఆశ వర్కర్లు చేస్తున్న నిరవధిక సమ్మె 10వ రోజుకు చేరుకుంది. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా బుధవారం సిరిసిల్ల పట్టణంలో ఆశా వర్కర్లు భిక్షాటన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎగమంటి ఎల్లారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఆశ వర్కర్ల సమస్యల పట్ల మొండి వైఖరి వహించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ , సహాయ కార్యదర్శి ఎలిగేటి రాజశేఖర్, ఆశ యూనియన్ అధ్యక్షురాలు మంజుల, కార్యదర్శి జయశీల, భారతి , లత, కస్తూరి, రుచిత, పెద్ద ఎత్తున ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

జడ్పీటీసీ నిధులతో బోరుబావి నిర్మాణం

నవతెలంగాణ-వీర్నపల్లి:

వీర్నపల్లి మండల కేంద్రంతో పాటు, కంచర్ల గ్రామంలో బుధవారం బోరు బావి నిర్మాణ పనులకు సర్పంచ్ దినకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు జెడ్పిటిసి నిధులతో రెండు బోరు బావులకు నిర్మాణం చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ మల్లేశం, ఎంపిటిసి అరుణ్ కుమార్, బంజరా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ నాయక్, బీఆర్ఎస్ మండల నాయకులు పిట్ల లింబాద్రి, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షులు సామల్ల దేవరాజు, ఉప సర్పంచ్ రవిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

జిల్లాలో అతివలదే ఆధిక్యం

జిల్లాలో 4,58,958 మంది ఓటర్లు

నవతెలంగాణ-సిరిసిల్ల రూరల్:

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటరు తుది జాబితా ప్రచురించారు. బుధవారం విడుదల చేసిన తుది ఓటరు జాబితా ప్రకారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొత్తం 4,58,958 మంది ఓటర్లు ఉన్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో 2,40,798 మంది, వేములవాడ నియోజకవర్గంలో 2,18,160 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. వీరితో పాటు రెండు నియోజకవర్గాలలో కలిపి మొత్తం 158 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు. రెండు నియోజకవర్గాల్లో కూడా ఓటర్ల సంఖ్యలో మహిళలదే పైచేయిగా కనిపిస్తుంది. మహిళా రిజర్వేషన్ లో సిరిసిల్ల వేములవాడ నియోజకవర్గాలను ఈ ఎన్నికలు కాకుండా తదుపరి మళ్లీ వచ్చే ఎన్నికల్లో ఈ రెండు సీట్లను మహిళలకే కేటాయిస్తారు.

ఈ జాబితాను కలెక్టరేట్, రెవెన్యూ డివిజనల్ అధికారి, తహసీల్దార్ కార్యాలయాలతో పాటు అన్ని పోలింగ్ కేంద్రాలలో ప్రజల పరిశీలనార్థం అందుబాటులో ఉంచనున్నారు. అలాగే అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ఓటరు జాబితా కాపీని అందజేయనున్నారు. జిల్లాలో ఇంకా ఎవరైనా అక్టోబర్ 1 ,2023 నాటికి 18 సంవత్సరాలు నిండి ఓటరు జాబితాలో పేర్లు లేకుంటే వెంటనే ఓటరుగా నమోదు చేసుకోవచ్చు నామినేషన్ల స్వీకరణ ముగింపు నాటికి ఓటరుగా నమోదు కావచ్చు.


రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఓటర్ల జాబితా

రాజన్న సిరిసిల్ల జిల్లాలో తుది ఓటర్ జాబితాను అధికారులు విడుదల చేయగా 289 పోలింగ్ స్టేషన్లకు గాను ఎన్ఆర్ఐ ఓటర్లు 13 మంది సర్వీస్ ఓటర్లు 106 మంది ఉన్నారు అంతేకాకుండా దివ్యాంగులు సిరిసిల్ల నియోజకవర్గంలో 5669 మంది, వేములవాడ నియోజకవర్గంలో 5810 మంది ఓటర్లుగా నమోదయి ఉన్నారు. అలాగే జిల్లాలో ట్రాన్స్ జెండర్ లు 33 మంది ఉన్నారు. వయస్సులను బట్టి ఎంతమంది ఓటర్లు ఉన్నారనే దానిపై పూర్తిగా విశ్లేషించారు. వేములవాడ నియోజకవర్గం లోని మహిళా ఓటర్లు 113186, పురుషులు 1,04,943 మంది ఓటర్లు ఇతరులు 31 ఉండగా మొత్తం 2,18,160 ఓటర్లు ఉన్నారు. అలాగే సిరిసిల్ల నియోజకవర్గంలోని పురుషులు 1,17,872 మంది ఓటర్లు, మహిళలు1,22,920 మంది ఓటర్లు ఉండగా ఇతరులు 06 మొత్తం 2,40,798 మంది ఓటర్లు ఉన్నారు. అలాగే వయసుల వారిగా సిరిసిల్ల నియోజకవర్గంలో చూస్తే 18 ఏళ్ల నుంచి 19 ఏళ్ల వరకు 5714, 20 ఏళ్ల నుంచి 29 ఏళ్ల వరకు 46670, 30 ఏళ్ల నుంచి 39 ఏళ్ల వరకు 62,262, 40 ఏళ్ల నుంచి 49 ఏళ్ల వరకు 47,799, 50 ఏళ్ల నుంచి 59 ఏళ్ల వరకు 36,201, 60 ఏళ్ల నుంచి 69 ఏళ్ల వరకు 24,180, 70 ఏళ్ల నుంచి 79 ఏళ్ల వరకు 13,279, 80 ఏళ్ల నుంచి 89 ఏళ్ల వరకు 3,872, 90 ఏళ్ల నుంచి 99 ఏళ్ల వరకు 689, 100 ఏళ్ల నుంచి 109 ఏళ్ల వరకు 45 మంది ఓటర్లు ఉన్నారు. వేములవాడ నియోజకవర్గం లోని వయసుల వారీగా చూస్తే 18 ఏళ్ల నుంచి 19 ఏళ్ల వరకు 5345, 20 ఏళ్ల నుంచి 29 ఏళ్ల వరకు 44,852, 30 ఏళ్ల నుంచి 39 ఏళ్ల వరకు 55,400, 40 ఏళ్ల నుంచి 49 ఏళ్ల వరకు 42,213, 50 ఏళ్ల నుంచి 59 ఏళ్ల వరకు 32,814, 60 ఏళ్ల నుంచి 69 ఏళ్ల వరకు 21,943, 70 ఏళ్ల నుంచి 79 ఏళ్ల వరకు 11,787, 80 ఏళ్ల నుంచి 89 ఏళ్ల వరకు 3,252, 90 ఏళ్ల నుంచి 99 ఏళ్ల వరకు 522, 100 ఏళ్ల నుంచి 109 ఏళ్ల వరకు 31 మంది ఓటర్లు ఉన్నారు. ఓటర్ జాబితాను విడుదల చేశారు.


సమావేశమైన అధికారులు

జాబితా విడుదల

- భీమ్యా నాయక్, జిల్లా డిప్యూటీ ఎన్నికల అధికారి, రాజన్న సిరిసిల్ల జిల్లా


భీమ్యా నాయక్,

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఓటర్ తుది జాబితాను విడుదలైందని జిల్లా డిప్యూటీ ఎన్నికల అధికారి భీమ్యా నాయక్ తెలిపారు. జిల్లాలో 4,58,958 ఓటర్లు ఉండగా సిరిసిల్ల నియోజకవర్గం లోని 2,40,798 మంది ఓటర్లు ఉన్నారు. వేములవాడ నియోజకవర్గం లోని 2,18,160 మంది ఓటర్లు ఉన్నారు. అక్టోబర్ 1, 2023 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరు జాబితాలో పేరు లేకుంటే నామినేషన్ల స్వీకరణ ముగింపు నాటికి ఓటరుగా నమోదు చేసుకోచ్చని సూచించారు.

ఆడబిడ్డలకు కానుక బతుకమ్మ చీర

జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ

మాట్లాడుతున్న జడ్పీచైర్ పర్సన్ అరుణ



బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం

నవతెలంగాణ-సిరిసిల్ల రూరల్:

దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి వెన్నుదన్నుగా ఉంటూ ఆశీర్వదించాలని బతుకమ్మ చీర ఆడబిడ్డలకు కానుక అని జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. బుధవారం సిరిసిల్ల కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ , స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ న్యాలకొండా అరుణ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నేతృ'తంలోని రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలను ఏటా ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు. ఈ చీరల పంపిణీ తో సిరిసిల్ల లోని పవర్ లూమ్ నేత కార్మికుల కుటుంబాలకు నిరంతరం ఉపాధి లభిస్తోందన్నారు. న్యూట్రిషన్ ,కేసీఆర్ కిట్ , గహలక్ష్మి వంటి అనేక కార్యక్రమాలను మహిళల పేరుతోనే ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. గడపగడపకు సంక్షేమ పథకాలను అందిస్తూ పేదల సర్కార్‌గా పేరు పొందిందన్నారు. గడిచిన తొమ్మిదిన్నర ఏళ్లలో సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో రాష్ట మంత్రి కే తారకరామారావు నాయకత్వంలో రాజన్న సిరిసిల్ల జిల్లా అన్ని విధాలుగా అభివద్ధి చెందిందన్నారు. రాష్ట్ర పవర్ లూమ్, టెక్స్ టైల్ కార్పోరేషన్ చైర్మెన్ గూడూరి ప్రవీణ్ మాట్లాడుతూస్వరాష్ట్రం తెలంగాణలో ప్రభుత్వ ప్రత్యేక చొరవతో బతుకమ్మ పండుగ ప్రపంచ పండుగగా ఆవిర్భవించిందన్నారు. ఆడబిడ్డలకు కానుకగా అందించే బతుకమ్మ చీరల ద్వారా సిరిసిల్లలోని పవర్లూమ్ నేత కార్మికులు సుస్థిర ఆదాయం పొందుతున్నారని అన్నారు. ఈ బతుకమ్మకు ప్రభుత్వం 25 రంగులలో, 25 డిజైన్లలో, 525 రకాల చీరలను రూపొందించి పంపిణీ చేస్తుందన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి మాట్లాడుతూ బతుకమ్మ చీరల పంపిణీతో తెలంగాణ ఆడబిడ్డల మోహాల్లో సీఎం కేసీఆర్ ఆనందాన్ని నింపారని అన్నారు. బతుకమ్మ చీరల ఆర్డర్ లతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభం నుంచి బయటపడి ఆత్మగౌరవంతో నేతన్నలు జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య , నాఫ్ కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, అడిషనల్ కలెక్టర్ గౌతమ్ రెడ్డి, ఆర్‌డీవో నక్క శ్రీనివాస్, చేనేత , జౌళి శాఖ జిల్లా అధికారి సాగర్, కమిషనర్ ఆయాజ్,సెస్ డైరెక్టర్ లు స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఎస్ఐ దాస సుధాకర్



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సుధాకర్

నవతెలగాణ -ఇల్లంతకుంట:

మండలంలోని యువత సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇల్లంతకుంట ఎస్ఐ దాస సుధాకర్ తెలిపారు. సైబర్ జాగృతి దినోత్సవం సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సైబర్ నేరాల అవగాహన సదస్సు కు హాజరై మాట్లాడారు . ప్రస్తుత సమాజంలో బందిపోటు నేరాలు గాని, దొంగతనాలు గాని, దారిదోపిడిలు గాని తగ్గిపోయాయన్నారు . సీసీ కెమెరాల వల్ల, సెల్ఫోన్ డాటా రికవరీ వల్ల, సెల్ ఫోన్ టవర్ లొకేషన్‌ల వల్ల ముఖ్యమైన నేరాలన్నీ తగ్గుముఖం పట్టాయన్నారు . సైబర్ నేరగాళ్లు ప్రజల యొక్క అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని రెచ్చిపోతున్నారని అన్నారు. ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాల పట్ల విద్యార్థి నుంచి వద్దుని వరకు అవగాహన తప్పనిసరిగా ఉంగాలని సూచించారు.ఏదైనా అనుమానాలుంటే టోల్ ఫ్రీ నెంబర్ 1930 లేదా. ఎన్సీఆర్పీ పోర్టల్ లో దరఖాస్తు నమోదు చేయాలని తెలిపారు. సైబర్ నేరం ద్వారా ఎవరైనా డబ్బు పోగొట్టుకున్నట్లయితే 24 గంటల దరఖాస్తు నమోదు చేసినట్లయితే పోగొట్టుకున్న డబ్బులు తిరిగి పొందే అవకాశం ఎక్కువగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఇల్లంతకుంట కళాశాల ప్రిన్సిపాల్ , లెక్చరర్లు, కానిస్టేబుళ్లు తిరుపతి, మధు, లక్ష్మినారాయణ, జీవన్, కళాశాల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ

నవతెలంగాణ-ముస్తాబాద్:మండలంలోని పలు గ్రామాలలో బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శరత్ రావు, జడ్పీటీసీ నరసయ్య, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు గోపాల్ రావు, ఎంపీడీవో రమాదేవి, సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.


చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

చలిమెడ లక్ష్మీనరసింహారావును గెలిపించండి:

జడ్పీటీసీ మ్యాకల రవి, ఎంపీపీ వజ్రమ్మ


భూమి పూజ చేస్తున్న ప్రజా ప్రతినిధులు..

నవతెలంగాణ-వేములవాడ రూరల్ :

వేములవాడ అర్బన్ మండలం చింతల్ తానా గ్రామంలో మహిళా సంఘ భవనం నిర్మాణానికి . ఎంపీపీ బూర వజ్రమ్మ, జడ్పీటీసీ మ్యాకల రవి, సెస్ డైరెక్టర్ హరిచరణ్ రావు, సర్పంచ్ రాణి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల అభివద్ధి కోసం ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందని, ఎమ్మెల్యే రమేష్ బాబు సహకారంతో ముంపు గ్రామాలను అభివృద్ధి చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బూర బాబు, అభిలాస్, మహిళ సంఘం ఏపీఎంలు లింగం, చంద్రయ్య, మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు సుమలత, సిఏ లు స్వప్న, శ్యామల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముట్టడి విజయ వంతం చేయాలి

ప్రజాసంఘాల డిమాండ్

నవతెలంగాణ-వీర్నపల్లి:


మాట్లాడుతున్న మాల్లారపు అరుణ్ కుమార్

తహసీల్దార్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని ప్రజా సంఘాల పోరాట వేధిక నాయకులు మల్లారపు అరుణ్ కుమార్ పిలుపు నిచ్చారు. వీర్నపల్లి మండలం మద్దిమల్ల గ్రామంలో ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో పోడు రైతులతో, దళిత బంధు కోసం ఎదురుచూస్తున్నా దళిత కుటుంబలాతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలం అయిందన్నారు. పోడు భూములకు హక్కు పత్రాలు ఇస్తామని సర్వే చేసి ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. బంజేరు గ్రామంలో దళిత పోడురైతులు తమ భూమికోసం పోరాడితే పోడు రైతులపై అక్రమ కేసులు పెట్టారని అన్నారు. అక్రమ కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు జాలపెల్లి మనోజ్ కుమార్, కొలపాక అనిల్, బండారి మహేష్, దినేష్,పోడు రైతులు, దళిత కుటుంబాలు పాల్గొన్నారు.

గొల్ల కురుమల ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న గొల్ల కురుమ సభ్యులు.

నవతెలంగాణ-ముస్తాబాద్:

మండలంలోని బంధనకల్ గ్రామంలో రెండో విడత గొర్రెల పంపిణీ కోసం 97 యూనిట్ల నుంచి రూ. 44 లక్షలు వరకూ డీడీలు చెల్లించి ఆరు నెలలు గడిచిపోయినా ఇప్పటి వరకు గొర్రెలు పంపిణీ జరగలేదని వెంటనే 97 యూనిట్లకు చెందిన గొల్ల, కుర్మలు నిరసన వ్యక్తం చేస్తూ ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గొల్ల, కుర్మ సంఘాల నాయకులు మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో ఆరు నెలల క్రితమే గొర్రెల పంపిణీ చేశారని, ముస్తాబాద్ మండలంలో ఏడాదైనా ఎందుకు పంపిణీ చేయడం లేదని అధికారులను నిలదీశారు. ఈ కార్యక్రమంలో గొల్ల, కురుమ సంఘాల నాయకులు పరశురాములు, శ్రీనివాస్, తిరుపతి, రాజమల్లు, స్వామి పాల్గొన్నారు. మంత్రి కేటీఆర్ చొరవ తీసుకొని వెంటనే మంజూరు చేయించాలని కోరారు.

అమలు కానీ మిడ్‌డే మీల్స్

నాలుగేళ్లైనా అమలుకు నోచుకోని పథకం..

నవతెలంగాణ-కోనరావుపేట:


ప్రభుత్వ కళాశాల ఎదుట ధర్నా

కాలేజీల్లో పేద విద్యార్థులకు కడుపు నింపేందుకు తెలంగాణ ప్రభుత్వం మిడ్డే మిల్స్ పథకం తీసుకవచ్చింది. నాలుగేళ్ళు గడుస్తున్న ఆ పథకం అమలు చేసేందుకు అధికారులు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఆపథకం కాస్త అమలుకు నోచుకోకపోవడంతో పేద విద్యార్థులు సగం కడుపుతో కాలేజీకి వెళ్లుతున్నారు. పేదరికంతో అల్లాడుతూ తమ పిల్లలను తమలాగా కష్టపడకూడదని తల్లిదండ్రులు ఏ పనికి పంపకుండా కాలేజీలకు పంపించి చదివిస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం జూనియర్ కళాశాలలో అమలు చేస్తానంటూ ప్రభుత్వం నాలుగేళ్ల కిందట ప్రకటన చేసింది. అమలు మాత్రం ఇంతవరకు నెరవేర్చలేకపోయింది. కాలేజీల్లో మిడ్ డే మీల్స్ పథకాన్ని అమలు చేస్తే విద్యార్థుల హాజరు. ఉత్తీర్ణ శాతం పెరిగే అవకాశం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కోనరావుపేట మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ కళాశాలలో ఉత్తీర్ణ శాతం జిల్లాలోనే మొదటి స్థానంలో సందర్భాలు ఉన్నాయి. మారుమూల ప్రాంతాల నుంచి కాలేజీకి వచ్చే విద్యార్థులు అధిక శాతం విద్యార్థులు ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చేసి కాలేజీల్లో మిడ్ డే మిల్స్ వెంటనే అమలు చేయాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

వేతనాలు పెంచాలని మున్సిపల్ కార్మికుల నిరసన

అక్టోబర్ 8 నుండి నిరవధిక సమ్మె

నవతెలంగాణ- సిరిసిల్ల రూరల్:


మున్సిపల్ ముందు నిరసన కార్మికులు

వేతనాలు పెంచి, పర్మనెంట్ చేయాలని బుధవారం మున్సిపల్ కార్యాలయం ముందు మున్సిపల్ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ముశం రమేష్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచి, పర్మినెంట్ చేయాలని ప్రభుత్వానికి అనేక దఫాలుగా వినతిపత్రాలు అందించిన ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా ధోరణి వహిస్తున్నందున్నారు. అక్టోబర్ 8 నుండి నిరవధిక సమ్మెకు వెళ్లాలని రాష్ట్రవ్యాప్తంగా నిర్ణయించడం జరిగిందన్నారు. ప్రభుత్వం కనీస వేతనాలు అమలు చేయకుండా కార్మికుల శ్రమ దోపిడీ చేస్తుందన్నారు. మున్సిపల్‌లో కార్మికులు ఇబ్బందులు పడుతున్నా, మంత్రి కేటీఆర్ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు మోరా అజయ్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కాసార శంకర్, పట్టణ అధ్యక్షులు సుల్తాన్ శంకరయ్య, మున్సిపల్ యూనియన్ నాయకులు గడ్డం భారతక్క, గడ్డం విజయ రెడ్డి, మల్ల రాజయ్య, అర్జున్, మమత, తదితరులు పాల్గొన్నారు.

నూతన గ్రామ పంచాయతీల ప్రారంభోత్సవం

నవతెలంగాణ-ముస్తాబాద్:


నూతన జీపీలను ప్రారంభిస్తోన్న నేతలు

మండలంలోని పలు గ్రామపంచాయితీ నూతన భవనాలను, అంగన్‌వాడీ భవనాలను, సీసీ రోడ్ల అభివృద్ధి పనులను ప్రారంభించారు. మొర్రపూర్ తండా జీపీ నూతనభవనం, తెర్లుమద్దిలో పల్లె దవఖాన, అంగన్వాడీ కేంద్రం, జీపీ భవనం ప్రారంభించారు. సేవాలాల్ తండా, తుర్కపల్లిలో నూతన గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభించారు. కమ్యూనిటీ హాల్‌కు భూమి పూజ చేశారు. ఆవునూరు నూతన జీపీ రామలక్ష్మణపల్లెలో మురుగునీటి కాలువల శంకుస్థాపన, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శరత్ రావు, జడ్పీటీసీ నరసయ్య, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు గోపాల్ రావు మార్కెట్ కమిటీ చైర్మన్ అక్క రాజు శ్రీనివాస్, విద్యుత్ సహకార సంఘం డైరెక్టర్ అంజిరెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు కిషన్ రావు, డి ఈ సుదర్శన్ రెడ్డి, ఏఈ రెహమతుల్లా, మాజీ జడ్పీటీసీ యాదగిరి గౌడ్, మాజీ విద్యుత్ సహకార సంఘం డైరెక్టర్ విజయ రామారావు, రాష్ట్ర నాయకులు వెంకట నరసింహారావు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

యారన్ సబ్సిడీ చెల్లించడంలో ప్రభుత్వం కాలయాపన

నవతెలంగాణ-సిరిసిల్ల రూరల్:


నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

2021 బతుకమ్మ చీరలకు సంబంధించి పవర్లూమ్ కార్మికులకు రావలసిన పది శాతం యారన్ సబ్సిడీ చెల్లిం చడంలో ప్రభుత్వం కాలయాపన చేయకుండా వెంటనే అందిం చాలని, వర్కర్ టు ఓనర్ పథకాన్ని వెంటనే కార్మికులకు అందించాలని పవర్లూమ్ వర్కర్ యూనియన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం చేనేత జౌళి శాఖ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ పవర్లూమ్ కార్మికులకు 10 శాతం యారన్ సబ్సిడీ అందించడంలో ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. ఇప్పటివరకు కేవలం 2020 సంవత్సరానికి చెందిన సబ్సిడీ మాత్రమే కార్మికులకు అందించారన్నారు. తొమ్మిది సంవత్సరాలుగా కార్మికులను యజమానులుగా మారుస్తానని 1104 మంది కార్మికులకు ఒక్కొక్కరికి నాలుగు మరమగ్గాలు వర్క్ షెడ్ ప్రభుత్వం నిర్మించి ఇస్తామని చెప్పిందనీ, కానీ ఇంతవరకు వర్కర్ టు ఓనర్ పథకం అమలు కాలేదన్నారు. వెంటనే పవర్లూమ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఎలిగేటి రాజశేఖర్ జిల్లా నాయకులు నక్క దేవదాస్, గుండు రమేష్ కందిమల్లేశం, ముశం శంకర్, బెజిగం సురేష్, కోడం రాజేష్, తిరుపతి, సత్యనారాయణ, కందుకూరి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఐటిఐలో అడ్మిషన్ కొరకు దరఖాస్తుల స్వీకరణ

నవ తెలంగాణ-తంగళ్ళపల్లి:

ప్రభుత్వ ప్రైవేటు ఐటిఐలో విద్యార్థులు చేరేందుకు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని కళాశాల ప్రిన్సిపల్ జి కనకయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తంగళ్ళపల్లి మండలం టెక్స్‌టైల్స్ పార్కులో ఉన్న ఐటిఐ కళాశాలలో 2023 సంవత్సరంలో విద్యార్థులు ఐదవ విడత లో దరఖాస్తు చేసుకునేందుకు అక్టోబర్ 1 నుంచి 8వ తేదీ వరకు విద్యార్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అక్టోబర్ 9న కళాశాలకు హాజరు కావాలని కోరారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు

● రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

నవతెలంగాణ-గోదావరిఖని: రాష్ట్రంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాన్ని అందించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. మంగళవారం రాత్రి రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 30 డివిజన్‌లో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సమైక్య పాలనలో ఆకలిచావులు ఆత్మహత్యలు ఉండేవని.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో సంక్షేమ పాలన సాగుతోందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామగుండం నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్, డిప్యూటీ మేయర్ నడిపల్లి అభిషేక్ రావు, నాయకులు మంద రమేష్ గౌడ్ తదితరులున్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడిగా నియమితులై, బుధవారం ప్రమాణ స్వీకారం చేసిన మాజీ మేయర్ కొంకటి లక్ష్మీనారాయణను హైదరాబాద్‌లో రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూలబొకే అందజేసి, అభినందనలు తెలిపారు.

రాజీ'నామా'ల రాజకీయం

● ఎవరిని వరించేనో విజయం
● రామగుండంలో రాజకీయ రసకాందాయం
● పార్టీలు మారుతున్న ప్రధాన లీడర్లు
● ఆసక్తిగా పరిశీలిస్తున్న ఓటర్లు

నవతెలంగాణ-కోల్‌సిటీ: రామగుండం నియోజకవర్గంలో రాజీనామాల రాజకీయం కొనసాగుతోంది. ప్రధాన పార్టీలకు చెందిన కీలక నేతలు ఆ పార్టీలకు రాజీనామా చేసి ఇండిపెండెంట్ అభ్యర్థులుగా, వేరే పార్టీల గుర్తుల మీద అసెంబ్లీ బరిలో దిగేందుకు సిద్ధమవుతున్నారు. పార్టీలో అసమ్మతి, టికెట్ ఆశించి బంగపడడం, సైద్ధాంతిక విభేదాలు లాంటి కారణాలతో నాయకులు వారి సొంత పార్టీలకు రాజీనామా చేస్తూ ఇతర పార్టీల బాట పడుతున్నారు. గత కొద్ది రోజులుగా జరుగుతున్న ఈ రాజకీయ పరిణామాలను నియోజకవర్గ ఓటర్లు ఆసక్తిగా పరిశీలిస్తున్నారు.

● కార్మికనాయకుడు కౌశికహరితో మొదలు..

కార్మిక నాయకుడిగా మంచి గుర్తింపు ఉండి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజారాజ్యం పార్టీ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేసి అతి స్వల్ప మెజారిటీతో ఓటమి చెందిన కౌశిక హరితో నియోజకవర్గంలో ఈ రాజీనామాల పర్వం ప్రారంభమైంది. ఇటీవల ఆయన తన భార్య లత, కొడుకుతో కలిసి కేటీఆర్ సమక్షంలో బీజేపీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీజేపీలో ఎమ్మెల్యే టికెట్ ఆశించిన కౌశిక హరి సోమారపు సత్యనారాయణతో పోటీ ఉండడం, వారి మధ్య నెలకొన్న విభేదాల కారణంగా తనకు టికెట్ రాదన్న కోణంలో ఎమ్మెల్యే చందర్‌తో మంతనాలు జరిపి బీఆర్ఎస్‌లో చేరారు.

● సొంత ఇమేజ్‌పై నమ్మకంతో సోమారపు

ఒక టర్మ్ 2014లో ఎమ్మెల్యేగా గెలిచి, 2016లో ఆర్టీసీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ 2018 ఎన్నికల్లో ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థి అయిన కోరుకంటి చందర్‌పై ఓటమి చెందారు. ఏఐఎఫ్‌బీ నుంచి చందర్ బీఆర్ఎస్‌కు మారిన తర్వాత సోమారపు సత్యనారాయణ పలు కారణాలతో అప్పటి బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి 2019లో బీజేపీలో చేరారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతూ సెప్టెంబర్ చివరన బీజేపీకి రాజీనామా చేశారు. సైద్ధాంతిక విభేదాలు, స్వతంత్ర భావజాలం కారణంగా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. పార్టీ ఇమేజ్ కంటే తాను గతంలో కార్మిక నాయకుడిగా, మున్సిపల్ చైర్మన్, ఎమ్మెల్యేగా పనిచేసి సంపాదించుకున్న ఇమేజ్ మీదే ఎక్కువ నమ్మకం ఉండడం, అధికారంలో ఉన్నప్పుడు తాను చేపట్టిన అభివృద్ధి పనులే తనను గెలిపిస్తాయన్న ఆశాభావం, బీజేపీలో ఉంటే కొన్ని వర్గాల ప్రజలకు దూరమయ్యే ప్రమాదం ఉందన్న భావనతో ఆయన రాజీనామా చేశాడు.


రాజీనామా పత్రాన్ని చూపిస్తున్న సంధ్యారాణి

● మహిళా రిజర్వేషన్ వస్తుందని ఆశించి..

పాలకుర్తి జడ్పీటీసీ, మహిళా నాయకురాలిగా బీఆర్ఎస్ పార్టీలో సేవలందించిన కందుల సంధ్యారాణి సైతం మంగళవారం ఆ పార్టీకి రాజీనామా చేయడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యే చందర్‌తో తలెత్తిన విబేధాల కారణంగా బీఆర్ఎస్‌లో అసమ్మతి ప్రకటించిన ఐదుగురు నేతల్లో ఈమె ఒకరు. పార్టీ ఈసారి చందర్‌కు టికెట్ కేటాయించవద్దు అని నిరసన గళం వినిపించగా వీరి పంచాయితీ చివరకు పార్టీ అధిష్టానం వరకు చేరింది. మహిళా రిజర్వేషన్ బిల్లుతో తనకు ఎమ్మెల్యే టికెట్ వస్తుందని ఆశించింది. ఎట్టకేలకు ఆ బిల్లు అమలు ఇప్పట్లో లేకపోవడంతో ఆమె నిరాశకు గురైంది. దీంతో ఆమె బీఆర్ ఎస్‌కు రాజీనామా చేసి ఇండిపెండెంట్ అభ్యర్థిగా అసెంబ్లీ ఎన్నిక బరిలో ఉంటానని ప్రకటించింది.

● ఎవరికి లబ్ధి చేకూరుతోందో..

రామగుండం ప్రాంతంలో ఓటర్లు విలక్షణ సరళి కలిగి ఉండడం, ఎన్నికల తాయిళాలు, ప్రలోభాల ప్రభావం ఇక్కడి ఓటర్లపై తక్కువగా ఉండడం, తాము గెలిపించాలనుకున్న నాయకుడిని అత్యంత సులువుగా గెలిపించడం ఇక్కడి ఓటర్ల ప్రత్యేకత. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్, బీఆర్ఎస్ నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే కొరుకంటి చందర్ ఎన్నికల ప్రచారం కొనసాగిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ రెండు మూడు రోజుల్లో అభ్యర్థులను ఖరారు చేయనుంది.


రాజీనామా పత్రాన్ని చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ (ఫైల్)

● సింహం, ఏనుగు గుర్తుల ప్రభావం..

గతంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ పార్టీ చిహ్నం అయిన సింహం గుర్తు మీద పోటీ చేసిన నాయకులు ఎమ్మెల్యేగా గెలవడంతో ఆ గుర్తు ప్రభావం చూపనున్నట్లు చర్చ జరుగుతోంది. దీనికి తోడు బీసీ నాయకత్వం ఎజెండాగా వస్తున్న బీఎస్పీ పార్టీ కూడా ఈ ఎన్నికల్లో ప్రభావం చూపనుంది.

● జనసేనాని బలం ఎంత..

తెలంగాణాలోని 33 స్థానాల నుంచి పోటీ చేయనున్నట్లు ఇప్పటికే జనసేనా ప్రకటించగా వాటిలో ఉమ్మడి కరీంనగర్ నుంచి 4 స్థానాలు ఉన్నాయి. వాటిలో జగిత్యాల, హుస్నాబాద్, మంథనితో పాటు రామగుండం కూడా ఒకటి. యువ ఓటర్లు ఎక్కువ సంఖ్యలో ఉన్న గోదావరిఖని, రామగుండం ప్రాంతంలో పవన్‌కళ్యాన్ మీద ఉన్న అభిమానంతో కూడా యువ ఓటర్లు అటు వైపు మొగ్గు చూపితే మరికొన్ని ఓట్లు చీలిపోయే ప్రమాదం ఉంది. ఇన్ని చీలికల మధ్య గెలుపు ఎవరిని వరించునని నియోజకవర్గ ఓటర్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

రాజకీయ పార్టీ నేతలతో ఆర్డీవో సమావేశం


సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీవో

నవతెలంగాణ-మంథని: నియోజకవర్గ స్థాయి రాజకీయ పార్టీ నేతలతో బుధవారం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో హనుమ నాయక్ మాట్లాడుతూ బుధవారం మంథని నియోజకవర్గంలోని (288)పోలింగ్ కేంద్రాలలో ప్రతీ బీఎల్వో ద్వారా ఓటర్ల జాబితాను పబ్లికేషన్ చేసినట్లు తెలిపారు. మంథని నియోజకవర్గములో మొత్తం ఓటర్లు 2,30,306 ఉండగా, ఇందులో మహిళలు 1,16,458, పురుషులు 1,13,828, ట్రాన్స్ జెండర్లు 20 మంది ఓటర్లుగా నమోదు అయినట్లుగా తెలిపారు. ఎన్నికల నిర్వహణకు రాజకీయ నేతలు సహకరించాలని, ఏమైనా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీఎస్పీ నాయకులు, 10 మండలాల తహసీల్దార్లు, ఎలక్షన్ సిబ్బంది, పాల్గొన్నారు.

చెత్త డంపు యార్డును తరలించాలి

● సీపీఐ నగర కార్యదర్శి కే.కనక రాజ్


డంపింగ్ యార్డ్‌ను సందర్శిస్తున్న నాయకులు

నవతెలంగాణ-గోదావరిఖని: రామగుండం కార్పొరేషన్‌ను వందల కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న నాయకులు చెత్త డంప్ యార్డ్‌ను ఎందుకు ఏర్పాటు చేయడం లేదని సీపీఐ నగర కార్యదర్శి కే కనకరాజు ప్రశ్నించారు. బుధవారం గోదావరిఖని గంగానగర్ గోదావరి సమీపంలో ఉన్న డంప్ యార్డ్‌ను సీపీఐ నాయకుల బృందం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర గోదావరిని కలుషితం చేసే విధంగా గోదావరి నది పక్కన డంపు యార్డును ఏర్పాటు చేయడం సరైన విధానం కాదన్నారు. రామగుండం కార్పొరేషన్ పరిధిలో ఉన్న ఇళ్లలోని చెత్తనంత గోదావరి నది ఒడ్డుకు తరలించి డంపింగ్ చేయడం వల్ల శ్మశాన వాటికకు వచ్చే ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు వెంటనే స్పందించి చెత్త డంప్ యార్డ్ సుదూర ప్రాంతాలకు తరలించి ప్రజల ఇబ్బందులను నివారించాలని, లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో పలు ఆందోళన కార్యక్రమాలను చేపడతామని ఆయన హెచ్చరించారు.చెత్త డంప్ యార్డ్ ను పరిశీలించిన వారిలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి తాళ్ళ పెల్లి మల్లయ్య, కార్యవర్గ సభ్యులు శనిగరపు చంద్రశేఖర్, మార్క్యాపురి సూర్య,రేనికుంట్ల ప్రీతమ్, ఏఐవైఎఫ్ నాయకులు ఆసాల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి యువకుడి మృతి

నవతెలంగాణ-మంథని: మంథని పట్టణంలోని బన్న చెరువులోకి ఈతకు వెళ్లిన ఆకుల భవాని శంకర్(22) ప్రమాదావశాత్తు చెరువులో మునిగి మంగళవారం మృత్యువాత పడ్డాడు. మృతుడు మంథని మండంలంలోని బోయినిపేట గ్రామం. బుధవారం గల్లంతైన మృతదేహాన్ని వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం మంథని ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యులను జడ్పీ చైర్మన్ పుట్ట మధు పరామర్శించారు.

అర్హులైన వారికి 'దళిత బంధు, గృహలక్ష్మి' ఇవ్వాలి

● కాకర్లపల్లి గ్రామలో దళితుల నిరసన


కాకర్లపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న దళితులు

నవతెలంగాణ-మంథని: మండలంలో కాకర్లపల్లి గ్రామానికి చెందిన అర్హులైన దళితులకు ప్రభుత్వ పథకాలను అందించాలని కోరుతూ బుధవారం నిరసన వ్యక్తం చేశారు. అర్హులైన దళిత బంధు, గృహలక్ష్మి ఇవ్వాలని దళిత వాడలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మంథని వెంకటి, గట్టయ్య, శంకర్, మంథని సాగర్, మంథని సమ్మయ్య, బూడిద శంకర్, బోసెల్లి మౌనిక, రాజమ్మ, శంకరమ్మ, హేమలత పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న జడ్పీ చైర్మన్ మధు

నవతెలంగాణ-రామగిరి: మండలంలోని రత్నాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మంగళవారం రాత్రి బీఆర్ఎస్‌లో చేరారు. సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు, బీఆర్ఎస్ అధ్యక్షుడు బాద్రపు ప్రశాంత్ రావు, ఎంపీటీసీ ధర్ముల రాజసంపత్, ఉపసర్పంచ్ దుబ్బాక సత్యరెడ్డి అధ్వర్యంలో వీరంతా బీఆర్ఎస్‌లో చేరారు. జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రైతు నాయకులు బాద్రపు కృష్ణ మూర్తి, కండె భూమేష్, బెజ్జాల సుందర్, కండె రాజేందర్, అంగూరి హరీష్, పంజా శివ, డాంక రాజ్ కుమార్, డాంక సదిమ్, మద్దెల జగదీష్, మేకల కవిత, దాసరి రవి, సల్వాల కోమలత చేరారు.

జిల్లాలో బతుకమ్మ చీరలు పంపిణీ


రామగిరి: చీరలను పంపిణీ చేస్తున్న పుట్ట మధు


జూలపల్లి: చీరలను పంపిణీ చేస్తున్న నాయకులు


మంథని: చీరలను పంపిణీ చేస్తున్న పుట్ట శైలజ

నవతెలంగాణ-రామగిరి: మండలంలోని పన్నూరు గ్రామంలోని సాయిరాం గార్డెన్‌లో కేసీఆర్ బతుకమ్మ చీరలను బుధవారం జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ పంపిణీ చేశారు. బుధవారం పేటలో ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్ చీరలు పంపిణీ చేశారు గ్రామాలలో సర్పంచులు కార్యదర్శులు, జడ్పీటీసీ మాదరబి శారదకుమార్ యాదవ్ చీరలు మహిళలకు అందజేశారు.

నవతెలంగాణ-జూలపల్లి: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ప్రాంగణంలో బుధవారం మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి రాంగోపాల్ రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, జూలపల్లి సర్పంచ్ ధారబోయిన నరసింహయాదవ్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు దండే వెంకటేశం, పల్లె ప్రసాద్, ఎంపీడీవో వేణుగోపాలరావు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మంథని: మంథని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో బతుకమ్మ చీరలను మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, వార్డు కౌన్సిలర్లు గుండా విజయ లక్ష్మి-పాపారావు, శ్రీపతి బానయ్య, వీకే రవి, వేముల లక్ష్మి-సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్ సతీష్ పాల్గొన్నారు.

నవ తెలంగాణ-సుల్తానాబాద్ రూరల్: మండలంలోని గొల్లపల్లి సర్పంచ్ బండారి రమేష్ గర్రెపల్లి సర్పంచ్ వీరగోని సుజాత రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గొల్లపల్లి సర్పంచ్ బండారి రమేష్ వీరగోని సుజాత రమేష్ గౌడ్ మాట్లాడుతూ కేసీఆర్ బతుకమ్మ కానుకగా చీరలు అందించి పేదింటి ఆడపడుచులకు పెద్దన్నగా మారారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు గట్టు శ్రీనివాస్, పులి అనూష, ఉప సర్పంచ్ కొత్తూరి సంపత్, మధు, కార్యదర్శి ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

నవతెలంగాణ ఓదెల: మండలంలోని పిట్టల ఎల్లయ్యపల్లె గ్రామంలో బుధవారం సర్పంచ్ పిట్టల సరిత-రవికుమార్ బతుకమ్మ చీరల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఆర్ చంద్రశేఖర్, వార్డుసభ్యులు యాదగిరి స్వామి, కందుల రమేష్, వెంకటేష్, కనుకయ్య, రాజు, లింగయ్య పాల్గొన్నారు.

నవతెలంగాణ-ముత్తారం: ముత్తారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం బతుకమ్మ చీరలను పంపణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ జక్కుల ముత్తయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వచ్చిన చీరలను మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కలికోట శ్రీనివాస్, వైస్ ఎంపీపీ సుదాటి రవీందర్‌రావు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు నూనె కుమార్, ఎంపీవో బైరి వేణుమాధవ్, సర్పంచ్‌లు మేడగోని సతీష్, ఎర్రం శారదా సదానందం తదితరులున్నారు.


సుల్తానాబాద్ రూరల్: చీరలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ రమేష్


ఓదెల: చీరలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ సరిత-రవికుమార్


ముత్తారం: చీరలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ రవీందర్‌రావు

గులాబీమయమైన 'సుద్దాల'


గజమాలతో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-సుల్తానాబాద్ రూరల్: మండలంలోని సుద్దాలలో బుధవారం గ్రామదర్శిని కార్యక్రమంలో మహిళలు, బీఆర్ఎస్ నాయకులతో సుద్దాల గ్రామం గులాబీమయమైంది. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకాగా రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు కాసర్ల అనంతరెడ్డి, సర్పంచ్ కాసర్ల అంజలి ఆధ్వర్యంలో దాసరి మనోహర్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. బుధవారం గ్రామదర్శని కార్యక్రమంలో భాగంగా సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల, రెబ్బల్ దేవ్‌పల్లి, చిన్నబొంకుర్, సుద్దాల గ్రామాలలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు హాజరై మంగళ హారతులతో కోలాటం నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. బీఆర్ఎస్ శ్రేణులు దాసరి మనోహర్‌రెడ్డిని గజమాలతో సన్మానించారు. గడప గడపకు ఇంటింటికీ తిరుగుతూ తిరిగి రానున్న ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌ను ముఖ్యమంత్రి చేయాలని తనను మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని దాసరి మనోహర్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాలాజీ రావు, మండల పార్టీ అధ్యక్షులు పురం ప్రేమ్ చందర్‌రావు, ఉప సర్పంచ్ రాజు, జాగృతి మండల అధ్యక్షులు ఐలయ్య యాదవ్,మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర మౌనిక శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ చైర్పర్సన్ ముత్యం సునీత రమేష్‌గౌడ్, వివరంనేని శ్రీనివాసరావు,ఒజ్జ శ్రీనివాస్, సంపత్, గరిగంటి కుమార్ బాబు, కాందూరి వాసు, ఎంపీటీసీలు గట్టు శ్రీనివాస్,నిర్మల ఓదెలు, చంద్రమౌళి, లంకదాస రవీందర్, రాజ్‌కుమార్, మహిళలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్యారెంటీ పథకాలపై ప్రచారం


కాంగ్రెస్ గ్యారెంటీలపై వేర్వేరుగా ప్రచారం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-గోదావరిఖని: రామగుండం పట్టణంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆదేశాల మేరకు సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ ఇసంపెల్లి అంజుల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ గ్యారెంటీ పథకాలపై బుధవారం నాయకుల ప్రచారం చేపట్టారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని, రామగుండంలో ఒక్కసారి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌కు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఫిషరీష్ చైర్మన్ పల్లికొండ రాజేష్, యువజన విభాగం నాయకులు ప్రేమ్ కుమార్, మండల ఆర్గనైజింగ్ కమిటీ మెంబర్ మేడి ఓదెలు, రామగుండం టౌన్ యూత్ ఉపాధ్యక్షులు పల్లికొండ సంతోష్, శ్రీకాంత్, శివ, సురేష్,రమేష్, కాల్ల నర్సింగ్, చింటూ, ధర్మాజీ శంకర్, పల్లికొండ మల్లయ్య తదితరులున్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీల వివరాలకు సంబంధించిన పోస్టర్‌ను 20వ డివిజన్లోని జీరో పాయింట్ ఏరియాలో ప్రతి ఇల్లు ఇల్లు తిరుగుతూ అంటిస్తూ వాటికి సంబంధించిన వివరాలను ప్రజలకు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో 20వ డివిజన్ అధ్యక్షులు సిరిసెట్టి సతీష్ గౌడ్, 20, 21 డివిజన్ క్లస్టర్ ఇంచార్జ్ ఎండి మొహమ్మద్, రామగుండం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈదునూరి హరిప్రసాద్, మైనార్టీ సెల్ నాయకులు ఎండీ గౌస్ బాబా, ప్రశాంత్ ఠాకూర్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అప్పాసి శ్రీనివాస్, తాజ్ భాయ్, సింగం కిరణ్ గౌడ్, ఇబ్రహీం, జబ్బార్, 20, 21.సోషల్ మీడియా ఇంచార్జి యూసుఫ్ ఖాన్, ఎండి.ఇమ్రాన్, దస్తగిరి, ముస్తాకు అహ్మద్, అంజద్ అలీ, నామాల కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అస్వస్థతకు గురైన జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్

● చాతిలో నొప్పి రావడంతో ఆస్పత్రికి తరలింపు


చికిత్సపొందుతున్న మధుకర్

నవతెలంగాణ-రామగిరి: నియోజకవర్గ ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, కాంగ్రెస్ కుట్రలు, కుతంత్రాలతో పాటు అబద్దాలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు అవగాహన కల్పించేలా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్ చేపట్టిన ప్రజా ఆశీర్వాద పాదయాత్రలో పలుమార్లు ఆయన అస్వస్థతకు గురైనా యాత్రను ముందుకు నడిపిస్తున్నారు. ముత్తారంలో గత నెల25న పాదయాత్రను ప్రారంభించగా, మల్హర్, కాటారం, మహాముత్తారం, మహదేవ్‌పూర్ మండలాల మీదుగా సుమారు 250కిలో మీటర్ల పైచిలుకు పాదయాత్రను చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం రామగిరి మండలంలోని బేగంపేట వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ బుధవారం అస్వస్థతకు గురయ్యారు. పుట్ట మధుకర్‌కు మళ్లీ చేతిలో నొప్పి రావడంతో ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఉపశమనం కావడంతో పుట్ట మధుకర్ మళ్లీ యాత్రను కొన సాగించారు.

ప్రమాదవశాత్తు కింద పడి ఒకరి మృతి

నవతెలంగాణ-మంథని: మంథని పట్టణంలోని భవన నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు చిప్ప శేఖర్(52) గోవా కర్ర పైనుండి జారిపడి మృతి చెందాడు. మృతుడిది మంథని మండలం నాగారం గ్రామానికి చెందిన శేఖర్ భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మృతుడి భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు మంథని ఎస్సై కిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మేరు కులస్తుల రౌండ్ టేబుల్ సమావేశం

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్: స్థానిక లక్ష్మీనగర్‌లో మేరు సంఘం అధ్యక్షుడు కీర్తి నాగరాజు ఆధ్వర్యంలో ఈనెల 6న శుక్రవారం మేరు కులస్తుల మేరుభవన్ ప్రారంభోత్సవ సందర్భంగా బుధవారం మేరు కులస్తులు రౌండ్ టేబుల్ సమావేశం బుధవారం జరిగింది. ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ చేతుల మీదుగా భవనం ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేరు సంఘం నాయకులు ముప్పిడి సత్యప్రసాద్, ఓదెల సర్వేష్, కే పిఆర్ స్వామి, మామిడి శెట్టి వెంకటేశ్వర్లు, వినయ్ అధిక సంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.

జ్యోతిబాపూలే జాతీయ అవార్డుకు శంకర్ ఎంపిక


ఎంపిక పత్రాన్ని అందజేస్తున్న రాధాక్రిష్ణ

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్: సామాజిక వేత్త, పద్మశాలి సేవా సంఘం ప్రధాన కార్యదర్శి ఆడెపు శంకర్ మహాత్మా జ్యోతిబా పూలే జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. బహుజన సాహిత్య అకాడమీ ప్రతి సంవత్సరం సామాజిక వేత్తలకు, సంఘ సేవకులకు జాతీయ స్థాయిలో ఇచ్చే అవార్డుకు సామాజిక వేత్త పద్మశాలి సేవా సంఘం ప్రధాన కార్యదర్శి ఆడెపు శంకర్‌ని బహుజన సాహిత్య అకాడమీ సెలెక్షన్ కమిటీ ఎంపిక చేసింది. మేరకు హైదరాబాద్‌లోని కార్యాలయంలో బీఎస్‌పీ జాతీయ అధ్యక్షుడు రాధాకష్ణ చేతుల మీదుగా ఆహ్వాన పత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ నెల 15వ తేదిన ఢిల్లీలో జరిగే బహుజన రైటర్స్ నేషనల్ కాన్ఫరెన్స్‌లో అతిథుల చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఎం.గౌతం, రాష్ట్ర కార్యదర్శి కనుకుంట్ల విజయ్ కుమార్, అవార్డు సెలెక్షన్ కమిటీ సభ్యులు రాజలింగం తదితరులున్నారు.

సకాలంలో సీఎంఆర్ రైస్ డెలివరీ పూర్తి చేయాలి

● అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్



నవతెలంగాణ-పెద్దపల్లి: సకాలంలో సీఎంఆర్ రైస్ డెలివరీ పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్ అన్నారు. బుధవారం స్థానిక సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్‌లో అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్ సీఎంఆర్ రైస్ డెలివరీపై సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్షించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైస్ మిల్లర్లు సకాలంలో ఖరీఫ్ 2022-23న సంబంధించి సీఎంఆర్ గడువులోగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో జిల్లా మేనేజర్ సివిల్ సప్లై శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి ప్రేమ్ కుమార్, మిల్లర్లు తిరుపతిరెడ్డి, అశోక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పోరాడి విజయం సాధించిన అంగన్వాడీ ఉద్యోగులు

● అంగన్వాడీ టీచర్స్ అండ్ వెల్ఫేర్ యూనియన్ జిల్లా కార్యదర్శి జ్యోతి

నవతెలంగాణ-పెద్దపల్లి: 24 రోజులుగా తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న అంగన్వాడీ ఉద్యోగుల సమ్మె విజయవంతం అయిందని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ వెల్ఫేర్ యూనియన్ జిల్లా కార్యదర్శి జ్యోతి తెలిపారు. బుధవారం చేపట్టిన చలో హైదరాబాద్ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి శ్రీ హరీష్‌రావు స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి శ్రీమతి సత్యవతి రాథోడ్ సమక్షంలో సీఐటీయూ అనుబంధ అంగన్వాడీ నాయకత్వంతో జరిగిన చర్చలు సఫలం అయ్యాయి. అంగన్వాడీ ఉద్యోగులు 24 రోజులు ఐక్యంగా అనేక నిర్బంధాలు ఆటంకాలు ఎదుర్కొని పోరాడిన ఫలితంగానే ఈ విజయం సాధ్యమైంది అన్నారు. అంగన్వాడీ ఉద్యోగులకు పేస్కేల్ మరియు పర్మినెంట్ తదితర సమస్యల పరిష్కారానికి భవిష్యత్తులో మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

తుది ఓటర్ జాబితా విడుదల: కలెక్టర్

నవతెలంగాణ- పెద్దపల్లి: జిల్లాలో తుది ఓటర్ల జాబితా విడుదల చేశామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో మంథని, రామగుండం, పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో తుది ఓటరు జాబితా విడుదల చేశామని, జిల్లా వ్యాప్తంగా 3 లక్షల 45 వేల 829 మంది పురుషులు, 3 లక్షల 48 వేల 729 మంది మహిళలు, 54 ఇతర జెండర్, మొత్తం 6 లక్షల 94 వేల 612 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు.

పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు శ్రీనాథ్

నవతెలంగాణ-గోదావరిఖని: సింగరేణి బదిలీ వర్కర్ల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సింగరేణి బదిలీ వర్కర్స్ అండ్ మజ్దూర్స్ ఫోరం అధ్యక్షుడు కొప్పుల శ్రీనాథ్ యాజమాన్యంకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఫోరం ఆధ్వర్యంలో గోదావరిఖని అడ్డగుంటపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం సింగరేణిలో బదిలీ వర్కర్స్‌కి మజ్దూర్స్ ప్రమోషన్స్ కల్పించినందుకు యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు. సింగరేణిలో పని చేసే జనరల్ మద్దూర్స్‌న్న మల్టీ జాబ్ వర్కర్స్‌గా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో గంగుల సతీష్, నక్క మల్లికార్జున్, కొప్పుల శ్రీనివాస్, వాంకు డోత్ మోహన్, మంత్రి రవీందర్, కుమారస్వామి, ఓంకార్, పెండ్యాల శ్రీనివాస్, అక్బర్, క్రాంతి, అరుణ్ కుమార్, కొల్లూరి సతీష్ తదితరులున్నారు.

రామగుండం కార్పొరేషన్ పేరు మార్చే ఆలోచన విరమించుకోవాలి

నవతెలంగాణ-గోదావరిఖని: రామగుండం కార్పొరేషన్ పేరు మార్చే ఆలోచన విరమించుకావాలని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్ డిమాండ్ చేశారు. రామగుండం నగర పేరును మార్చాలని రామగుండం నగర పాలక సంస్థ కౌన్సిల్‌లో నేడు జరిగే సమావేశంలో తీర్మానం కోసం ఒక అంశాన్ని ప్రవేశ పెట్టడాన్ని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ తరుపున ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజాభిప్రాయ సేకరణ జరపకుండా, అఖిల పక్షం సమావేశం ఏర్పాటు చేసి చర్చ జరపకుండా కేవలం ఇద్దరు ముగ్గురు వ్యక్తుల ఒత్తిడితో మూడు లక్షల జనాభా కలిగిన రామగుండం నగర పాలక సంస్థ పేరును మార్చాలని నిర్ణయం తీసుకోవడం దారుణంగా ఉందని భావిస్తున్నామన్నారు.

నేడు ప్రజా ఆశీర్వాద యాత్ర ముగింపు సభ

నవతెలంగాణ-ముత్తారం: పెద్దపల్లి జడ్పీ చైర్మన్, మంథని నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధూకర్ మంథని నియోజక వర్గంలో చేపట్టిన ప్రజా ఆశీర్వాద యాత్ర ముగింపు సభ మంథనిలో నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ ముత్తారం మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్‌రెడ్డి తెలిపారు. మంథని మండల కేంద్రంలో గురువారం సాయంత్రం 4గంటలకు సభ ఉంటుందన్నారు.

ఆశా కార్యకర్తల భిక్షాటన



నవతెలంగాణ - కరీంనగర్

ఆశా కార్యకర్తలకు ఫిక్స్ వేతనం రూ.18వేలు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ నిరవధిక సమ్మె చేస్తున్న ఆశా వర్కర్లు బుధవారం జిల్లా కేంద్రంలో బిక్షాటన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మరెళ్ల శ్రీలత మాట్లాడుతూ.. కనీస వేతనం నిర్ణయం చేయాలని 10రోజులుగా సమ్మె చేస్తుంటే నిర్లక్ష్యం వహిస్తున్నారని, ప్రజల మద్దతు కోసం భిక్షాటన కార్యక్రమం చేశామన్నారు. శాంతియుత సమ్మె చేస్తున్నామని, ప్రభుత్వం వెంటనే చర్చలకు పిలిచి ఫిక్స్ వేతనం రూ.18వేలు నిర్ణయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారెళ్ల శ్రీలత, జిల్లా కోశాధికారి విజయలక్ష్మి, నాయకులు రజియా, మంజుల, పద్మ, శోభ, విజయ లక్ష్మి, లలిత, లక్ష్మి, శైలజ, శ్యామల, పద్మ, శోభ, శంకరమ్మ, లత పాల్గొన్నారు.

కార్మిక కర్షక మైత్రి చిరకాలం...

సీఐటీయూ, రైతు సంఘం నాయకులు

నవతెలంగాణ - కరీంనగర్



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

కార్మిక కర్షక మైత్రి చిరకాలం నిలుస్తుందని సీఐటీయూ, రైతు సంఘం నాయకులు అన్నారు. బుధవారం నగరంలోని స్థానిక ముకుందలాల్ మిశ్రా భవన్‌లో ఆశా కార్యకర్తల సమావేశం యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మరెళ్ల శ్రీలత అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో సీఐటీయూ, రైతు సంఘం నాయకులు హాజరై ప్రసంగించారు.కార్మిక కర్షక మైత్రి చిరకాలం నిలుస్తుందని, ఆ దిశలో రైతు చట్టాల రద్దు పోరాటం విజయం సాధించిన చరిత్ర కళ్ల ముందు ఉందని, మీ పోరాటంలో చివరి వరకు ఉంటామని ఆశ కార్యకర్తలకి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వాసుదేవ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వర్ణ వెంకట్ రెడ్డి లు మాట్లాడుతూ ..అనేక కార్మిక ఉద్యోగ సమ్మెలకి, పోరాటంలో రైతు సంఘం మద్ధతు సంపూర్ణ మద్ధతు ఇవ్వడం జరిగిందన్నారు. ఆశా కార్యకర్తల సమ్మె న్యాయమైందని, చట్టబద్ధమైందని, పోరాటాలకు ఫలితాలు ఉంటాయని తెలిపారు. పాలకులకు చిత్తశుద్ధి ఉంటే పరిష్కారం చేయాలి కానీ ఉద్యమాలను అణిచి వేసేందుకు కుట్రలు చేస్తే వాళ్లే పరార్ అవుతారని తెలిపారు. ఆశా కార్యకర్తల సమ్మె డిమాండ్స్ పరిష్కారం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గుడికందుల సత్యం మాట్లాడుతూ.. పారితోషికం అనేది రద్దు చేసి ఫిక్స్ వేతనం రూ.18వేలు ఇచ్చే వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. డిమాండ్స్ పరిష్కారం చేస్తే మీకే సానుకూల వాతావరణం ఉంటుంది. లేకపోతే వారి శక్తి సామర్థ్యాలను కూడగట్టుకొని ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తారని హెచ్చరించారు. జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమం విజయవంతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు విజయలక్ష్మి, శంకరమ్మ, లలిత్, సదాలక్ష్మి, శోభ, పద్మ, లక్ష్మి, స్వప్న, స్వరూప, సరోజన, అనిత, రజియా, మంజుల, మంగ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్పీఎస్సీ రద్దుకు పోస్ట్‌కార్డు ఉద్యమం

నవతెలంగాణ - కరీంనగర్ : టీఎస్పీఎస్సీ నిర్వహిస్తున్న వివిధ పోటీ పరీక్షల రూపుమాపాలని కోరుతూ బుధవారం నిరుద్యోగులు పెద్దఎత్తున పోస్ట్‌కార్డ్ ఉద్యమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎగ్జామ్స్ లీకేజీ రకాలుగా ప్రశ్నలు తప్పులు పట్ల నిరసన వ్యక్తం చేస్తూ ఉద్యమం చేపట్టారు. టీఎస్పీఎస్సీని తక్షణమే రద్దు చేసి ప్రక్షాళనలో భాగంగా కొత్త టీఎస్పీఎస్సీ కొత్త సభ్యులను ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించాలని కోరుతూ చేపట్టిన ఈ పోస్ట్ కార్డు ఉద్యమాన్ని విజయవంతం చేయాలని, రాష్ట్రంలోని నిరుద్యోగులంతా ఈ ఉద్యమంలో పాల్గొని రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని నగరంలోని ప్రయివేటు హాస్టళ్లలో ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు, నిరుద్యోగులు తమ నిరసనను తెలియజేశారు.

బతుకమ్మ ఆడి మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన



నవతెలంగాణ - శంకరపట్నం : శంకరపట్నం మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె 15వ రోజు కొనసాగింది. బుధవారం బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు. వారికి ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి పిట్టల సమ్మయ్య మద్దతు తెలిపి మాట్లాడారు. అసెంబ్లీలో ప్రకటించిన 3000 రూపాయలు బిల్లులను వెంటనే అమలు చేయాలని, బిల్లులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొండ రజిత, మండల ఉపాధ్యక్షురాలు కత్తెరమల్ల పద్మ, హలీమా, రజిత పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ - రామడుగు



మండలంలోని దేశరాజుపల్లి గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన గజ్జెల రవి కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సతీమణి సుంకే దీవెన బుధవారం గజ్జెల రవిని పరామర్శించి 5000 రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ప్రమాదం జరిగినప్పుడు ఎమ్మెల్యే రెండు లక్షల రూపాయల ఎల్వోసీని అందజేసినట్లు ఎంపీటీసీ వంచ మహేందర్‌రెడ్డి తెలిపాడు. వారి వెంట రుద్రారం ఎంపీటీసీ గుర్రం దేవిక, నాయకులు ఎలుకపల్లి లచ్చయ్య, దొబ్బల మధు, గ్రామ అధ్యక్షుడు పెగడ శ్రీనివాస్, తదితరులున్నారు.

సబ్సిడీ చెక్కు అందజేత



నవతెలంగాణ - కొత్తపల్లి : కొత్తపల్లి పట్టణంలోని చిగుళ్ల నాగరాజు వృత్తిరీత్యా మీసేవ నడుపుకుంటూ జీవనం నడిపిస్తున్నాడు. అంగవైకల్యం గల వ్యక్తులకు ఎకనామిక్ రిహాబిలిటేషియన్ స్కీం కింద 100 శాతం సబ్సిడీతో కంప్యూటర్, ప్రింటర్ తీసుకోవడం కోసం రూ.50,000 చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉమా రాణి సహకారంతో సబ్సిడీ చెక్కును చైర్మెన్ రుద్రరాజు, వేముల కవిత చంద్రశేఖర్ చేతుల మీదుగా బుధవారం అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ వేణుమాధవ్, కౌన్సిలర్ వాసాల రమేష్, చింతల సత్యనారాయణ రెడ్డి, నాయకులు స్వర్గం నరసయ్య, గున్నల రమేష్, సుంకె సత్యం తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరలు పంపిణీ

నవతెలంగాణ - కొత్తపల్లి :



కొత్తపల్లి మున్సిపల్ పట్టణంలో మహిళలకు మున్సిపల్ చైర్మెన్ రుద్రరాజు బతుకమ్మ చీరలు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ వేణుమాధవ్, కౌన్సిలర్లు వాసాల రమేష్, గన్నల విజయ రమేష్, గండు రాంబాబు, చింతల సత్యనారాయణ రెడ్డి, వేముల కవితా శేఖర్, కో ఆప్షన్ మెంబర్స్ ఎండీ పక్రుద్దిన్, శెట్టిపల్లి ప్రభాకర్, ఎస్కే శాహనాజ్ మునవర్ ఖాన్, బీఆర్ఎస్ నాయకులు ఎస్కే బాబా, స్వర్గము నర్సయ్య, మెప్మా అధికారి మల్లీశ్వరి, ఆర్పీ ఎల్‌యూ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

నవతెలంగాణ - జమ్మికుంట : జమ్మికుంట మండలంలోని తనుగుల గ్రామానికి చెందిన దొనికల దేవరాజ్ రాజేశం(36) మంగళవారం సాయంత్రం తాటిచెట్టు ఎక్కుతుండగా కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. జమ్మికుంటలోని ఆస్పత్రికి తీసుకువెళ్లగా చేయి విరిగినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని ఆ గ్రామ మాజీ సర్పంచ్, గౌడ సంఘం నాయకుడు గట్టు రాంచందర్ గౌడ్ కోరారు.

ఎన్నికలప్పుడే కనిపించే నాయకుల పట్ల జాగ్రత్త..!

మంత్రి గంగుల కమలాకర్

నవతెలంగాణ - కరీంనగర్



ఇస్త్రీ చేస్తున్న మంత్రి గంగుల కమలాకర్



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

ఎన్నికలప్పుడే కనిపించే బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఆ తర్వాత కనిపించకుండా పోతారని, కనిపించకుండా పోయే నాయకులు కావాలా? నిత్యం ప్రజల్లో ఉండి అభివృద్ధి చేసే నాయకులు కావాలా? ఆలోచించుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. నగరంలో రూ.133 కోట్ల సీఎం హామీ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మేయర్ సునీల్ రావుతో కలిసి మంత్రి గంగుల కమలాకర్ బుధవారం శంకుస్థాపన చేశారు. 20వ డివిజన్‌లో పర్యటించిన మంత్రి గంగుల ఇక్కడ రూ.4కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రయినేజీ, పైప్‌లైన్ పనులకు స్థానిక కార్పోరేటర్ తుల రాజేశ్వరీ-బాలయ్యతో కలిసి శంకుస్థాపన చేశారు. అక్కడే నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ షాపుతో పాటు బస్తీ దవాఖానాను ప్రారంభించారు. ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. 56వ డివిజన్ చేరుకున్న మంత్రి గంగుల, స్థానిక కార్పొరేటర్ వంగపల్లి రాజేందర్ రావుతో కలిసి 2 కోట్ల 60 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రయినేజీ, పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. 34వ డివిజన్ గోదాంగడ్డకు చేరుకొని, 34, 35వ డివిజన్లలో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రయినేజీ, పైప్‌లైన్ పనులకు స్థానిక కార్పోరేటర్లు షకీర అంజుమ్-బర్కత్ ఆలీ, చాడగొండ బుచ్చిరెడ్డిలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ఆరేపల్లి గ్రామం మున్సిపాలిటీలో విలీనమైన తర్వాత అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. ఆరేపల్లి అభివృద్ధి కోసం ఎన్ని కోట్లు అయినా వెచ్చించేందుకు నేను సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

బీజేపీ, కాంగ్రెస్ లకు అధికారం కట్టబెడితే ఇక్కడి బొగ్గు, నీరు, కరెంటు హైదరాబాద్ సంపదను దోచుకుంటారని, మళ్లీ ఆ తప్పు జరగొద్దన్నారు.కాంగ్రెస్ టికెట్ కావాలని దొంగలు, రౌడీలు దరఖాస్తు చేసుకున్నారని, వారిపై రౌడీ షీట్‌తో పాటు 50కి పైగా కేసులు ఉన్నాయన్నారు. వారి మాటలు నమ్మి గెలిపిస్తే మన భూములను కబ్జా చేస్తారనే ఆందోళన వ్యక్తం చేశారు. స్వరాష్ట్రంలో మత ఘర్షణలు లేక శాంతిభద్రతలు భేషుగ్గా ఉన్నాయని, ఈ అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే మరోసారి సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

యాంత్రీకృత దోభీఘాట్ ప్రారంభం

స్వయం పాలనలో కులవృత్తులకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. బుధవారం కరీంనగర్ 34వ డివిజన్ గోదాంగడ్డలో రూ.2కోట్లతో నూతనంగా ఏర్పాటు చేసిన యాంత్రికృత దోభీఘాట్‌ను మంత్రి గంగుల కమలాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..నాయి బ్రాహ్మణులకు, రజకులకు 250 యూనిట్ల విద్యుత్ అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ ఆధునిక దోబీ ఘాట్లలో గంటకు 240బట్టలు, రోజుకు 2500బట్టలు ఉతికే అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని రజకులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల వేళ తెలంగాణ వ్యతిరేక శక్తులన్నీ ఏకమై పార్టీల ముసుగులు వేసుకుని తెలంగాణలోకి వస్తున్నాయన్నారు. తెలంగాణ నాశనానికి కారణం ఢిల్లీ పాలకులేనని, తెలంగాణ మరోసారి వారి చేతుల్లోకి వెళితే మన భవిష్యత్ తరాల బతుకు అంధకారమవుతుందన్నారు. హ్యాట్రిక్ విజయాలు కట్టబెట్టి అసెంబ్లీకి పంపించిన మీరు మరోసారి ఆశీర్వదిస్తే కరీంనగరాన్ని రెట్టించిన ఉత్సాహంతో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, 34, 35వ డివిజన్ల కార్పోరేటర్లు షకీర అంజూమ్-బర్కత్ అలీ, చాడగొండ బుచ్చిరెడ్డి, నాంపల్లి శ్రీనివాస్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు అమ్జద్ అలీ పాల్గొన్నారు.

బహుజనులందరూ ఏకమై బీఎస్పీలో చేరాలి

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ - జమ్మికుంట



మాట్లాడుతున్న ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్

బహుజనులందరూ ఏకమై బీఎస్పీలో చేరి మన ఓటు మనం వేసుకుని రాజ్యాధికారం చేపట్టాలని, రాబోయే కాలంలో తెలంగాణ రాష్ట్రంలో తప్పకుండా బీఎస్పీ అధికారం చేపడుతుందని, పార్టీలో చేరిన వారిపై కేసులు పెడితే సహించేది లేదని రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని తనుగుల ఎంపీటీసీ వాసాల నిరోషా రామస్వామితో పాటు మరో 500మంది అతని అనుచరులు పట్టణంలోని ఎంపిఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బీఎస్పీలో చేరగా ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్థానిక అయ్యప్ప దేవాలయం నుంచి గాంధీ చౌరస్తా వరకు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ వాసాల రామస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పూలమాలలు వేసి నివాళు లర్పించిన అనంతరం సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు డబ్బులు, పదవులు ఆశ చూపి గాలం వేస్తున్నారని, లొంగకపోతే పోలీస్ కేసులు పెడుతున్నారని ఆయన మండిపడ్డారు. ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి పోలీస్ కేసులు పెట్టడంలో దిట్టా అన్నారు. జర్నలిస్టులను, ముదిరాజులను, అధికారులను, డ్రైవర్‌ను, గవర్నర్‌ను అసభ్య పదజాలంతో తిట్టిన వ్యక్తి ఎమ్మెల్సీగా ఉండడం దురదృష్టకరమన్నారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు బయట మాత్రం తిట్టుకుంటూ లోపాయికారి ఒప్పందం చేసుకున్నాయన్నారు. బీఎస్పీ పేదల అని ఎలాంటి అవినీతికి తావులేకుండా అధికారంలోకి వస్తే పాలన అందిస్తామన్నారు. వాసాల రామస్వామిని బీఎస్పీ నియోజకవర్గ ఇన్ చార్జిగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు దొడ్డి శ్రీనివాస్, మేకల రవీందర్, దొడ్డే సమ్మయ్య ,మారపల్లి మొగులయ్య, బందెల సదానందం, ఆకినపెల్లి శిరీష, మిడిదొడ్డి స్వప్న, పల్లె ప్రశాంత్ గౌడ్ తదితరులు ఉన్నారు.

యశోద ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

- కార్డియాక్ రీమోడలింగ్‌తో జీవన నాణ్యత మెరుగు
- యశోద ఆస్పత్రి చీఫ్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ సత్యశ్రీధర్ కాలే

నవతెలంగాణ - కరీంనగర్



మాట్లాడుతున్న చీఫ్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ సత్య శ్రీధర్ కాలే

హైదరాబాద్ సోమాజిగూడలోని యశోద ఆస్పత్రిలో అత్యంత అరుదైన గుండె శస్త్రచికిత్స చేసి ఓ మహిళకు కొత్త జీవితాన్ని అందించారు. ఈ సందర్భంగా బుధవారం కరీంనగర్‌లోని యశోద హాస్పిటల్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి యశోద ఆస్పత్రి చీఫ్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ సత్యశ్రీధర్ కాలే మాట్లాడారు. కరీంనగర్ నగరానికి చెందిన 54యేండ్ల చెన్నూరి లత గుండెదడ, నడిస్తే ఆయాసం, గట్టిగా ఊపిరి పీల్చుకోని పరిస్థితిలో బాధపడుతు ఏడాది క్రితం హైదరాబాద్ సోమాజిగూడలోని యశోద ఆస్పత్రికి వచ్చిందని తెలిపారు. ఆమెకు ఈసీజీ, 2డీ ఎకో, యాంజియోగ్రామ్ నిర్వహించగా పదే పదే గుండెపోటు రావడంతో గుండె వ్యాకోచం చెందిందని గుర్తించినట్లు తెలిపారు. కార్డియాక్ రీమోడలింగ్ కేవలం ట్రాన్స్‌ప్లాంట్ ప్రోగ్రామ్‌లకు ప్రత్యామ్నాయం కాదని, గుండె ఆగిపోయిన వారికి వారి జీవన నాణ్యతను మెరుగుపరచడానికి ఇది శక్తివంతమైన చికిత్స అని అన్నారు. ఇది ట్రాన్స్‌ప్లాంటేషన్ అవసరమైన జనాభాలో పెద్ద భాగానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఆరు గంటల పాటు సాగిన ఈ శస్త్ర చికిత్సలో ఆమెకు బైపాస్ సర్జరీ, కార్డియాక్ అనాటమీ పునరుద్ధరణ, మిట్రల్ వాల్వ్ రిపేర్ తదితర ప్రక్రియలు జరిపి అరుదైన శస్త్రచికిత్స చేసినట్లు తెలిపారు. దీంతో ఆమె విజయవంతంగా కోలుకుందన్నారు. గుండెవైఫల్యం అనేది అతికొద్ది మందికి మాత్రమే వస్తుందన్నారు. వీటికి అన్ని రకాల, అధునాతన వైద్య సదుపాయాలు ఉన్న యశోద లాంటి ఆస్పత్రిలో ఇలాంటి అపరేషన్లు చేయడం ద్వారానే విజయవంతం అవుతాయని పేర్కొన్నారు. గత ఏడాది కాలంగా లత పూర్తి ఆరోగ్యంగా జీవిస్తుందన్నారు. ఇటీవలె ఆమె అమెరికా వెళ్లి వచ్చిందని గుర్తుచేశారు. సాధారణ మందులతో మునుపటిలాగా ఆనందమైన జీవితాన్ని గడపవచ్చని తెలిపారు. అనంతరం లత మాట్లాడుతూ బతుకుతానని అనుకోలేదని.. యశోద ఆస్పత్రిలోని వైద్యులు అందించిన వైద్యసేవలతో ఇప్పుడు సాధారణ జీవితాన్ని గడపడం సంతోషంగా ఉందన్నారు. పునఃజన్మ ఇచ్చిన యశోద అస్పత్రి వైద్యుడు డాక్టర్ సత్యశ్రీధర్ కాలె, వారి వైద్య బృందం, ఆస్పత్రి యాజమాన్యానికి రుణపడి ఉంటానని తెలిపారు.

దోపిడీ దొంగల ముఠా అరెస్టు

ఆటో, సెల్‌ఫోన్లు, కత్తి స్వాధీనం

నవతెలంగాణ - కరీంనగర్ క్రైం



వివరాలు తెలుపుతున్న పోలీసులు

మహిళను చంపి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన దోపిడి దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ముగ్గురు ముఠా సభ్యులను ఈ నెల 4న షేక్ గౌస్ పాషా, మొహమ్మద్ నూర్జహాన్ బేగం, వి.మోహన్ కలిసి దొంగిలించిన వస్తువులను అమ్ముటకు వెళ్తుండగా అరెస్ట్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 1న వరంగల్‌కు చెందిన గుండారపు ప్రమీళ(58) తన తండ్రి కొమురయ్య ఆరోగ్యం బాగుండడం లేదని కేశవపట్నం మండలంలోని మొలంగూర్‌కు చెందిన బాబా దగ్గరకు వెళ్లారు. వీరిద్దరూ మొలంగూర్ క్రాస్ రోడ్డు నుంచి మొలంగూర్ గ్రామానికి నడుచుకుంటూ వెళ్లి బాబా గురించి విచారిస్తున్న క్రమంలో గ్రామం నుంచి వస్తున్న ఆటోలోని వ్యక్తులు ప్రమీళ మెడలో ఉన్న బంగారు ఆభరణాలు గమనించి, బాబా ఇంటి వద్ద లేడు.. తమకు తెలిసిన అయ్యగారు ఉన్నాడని, మీ తండ్రి అనారోగ్యం దూరం చేస్తామని బలవంతం చేయగా ఆటోలో కూర్చొని మొలంగూర్ నుంచి బయలుదేరారు. ఆటోలోని వ్యక్తులు వృద్ధులను తాడికల్ గ్రామం వద్ద గల శివాలయం వైపు తీసుకొచ్చి ఆటోను కొద్ది దూరంలో ఆపి, శివాలయం కాంపౌండ్‌లోని తీసుకెళ్లి కూర్చుండబెట్టి ప్రమీలకు చూపించి తన మెడలోని పుస్తెల తాడు, బంగారు ఆభరణాలు తీసి ఇవ్వమని బెదిరించగా ఇవ్వకపోవడంతో పాటు అరుస్తు ఉండగా చాకుతో ఛాతిపై, తలపై, కుడి భుజంపై తండ్రి కళ్లముందే నిర్దాక్షిణ్యంగా పొడిచారు. కత్తిపోట్లు మూలంగా తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడిక్కడే ప్రమీల మృతిచెందింది. నేరస్తుడు మెడలో ఉన్న పుస్తెలతాడు, చెవి కమ్మను దొంగలించి పారిపోయారు. పోలీసులకు సమాచారం అందడంతో నేరస్థలాన్ని వారి స్వాధీనంలోకి తీసుకున్నారు. గుండారపు సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేశవపట్నం పీఎస్‌లో కేసు నమోదు చేశారు. హుజురాబాద్ రూరల్ సీఐ బి.సంతోష్‌కుమార్, కేశవపట్నం ఎస్ఐ పి.లక్ష్మారెడ్డి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనా స్థలాన్ని అడిషనల్ డీసీపీ (ఎల్ అండ్ ఓ) ఏ.లక్ష్మీనారాయణ, ఏసీపీ ఎల్.జీవన్ రెడ్డి లు పరిశీలించారు. కరీంనగర్ సీపీ ఆదేశాల మేరకు నేరస్తులను పట్టుకోవడానికి నాలుగు టీమ్స్ హుజురాబాద్ డివిజన్ నుంచి, సీసీఎస్ టీం లు ఏర్పాటుచేశారు. హుజురాబాద్ డివిజన్ పోలీసులు, సీసీఎస్ పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి నేరానికి పాల్పడ్డ నేరస్తులు ప్రయాణించిన ఆటోను గుర్తించారు. మహిళను బంగారు దోపిడీ చేయాలనే ఉద్దేశంతో ఆమెకు మాయమాటలు చెప్పి ఆటోలో కిడ్నాప్ చేసుకొని వచ్చి చంపి, ఆమె మెడలో నుంచి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన ముగ్గురు ముఠా సభ్యులను ఈనెల 4న షేక్ గౌస్ పాషా, మొహమ్మద్ నూర్జహాన్ బేగం, వి.మోహన్‌లు కలిసి దొంగిలించిన వస్తువులను అమ్ముటకు వెళ్తుండగా అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి దొంగిలించిన బంగారు పుస్తెల తాడు, ఒక చెవికమ్మ, నేరానికి ఉపయోగించిన ఆటో, మర్డర్‌కు ఉపయోగించిన కత్తి, ముగ్గురు నిందితులకు సంబంధించిన మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో దొంగలించబడిన మొత్తం బంగారు ఆభరణాలు 27గ్రాములు రూ.1.5లక్షలు నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు సమగ్ర దర్యాప్తును అడిషనల్ డీసీపీ ఎల్ అండ్ ఓ లక్ష్మీనారాయణ, అడిషనల్ డీసీపీ (అడ్మిన్) సి.రాజు పర్యవేక్షణలో కేసును స్వల్ప కాలంలోనే చేధించడం, మొత్తం నేరస్తులను పట్టుకోవడం, దొంగిలించిన సొత్తును, నేరానికి వాడిన వాహనాన్ని రికవరీ చేసిన హుజురాబాద్ ఏసీపీ ఎల్.జీవన్ రెడ్డి, ఏసీపీ సీసీఎస్ వి.మాధవి, హుజురాబాద్ రూరల్ సీఐ సంతోష్ కుమార్, కేశవపట్నం ఎస్ఐ పి.లక్ష్మా రెడ్డి, సీసీఎస్ ఎస్ఐ మధుకర్ రెడ్డి, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ సురేంద్రపాల్ సింగ్, కానిస్టేబుల్స్ తిరుపతి, కనకరాజు, కేశవపట్నం పోలీస్ స్టేషన్ సిబ్బంది రాంబాబు, రమేష్‌లను కరీంనగర్ సీపీ ఎల్.సుబ్బారాయుడు అభినందించారు.

వర్కర్స్ టు ఓనర్ పథకం అమలు చేయాలి

సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం

నవతెలంగాణ-కరీంనగర్



వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

సిరిసిల్ల తరహాలో జిల్లాలోని పవర్లూమ్ కార్మికులందరికి వర్కర్స్ టు ఓనర్ పథకం అమలు చేయాలని బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో చేనేత జౌళిశాఖ అడిషనల్ డైరెక్టర్ సంపత్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పునూటి శ్రీనివాస్, గుడికందుల సత్యం మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఉన్న పవర్ లూం కార్మికులందరికి ప్రభుత్వమే గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఒక్కో కార్మికుడికి నాలుగు పవర్లుమ్ సాంచెలు మంజూరు చేసి, షెడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. అర్హులైన పవర్లూమ్ కార్మికులందరికి డబుల్ బెడ్రూమ్ ఇల్లు ఇవ్వాలని, దళిత బంధు తరహాలో నేతన్న బంధు ప్రకటించి ప్రతి కుటుంబానికి రూ.10లక్షలు ఇవ్వాలన్నారు. ఆర్థికంగా చితికిపోయి ఉన్న కార్మికులను ప్రభుత్వం కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రోత్సహించాలని, 500 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇవ్వాలన్నారు. 50ఏండ్లు పైబడిన ప్రతి కార్మికుడికి నెలకు రూ.5000లు పెన్షన్ ఇవ్వాలని, బతుకమ్మ పండుగలకు చేనేత పవర్ లూమ్ కార్మికులకు చేతినిండా పని ఉండేలా చీరలు నేయించాలన్నారు. పవర్లూమ్ కార్మికుల సమస్యలు పరిష్కరించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ చామనపల్లి అధ్యక్షులు దూడం గంగాధర్, ఘర్షకుర్తి అధ్యక్షులు గడ్డం నారాయణ, నాయకులు కొండబత్తుల స్వామి, గుజ్జేటి శ్రీనివాస్, ఘర్షకుర్తి ఉపాధ్యక్షులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ రీజనల్ మేనేజర్‌గా భూపతిరెడ్డి

నవతెలంగాణ - కరీంనగర్



ఆర్టీసీ కరీంనగర్ రీజియన్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ (ఆపరేషన్స్)గా ఎస్.భూపతిరెడ్డి ఆయన కార్యాలయంలో పదవీ బాధ్యతలు బుధవారం స్వీకరించారు. ఆయన కరీంనగర్ జోనల్ వర్క్‌షాప్‌లో స్టోర్స్ ఆఫీసర్ (రిసిప్ట్)గా పని చేసి పదోన్నతిపై వచ్చారు. ప్రస్తుతం డిప్యూటీ రీజనల్ మేనేజర్ (ఆపరేషన్స్)గా ఉన్న ఎస్.చందర్‌రావు బదిలీపై హైదరాబాద్ బస్ భవన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ రీజనల్ మేనేజర్ చందర్ రావు, పర్సనల్ ఆఫీసర్ చంద్రయ్య, డిప్యూటీ రీజనల్ మేనేజర్ కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భూపతిరెడ్డి రీజనల్ మేనేజర్ ఎస్.సుచరితను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

పత్తి రైతులు ఆధార్‌ను ప్రమాణీకరణ చేసుకోవాలి

జిల్లా మార్కెటింగ్ అధికారి వి.పద్మావతి

నవతెలంగాణ - జమ్మికుంట



పత్తి రైతులు తమ ఆధార్ కార్డులు ప్రమాణీకరణ చేసుకోవాలని, బ్యాంకు అకౌంట్‌కు ఆధార్ లింకు చేసుకోవాలని అప్పుడే సిసిఐ మద్దతు ధరకు పత్తిని కొనుగోలు చేస్తుందని జిల్లా మార్కెటింగ్ అధికారి వి.పద్మావతి అన్నారు. బుధవారం జమ్మికుంట కాటన్ మార్కెట్ కార్యాలయంలో స్థానిక మార్కెట్ సెక్రటరీ గుగులోతు రెడ్డి అధ్యక్షతన మండలాలకు సంభందించిన అగ్రికల్చర్ ఆఫీసర్స్, ఏఈఓలు, జమ్మికుంట సీసీఐ సెంటర్ ఇన్‌చార్జి, పత్తి ఖరీదు వ్యాపారులు, అడ్తి దారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులకు అవగాహన సదస్సుకు 2023- 24 వానాకాలం (ఖరీఫ్) మార్కెటింగ్ సీజన్‌లో పత్తి పండించిన రైతులు ముఖ్యంగా ఆధార్ ప్రమాణీకరణ చేసుకోవాలని తెలిపారు. సీసీఐ వారు భారత ప్రభుత్వ ప్రకటించిన పత్తి కనీస మద్దతు ధర రూ.7,020 అయితే ఈ రోజు బహిరంగ మార్కెట్‌లో 7000 రూపాయలు నమోదు అయ్యిందని, నవంబర్, డిసెంబర్‌లలో బహిరంగ మార్కెట్ లో ధర కనీస మద్దతు ధర కన్నా తక్కువ ఉంటే సీసీఐ వారు జిల్లా పాలనాధికారి నోటిఫై చేసిన జిన్నింగ్ మిల్లులలో జమ్మికుంట మార్కెట్ యార్డులో సిసిఐ వారు కొనుగోలు చేస్తారని తెలిపారు. తేమ శాతం 8 నుండి 12 వరకు ఉండాలన్నారు. అంతకు ముందు జమ్మికుంట మార్కెట్ కమిటీ కార్యదర్శితో కలిసి మార్కెట్ యార్డ్ సందర్శించి కొనుగోళ్ల ప్రక్రియను పరిశీలించారు.

గ్రామ అభివృద్ధితోనే బంగారు తెలంగాణ

ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి



పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ

నవతెలంగాణ - హుజురాబాద్ : గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే బంగారు తెలంగా ణ సాధ్యమని భావించిన సీఎం కేసీఆర్ అందుకు కృషిచేస్తున్నా రని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కాట్రపల్లి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు రూ.7లక్షతో నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని, 10లక్షలతో నిర్మించిన మన ఊరు - మనబడి, ఎస్‌జీఎఫ్ 20లక్షల నిధులతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని, గ్రంథాలయ భవనాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో హుజురాబాద్ ఎంపీపీ ఇరుమల రాణి, సర్పంచ్ కాసగోని నిరోషా, ఎంపీటీసీ రావుల అనిత, ఎంఈఓ కేతిరి వెంకటనరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ తోగరు బిక్షపతి అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థికి ఘన స్వాగతం

నవతెలంగాణ - తిమ్మాపూర్



బహుజన సమాజ్ పార్టీ మానకొండూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా అడ్వకేట్ నిషాని రామచంద్రం పేరును రాష్ట్ర అధ్యక్షుడు ప్రకటించారు. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకులు ఆయనకు ఇందిరానగర్ గ్రామంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి అంబాల సతీష్, బహుజన కార్మిక రాష్ట్ర అధ్యక్షుడు కన్నం లక్ష్మణ్, తిమ్మాపూర్ మండల ఉపాధ్యక్షుడు ఒద్దిరాల అభిలాష్, నాయకులు సిరిసిల్ల అంజయ్య, అలువాల శ్రీనివాసు, శ్రీధర్, మనోజు, శ్రవణ్ పాల్గొన్నారు.

సుకుమార్ జ్ఞాపకార్థం బస్ షెల్టర్ ఏర్పాటు

నవతెలంగాణ-మల్లాపూర్



మండలంలోని ముత్యంపేట గ్రామంలో కీ.శే. వుయ్యాల సుకుమార్ (కోరుట్ల) జ్ఞాపకార్థం వుయ్యాల సుకుమార్ చారిటబుల్ ట్రస్ట్, సుమన్ యూత్ ఆధ్వర్యంలో బస్ షెల్టర్‌ను బుధవారం ప్రారం భించారు. ప్రారం భించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ.. ప్రజల సౌకర్యార్థం నూతన మిని బస్ షెల్టర్ ను ముత్యంపేట్‌లోని మహాత్మ జ్యోతి రావుపూలే విగ్రహం వద్ద ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు గొడి సెల సజన్,బొల్లం రాజు,బొల్లం రఘు పాల్గొన్నారు.

లక్కీడ్రా స్కీం పేరుతో మోసం


నవతెలంగాణ-మేడిపల్లి : భీమారం, కథలాపూర్ మండలాలకు చెందిన పలువురు రైతులను లక్కీ డ్రా స్కీం పేరుతో మోసం చేసిన వ్యక్తిని పోలీసులు అరెసు చేశారు. మేడిపల్లి స్టేషన్ హౌస్ అధికారి కథనం ప్రకారం మెట్‌పలి కి చెందిన గోనె ప్రతాప్ మోటార్ సైకిల్ లక్కీ డ్రా స్కీం కింద అమాయకులైన రైతులను నుంచి డబ్బులు వసూలు చేశారు. భీమారం మండలానికి చెందిన చెక్కపల్లి రఘు, దాసరి నాగరాజు ఫిర్యాదు మేరకు గోనె ప్రతాప్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఎం. చిరంజీవి తెలిపారు.

బిజినెస్

ఐపీఓ నిధుల సమీకరణలో మందగమనం

ప్రథమార్థంలో 26% క్షీణత

- ఇష్యూకు వచ్చిన 31 కంపెనీలు..



ముంబయి : భారత్‌లో ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ద్వారా సమీకరించే నిధులు మందగించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ కాలంలో 31 కంపెనీలు రూ.26,300 కోట్ల నిధులు సమీకరించాయి. 2022-23 ఇదే ప్రథమార్థం (హెచ్1)లో కేవలం 14 కంపెనీలు ఇష్యూకు రావడం ద్వారా రూ.35,456 కోట్ల కోట్ల నిధులను పొందాయి. 2022-23 హెచ్1లో లిస్టింగ్ తేది.. ముగింపు ధర ఆధారంగా సగటు లిస్టింగ్ లాభం 11.56 శాతంతో పోల్చితే గడిచిన హెచ్1లో 29.44 శాతానికి పెరగడం విశేషం. ప్రైమ్ డేటాబేస్ రిపోర్ట్ ప్రకారం.. గడిచిన ప్రథమార్థంలో ఐపిఒకు వచ్చిన భారత కంపెనీలు గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే నిధుల సమీకరణలో 26 శాతం పతనం చోటు చేసుకుంది. "గత ఆరు నెలల్లో బహుళ రంగాలకు చెందిన కంపెనీలు ఐపిఒ మార్కెట్‌కు వచ్చాయి. బ్యాంకింగ్, ఫైనాన్స్, బీమా (బీఎఫ్ఎస్ఐ) రంగానికి చెందిన కంపెనీలు కేవలం రూ. 1,525 కోట్ల నిధులను సమీకరించాయి. మొత్తం నిధుల్లో వీటి వాటా 6 శాతంగా ఉంది." అని ప్రైమ్ డేటాబేస్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రణవ్ హల్దియా పేర్కొన్నారు. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ సంస్థలు గతేడాది ఇదే కాలంలో సేకరించిన నిధులలో 61 శాతం వాటాను కలిగి ఉన్నాయి.

మెటాలో మరోసారి కోతలు

- ఉద్యోగుల్లో ఆందోళన

వాషింగ్టన్ : టెక్ దిగ్గజం మెటాలో మరోమారు ఉద్యోగుల తొలగింపులు ఉండొచ్చని రిపోర్టులు వస్తోన్నాయి. ఆర్థిక మాంద్యం ప్రభావంతో ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టా మాతృసంస్థ అయినా మెటా ఖర్చు తగ్గింపులో భాగంగా ఉద్యోగులపై వేటు వేయనుందని సమాచారం. మంగళవారం జరిగిన సంస్థ అంతర్గత సమావేశాల్లో ఉద్యోగుల తొలగింపు అంశంపై చర్చకు వచ్చిందని రిపోర్టులు వస్తున్నాయి. మెటాకు చెందిన 'ఫాస్ట్' యూనిట్‌లోని 600 సిబ్బందిని ఇంటికి పంపించనున్నారని సమాచారం. ఈ విషయమై వారికి ఒక్కటి, రెండు రోజుల్లో సమాచారం అందించనున్నారని తెలుస్తోంది. ఈ ఏడాది ప్రారంభంలోనూ దాదాపు 10 వేల మంది ఉద్యోగులను ఇంటికి పంపనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఏప్రిల్‌లో నాలుగు వేల మందిని ఇంటికి పంపిన మెటా.. మిగిలిన 6వేల మంది ఉద్యోగులకు మే నెల చివర్లో ఉద్వాసన పలికింది. తాజాగా మరోమారు వేటుకు సిద్ధం కావడంతో టెక్ ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.

డయాబెటిస్ రోగులకు లూపిన్ మద్దతు

ముంబయి : ప్రముఖ ఔషధ ఉత్పత్తుల కంపెనీ లూపిన్ డయాబెటిస్ రోగులకు మద్దతును అందిస్తున్నట్లు తెలిపింది. పేషెంట్ సపోర్ట్ ప్రోగ్రాం 'హమ్‌రహి' పేరుతో మధుమేహం నిర్వహణలో నూతన శకానికి నాంది పలుకుతున్నట్లు పేర్కొంది. దేశంలో 7.7 కోట్ల మంది మధుమేహం భారిన పడ్డారని తెలిపింది. 2045 నాటికి ఇది 13.4 కోట్ల కేసులు నమోదవుతాయని అంచనా వేసింది. హమ్‌రహిలో ప్రోగ్రాంలో ఆరోగ్య సంరక్షణ నిపుణుల మార్గదర్శకత్వంలో వ్యక్తిగతీకరించిన (కస్టమైజ్డ్) డైట్ కౌన్సెలింగ్, మందుల సహాయం తదితర మద్దతును అందించనున్నట్లు పేర్కొంది. రోగులకు ఖచ్చితమైన ఇన్సులిన్ ఇంజెక్షన్, నైపుణ్యాలను అందించడం ద్వారా వారి రక్తంలో చక్కెర స్థాయిలను సమర్థవంతంగా నిర్వహించగలుగుతారని పేర్కొంది. ఇందుకోసం తమ టోల్‌ఫ్రీ నెంబర్, కస్టమర్ కేర్‌ను సంప్రదించవచ్చని లుపిన్ ప్రెసిడెంట్ ఇండియా రీజియన్ ఫార్ములేషన్స్ రాజీవ్ సిబల్ తెలిపారు.

7న మింత్రా బిగ్ ఫ్యాషన్ ఫెస్టివల్

న్యూఢిల్లీ : ఇ-కామర్స్ సంస్థ మింత్రా అక్టోబర్ 7 నుంచి బిగ్ ఫ్యాషన్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ తెలిపింది. నాల్గవ ఎడిషన్‌లో 6000 కన్నా ఎక్కువ బ్రాండ్‌లు 23 లక్షలకు పైగా ఉత్పత్తుల ఎంపికను అందిస్తున్నట్లు పేర్కొంది. ఈ దఫా పండగ కార్నివాల్ సమయంలో 80 లక్షల వినియోగదారులు కొనుగోళ్లు చేస్తారని అంచనా వేసింది. మెట్రోయేతర నగరాలలోని వినియోగదారుల కోసం పలు కీలక బ్రాండ్‌ల నుంచి 5 లక్షలకు పైగా కొత్త ఉత్పత్తులను జోడించినట్లు పేర్కొంది.

హైదరాబాద్‌లో ఆఫీసు స్పేస్‌కు డిమాండ్

నైట్ ఫ్రాంక్ రిపోర్ట్

హైదరాబాద్ : దేశంలోనే అత్యధిక కొత్తగా కట్టిన కార్యాలయాలను పూర్తి చేసిన నగరంగా హైదరాబాద్ నమోదయ్యిందని నైట్ ఫ్రాంక్ ఇండియా తెలిపింది. ప్రస్తుత ఏడాది సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికం (క్యూ3)లో నగరంలో 29 లక్షల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్ లావాదేవాలు జరిగాయని ఇండియా రియల్ ఎస్టేట్ క్యూ3-2023 రిపోర్ట్‌లో వెల్లడించింది. గడిచిన త్రైమాసికంలో 53 లక్షల ఆఫీసు స్పేస్ నిర్మాణం పూర్తయ్యిందని పేర్కొంది. దేశంలోని ఎనిమిది మార్కెట్‌లలో డెలివరీ చేయబడిన ఆఫీస్ స్పేస్‌లో 46శాతం హైదరాబాద్ వాటా ఉందన్నారు. సగటు లావాదేవీ అద్దె నెలకు చదరపు అడుగుకి రూ.65.3గా ఉందని పేర్కొంది.

కొత్త విక్రేతలకు మీషో అవకాశాలు

జీఎస్‌టీయేతర సదుపాయం

హైదరాబాద్ : ఇ-కామర్స్ వేదిక మీషో దేశంలోని లక్షలాది మంది కొత్త విక్రేతలకు విస్తృత అవకాశాలు కల్పిస్తున్నట్లు ఆ సంస్థ తెలిపింది. ఆన్‌లైన్‌లో హద్దులు లేని అవకాశాలు అందించడానికి జీఎస్‌టీయేతర విక్రేతల కోసం ప్లాట్‌ఫామ్‌ను రూపొందించామని.. 2023 అక్టోబర్ 1 నుంచి విక్రయాలను ప్రారంభించుకోవచ్చని పేర్కొంది. ఇ-కామర్స్ సంస్థలు ఇటీవల జీఎస్‌టి కౌన్సిల్‌కు చేసిన వినతితో ఇప్పుడు రూ.40 లక్షల వరకు టర్నోవర్ కలిగిన సంస్థలు ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవచ్చని తెలిపింది. 2027 నాటికి కోటి మంది అమ్మకందారులను డిజిటలైజ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మీషో తెలిపింది.

నేటి ఛలో డైరెక్టరేట్ తాత్కాలికంగా వాయిదా

- జీవో 142 రద్దు పోరాట కమిటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గురువారం తలపెట్టిన ఛలో డైరెక్టరేట్‌ను తాత్కాలికంగా వాయిదా వేసినట్టు జీవో 142 రద్దు పోరాట కమిటీ తెలిపింది. ఈ మేరకు బుధవారం ఆ కమిటీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు కె.యాదానాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఛలో డైరెక్టరేట్ పిలుపు నేపథ్యంలో రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ గడల శ్రీనివాసరావు బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు సంయుక్త సమావేశం నిర్వహించి జీవో 142కు సంబంధించిన పూర్తి వివరాలపై చర్చించినట్టు తెలిపారు. పూర్తి అనెక్షర్స్ ఇచ్చేందుకు డీహెచ్ అంగీకరించినట్టు తెలిపారు. క్యాడర్లకు సంబంధించిన సలహాలు, సూచనలను యూనియన్లు, అసోసియేషన్ల తరఫున జీవో 142 రద్దు పోరాట కమిటీ లెటర్ హెడ్‌పై 15వ తేదీలోపు సమర్పించాలని డీహెచ్ సూచించినట్టు చెప్పారు. దీంతో కమిటీలోని నాయకులందరి ఏకాభిప్రాయం మేరకు ఛలో డైరెక్టరేట్‌ను తాత్కాలికంగా వాయిదా వేసినట్టు వివరించారు.

ఈడీకి సుప్రీంకోర్టు మొట్టికాయలు



న్యూఢిల్లీ: అరెస్టులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి సుప్రీంకోర్టు బుధవారం మొట్టికాయ లేసింది. కేసుల దర్యాప్తు సమయంలో ఈడీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడకూడదనీ, చట్ట ప్రకారం వ్యవహరించాలని హెచ్చరించింది. మనీలాండరింగ్ కేసులో గురుగ్రామ్ కంపెనీకి చెందిన రియల్టి గ్రూప్ ఎం3ఎం డైరెక్టర్లు బసంత్ బన్సాల్, పంకజ్ బన్సాల్‌ల అరెస్ట్‌లను మంగళవారం కొట్టివేసిన సుప్రీంకోర్టు ఈడీపై ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ తీర్పు బుధవారం నోట్ చేయబడింది.

తమ అరెస్ట్‌లను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌లను పంజాబ్, హర్యానా హైకోర్టు కొట్టివేయడంతో .. వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. జూన్ 14న బన్సాల్‌ను విచారణకు రావాల్సిందిగా సమన్లు జారీ చేశారని, అదే రోజు ఈడీ నమోదు చేసిన మరో కేసులో అరెస్ట చేశారని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈడీ ప్రతి చర్యా పాదర్శకంగా, ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని సుప్రీంకోర్టు పేర్కొంది. కానీ, ఈ కేసులో దర్యాప్తు సంస్థ తన అధికారాలను, విధులను అనుసరించడంలో విఫలమైందని వాస్తవాలు నిరూపించాయని పేర్కొంది. ఈడీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడకూడదని, చట్టబద్ధంగా వ్యవహరించాలని ఆదేశించింది. ప్రశ్నలకు నిందితులు సమాధానం ఇవ్వకపోవడంతో అరెస్టు చేయడం సరికాదని హెచ్చరించింది. మనీలాండ రింగ్ చట్టం కింద వారు నేరానికి పాల్పడ్డారని చెప్పేందుకు కచ్చితమైన ఆధారాలను సేకరించి అరెస్టు చేయాలి తప్ప సమన్లకు సరిగా స్పందించలేదని ఎవరినీ అరెస్టు చేయకూడదని పేర్కొంది. అరెస్టు సమయంలో అందుకు గల కారణాలను కూడా నిందితులకు లిఖితపూర్వకంగా అందించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈడి మాజీ ప్రత్యేక న్యాయమూర్తి సుధీర్ పర్మార్, అతని మేనల్లుడు రూప్ కుమార్ బన్సాల్ (రియల్టీ సంస్థలో మూడో భాగస్వామి) లంచం ఆరోపణ కేసులో బన్సాల్ సోదరులను ఈడి అరెస్ట్ చేసింది. దీంతో రూప్ కుమార్ బన్సాల్, బసంత్ బన్సాల్‌లపై సుధీర్ పర్మార్ అభిమానం చూపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం ఉందని ఈడి కోర్టుకు తెలిపింది.

స్పీకర్‌కు ఉద్వాసన

- అమెరికా చరిత్రలో తొలిసారి



న్యూయార్క్ : అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్ కెవిన్ మెకార్థీని పదవి నుంచి దించేశారు. ఆయనకు వ్యతిరేకంగా రిపబ్లికన్ పార్టీ నేత మ్యాట్ గేజ్ అవిశ్వాస తీర్మానం తీసుకొచ్చారు. దీనిపై ఓటింగ్ చేపట్టి మెకార్థీని తొలగించారు. ఇలా ఓ స్పీకర్‌ను బలవంతంగా పదవి నుంచి తొలగించడం అమెరికా చరిత్రలోనే తొలిసారి చోటుచేసుకుంది. సుదీర్ఘ ఓటింగ్ ప్రక్రియ తర్వాత ఈ ఏడాది జనవరిలోనే మెకార్థీ స్పీకర్ పదవి చేపట్టారు. 10 నెలలు కూడా తిరగకుండానే అమెరికా ప్రతినిధుల సభ ఆయనకు ఉద్వాసన పలకడం గమనార్హం.

ఆ ఒప్పందమే కారణమా?

గతేడాది జరిగిన మధ్యంతర ఎన్నికల్లో అమెరికా కాంగ్రెస్ (పార్లమెంటు) ఎగువసభ సెనెట్‌ను అధికార డెమోక్రటిక్ పార్టీ కైవసం చేసుకొంది. కానీ, ప్రజాప్రతినిధుల సభలో మెజారిటీ సాధించలేక పోయింది. దిగువసభలోని మొత్తం 435 సీట్లకు డెమోక్రాట్లు 213 సీట్లు గెలిస్తే, ప్రతిపక్ష రిపబ్లికన్లు అంతకు తొమ్మిది సీట్లు ఎక్కువగా 222 సీట్లతో మెజారిటీ పక్షంగా నిలిచారు. అయినప్పటికీ సభాపతిని ఎన్నుకోవడానికి రిపబ్లికన్లు ఆపసోపాలు పడ్డారు. పార్టీలో అంతర్గత విభేదాల కారణంగా రిపబ్లికన్ల మధ్య అంత సులువుగా ఏకాభిప్రాయం కుదరలేదు. నాలుగు రోజుల పాటు ఏకంగా 15 దఫాలు ఓటింగ్ నిర్వహించగా.. చివరకు కెవిన్ మెకార్థీ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. అయితే, ఆ సమయంలో మెకార్థీ.. పదవిని చేజిక్కించుకోవడం కోసం పార్టీ నేతలతో ఓ ఒప్పందం చేసుకున్నారు. తన ఉద్వాసనకు ఒక్క రిపబ్లికన్ సభ్యుడు డిమాండ్ చేసినా అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్‌కు సమ్మతిస్తానన్న అన్నారు. ఇప్పుడదే ఒప్పందంతో మెకార్థీపై రిపబ్లికన్ నేత మ్యాట్ గేజ్ అవిశ్వాసం తీసుకొచ్చారు. దీనిపై ఓటింగ్ చేపట్టి మెకార్థీని తొలగించారు.

దేశంలో 20 నకిలీ వర్సిటీలు

అమాయక విద్యార్థులను మోసం చేస్తున్నారంటూ యూజీసీ లేఖలు

న్యూఢిల్లీ: దేశంలో 20 నకిలీ విశ్వవిద్యాలయాలు నడుస్తున్నాయని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) తెలిపింది. వీటిలో అత్యధిక వర్సిటీలు దేశ రాజధాని ఢిల్లీలో కొనసాగుతున్నాయని వివరించింది. ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళ, మహారాష్ట్ర, పుదుచ్చేరి, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో బూటకపు యూనివర్సిటీలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఈ మేరకు ఆయా యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్లకు యూజీసీ ఓ లేఖ రాసింది. 1956వ సంవత్సరపు యూజీసీ చట్టంలోని సెక్షన్ 2(ఎఫ్) లేదా సెక్షన్ 3 ప్రకారం వాటిని యూనివర్సిటీలుగా పరిగణించలేమని ఆ లేఖలో స్పష్టం చేశారు. ఈ సంస్థలు యూనివర్సిటీ పేరిట చలామణి అవుతూ అమాయకులైన విద్యార్థులను మోసం చేసి, డిగ్రీలు ఇస్తున్నాయని తెలిపింది. 'మీ మోసపూరిత చర్య కారణంగా అనేక మంది విద్యార్థులు ఇబ్బంది పడడం ఆందోళన కలిగిస్తోంది' అని ఆ లేఖలో నకిలీ యూనివర్సిటీలను తూర్పార పట్టింది.

నకిలీ వర్సిటీలలో ఎనిమిది రాజధాని ఢిల్లీలోనే ఉన్నాయి. ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అండ్ ఫిజికల్ హెల్త్ సైన్సెస్ రాష్ట్ర ప్రభుత్వ యూనివర్సిటీ (అలీపూర్), కమర్షియల్ యూనివర్సిటీ లిమిటెడ్ (దర్యాగంజ్), యునైటెడ్ నేషన్స్ యూనివర్సిటీ, ఒకేషనల్ యూనివర్సిటీ, ఏడీఆర్-సెంట్రిక్ జ్యూరిడికల్ యూనివర్సిటీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, విశ్వకర్మ ఓపెన్ యూనివర్సిటీ ఫర్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్, రోహిణిలోని ఆధ్యాత్మిక్ విశ్వవిద్యాలయ సంస్థలు దేశ రాజధానిలోనే కార్యకలాపాలు సాగిస్తున్నాయి.

నకిలీ యూనివర్సిటీల జాబితాలో క్రైస్ట్ న్యూ టెస్టామెంట్ డీమ్డ్ యూనివర్సిటీ (గుంటూరు), బైబిల్ ఓపెన్ యూనివర్సిటీ ఆఫ్ ఇండియా (విశాఖపట్నం), బడగాన్వీ సర్కార్ వరల్డ్ ఓపెన్ యూనివర్సిటీ ఎడ్యుకేషన్ సొసైటీ (బెల్గాం), సెయింట్ జాన్స్ యూనివర్సిటీ (కిషనట్టం), రాజా అరబిక్ యూనివర్సిటీ (నాగపూర్), శ్రీ బోధి అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (పుదుచ్చేరి), గాంధీ హిందూ విద్యాపీఠ్ (అలహాబాద్), నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ ఎలక్ట్రో కాంప్లెక్స్ హోమియోపతి (కాన్పూర్), నేతాజీ సుభాష్ చంద్రబోస్ యూనివర్సిటీ (అలీఘర్), భారతీయ శిక్షా పరిషత్ (లక్నో), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్ మెడిసిన్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్ మెడిసిన్ అండ్ రిసెర్చ్ (పశ్చిమ బెంగాల్) ఉన్నాయి.

వెయ్యిసార్లు దాడులు చేసినా..

- ఒక్కపైసా కూడా గుర్తించలేకపోయారు : కేజ్రీవాల్



న్యూఢిల్లీ: ఆప్ నేత సంజయ్ సింగ్‌కు మద్దతుగా మోడీ ప్రభుత్వంపై ఆ పార్టీ అధ్యక్షుడు, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ బుధవారం విరుచుకుపడ్డారు. కేంద్రం వెయ్యిసార్లకు పైగా సోదాలు జరిపినా అక్రమ సంపాదన కింద ఒక్క పైసాను కూడా గుర్తించలేక పోయారని అన్నారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసుకు సంబంధించి ఆప్ నేత సంజయ్ సింగ్ నివాసంలో బుధవారం ఉదయం నుండి సోదాలు జరుపుతున్న సంగతి తెలిసిందే. " గత ఏడాది కాలంగా చూస్తున్నాం. మద్యం కుంభకోణం పేరుతో కేంద్రం హడావిడీ చేస్తోంది. వెయ్యికి పైగా దాడులు నిర్వహించగా.. ఒక్క పైసా కూడా రికవరీ కాలేదు" అని అన్నారు.

ఏడాది కాలంగా కేంద్రం 'స్కామ్' అని ఆరోపిస్తూనే ఉన్నారని..తాను విచారణ చేసానని.. స్కామ్ జరగలేదని అన్నారు. సంజయ్ సింగ్ నివాసంలోనూ ఏమీ గుర్తించలేదని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రానికి ఓడిపోతామనే భయం పట్టుకుందని ఎద్దేవా చేశారు. దీంతో ఓడిపోయే (అధికార) పక్షం చివరి ప్రయత్నంగా ఈ దాడులు కనిపిస్తున్నాయని అన్నారు. ప్రతిపక్షనేతలతో పాటు ప్రత్యర్థులను, విమర్శకులను వేధించేందుకు మోడీ ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తోందని మండిపడ్డారు. న్యూస్ క్లిక్ కార్యాలయంపై దాడులు కూడా ఇందులో భాగమేనని పేర్కొన్నారు. " నిన్న జర్నలిస్టులపై దాడులు చేశారు. ఈ రోజు సంజయ్ సింగ్ వంతు.. ఎన్నికల వరకు ఆగండి...దాడులు ఇంకా తీవ్రతరం కావచ్చు' అని అన్నారు.

భూకుంభకోణం కేసులో లాలూకు బెయిల్



న్యూఢిల్లీ: భూ కుంభకోణం కేసులో రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ) అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్‌కి ఢిల్లీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఇదే కేసుకు సంబంధించి ఆయన భార్య రబ్రీదేవి, కుమారుడు, బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీయాదవ్‌లకూ బెయిల్ జారీ చేసింది. ప్రత్యేక సీబీఐ జడ్జి గీతాంజలి గోయల్ బుధవారం బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 2004-2009 మధ్య లాలూ కేంద్రమంత్రిగా ఉన్న సమయంలో రైల్వేలో ఉద్యోగాలు ఇప్పించేందుకు కొందరు అభ్యర్థుల నుంచి భూములు తీసుకున్నారంటూ లాలూతో పాటు మరో 15 మందిపై గతేడాది మేలో సిబిఐ కేసు నమోదుచేసిన సంగతి తెలిసిందే. ఇదే కేసులో ఈ ఏడాది జులై 3న సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసింది. రైల్వేలోని వివిధ జోన్‌లలో గ్రూప్ డి పోస్టుల్లో పలువురిని నియమించినట్లు పేర్కొంది. ఈ ఏడాది సెప్టెంబరు 22న ఈ కేసులో విచారణకు హాజరుకావాలని నిందితులకు సమన్లు జారీ చేసింది.

లఖింపూర్ ఖేరీ ఘటనపై జార్ఖండ్‌లో రైతులు, కార్మిక సంఘాలు నిరసన

రాంచీ : రెండేండ్ల క్రితం యూపీలోని లఖింపూర్ ఖేరీలో రైతుల హత్యకు వ్యతిరేకంగా జార్ఖండ్ రాజధాని రాంచీలో ట్రేడ్ యూనియన్ సభ్యులు, రైతులు నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో బ్లాక్ డేగా పాటించారు. ప్రధాన నిందితుడైన కేంద్ర మంత్రి అజయ్ మిశ్రాను తొలగించి, ప్రాసిక్యూట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది ఆగస్టు 24న న్యూఢిల్లీలో సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాలు, సమాఖ్యల ఉమ్మడి వేదిక తరపున రైతులు, కార్మికుల అఖిల భారత జాయింట్ కన్వెన్షన్ ఈ పిలుపునిచ్చింది. "మంత్రి, అతని కుమారుడు ఆశిష్ మిశ్రా తేనీ మారణకాండకు సూత్రధారులు. ఈ దాడిలో నలుగురు రైతులు నక్షత్ర సింగ్, గుర్విందర్ సింగ్, లవ్‌ప్రీత్ సింగ్, దల్జీత్ సింగ్, ఒక జర్నలిస్ట్ రమణ కశ్యప్ మరణించారు.

48 గంటల్లో 59 మంది మృతి

మహారాష్ట్రలోని రెండు ప్రభుత్వ ఆస్పత్రుల్లో దారుణం

- ఉన్నత స్థాయి విచారణకు సీఎం ఆదేశం

ముంబయి : మహారాష్ట్ర ప్రభుత్వ ఆస్పత్రుల్లోన మృత్యు ఘంటికలు మోగుతున్నాయి. గత 48 గంటల్లో రెండు ఆస్పత్రుల్లో మొత్తం 59 మరణాలు నమోదయ్యాయి. నాందేడ్‌లోని శంకర్‌రావ్ చవాన్ ఆస్పత్రిలో 35, ఔరంగాబాద్‌లోని ఘాటి ఆస్పత్రిలో 24 మంది మరణించారు. ఈ ఘటనలపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే స్పందించారు. నాందేడ్, ఘాటి మరణాలను తీవ్రంగా పరిగణించారు. ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించారు. మందుల కొరత, వైద్యులు అందుబాటులో లేకపోవడం వల్లే నాందేడ్, ఘాటిలో మరణాలు జరిగాయని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను ఆయన కొట్టిపారేశారు. " దర్యాప్తు కమిటీ కనుగొన్న తర్వాత దోషులు శిక్షించబడతారు. మేము ఈ సంఘటనలను తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఔరంగాబాద్‌లోని నాందేడ్, ఘాటిలోని ఆస్పత్రులను సందర్శించి నివేదిక సమర్పించడానికి మంత్రి, కార్యదర్శి, అధికారుల బందాన్ని పంపాము"అని షిండే చెప్పారు.

అయితే, మందుల కొరత, వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడం వల్లనే 16 మంది చిన్నారులు సహా 35 మంది మృతి చెందారని కాంగ్రెస్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్ ఆరోపించారు. "మరో 70 మంది పరిస్థితి విషమంగా ఉంది. తెలియని కారణాల వల్ల మందుల సరఫరా మరియు వైద్యుల నియామకం నిలిచిపోయి చాలా మంది ప్రాణాలను బలిగొన్నాయని మాకు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతగా నిర్ణయించి, వ్యవస్థను మెరుగుపరచాలి" అని ఆయన అన్నారు.

రాష్ట్ర ప్రజారోగ్య శాఖ ఔషధాల కొనుగోలుకు 40 శాతం కమీషన్ డిమాండ్ చేయడంతో మందుల సరఫరా కాంట్రాక్టు నిలిచిపోయిందని మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే ఆరోపించారు. థానే మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలోని సివిక్ ఆస్పత్రిలో ఇంతకుముందు 17 మంది మరణించారనీ, అయితే అలాంటి విషాదాల నుంచి ఇప్పటివరకు గుణపాఠం నేర్చుకోలేదని ఆయన అన్నారు. "రాష్ట్రంలో ప్రజారోగ్య వ్యవస్థ అవినీతి వ్యాధితో బాధపడుతున్నది. మొత్తం వ్యవస్థ వెంటిలేటర్‌పై ఉంది. ప్రభుత్వాస్పత్రుల్లో సరిపడా వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో పాటు మందుల కొరత కూడా ఉన్నది. ఆస్పత్రుల్లో పరికరాలు పనిచేయక నిరుపయోగంగా ఉన్నాయి. ప్రధాన నగరాల్లో ఆరోగ్య సేవల పరిస్థితి ఇలా ఉంటే గ్రామీణ ఆస్పత్రుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వంపై ఐపీసీ 302 కింద నేరపూరిత హత్య కేసు నమోదు చేయాలి" అని పటోల్ డిమాండ్ చేశారు. ఎంఎన్ఎస్ చీఫ్ రాజ్ థాకరే కూడా ట్రిపుల్ ఇంజన్ ప్రభుత్వం సామాన్య ప్రజలకు ప్రజారోగ్యం అందించడంలో విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రెండేండ్లుగా విచారణ

- 201 మంది సాక్షుల్లో నిలిచింది నలుగురు మాత్రమే
- లఖింపూర్ ఖేరీ ఘటనలో లేని పురోగతి

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన యూపీలోని లఖింపూర్ ఖేరీ ఘటనకు రెండేండ్లు గడిచాయి. ఇందులో ఇప్పటికీ విచారణ కొనసాగుతున్నది. 2021లో తీసుకొచ్చిన వివాదాస్పద మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన నిరసనలో ఎనిమిది మంది మరణించడం దేశవ్యాప్త ఆగ్రహజ్వాలలను రేకెత్తించింది. భారతదేశంలో అత్యధిక జనాభా కలిగిన రాష్ట్రంగా కొన్ని నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అజయ్ కుమార్ మిశ్రాకు చెందిన కారు నిరసన చేస్తున్న రైతుల పైకి ఎక్కించటంతో నలుగురు రైతులు, ఒక స్థానిక జర్నలిస్టు (మరో ముగ్గురు వ్యక్తులు గుంపు చేతిలో మరణించారు) మరణించారు. ఇది దర్యాప్తును పర్యవేక్షించడానికి సుప్రీంకోర్టును ప్రేరేపించింది. మంత్రి కుమారుడు ఆశిష్ మిశ్రా ఈ సంఘటనకు సంబంధించిన ప్రధాన కేసులో కీలక నిందితుడిగా పేర్కొనబడ్డారు. హత్యకు గురైన మరో ముగ్గురితో సంబంధం ఉన్న రెండో కేసు సైతం ఉన్నది. ఇందులో ఒక సంవత్సరం పాటు జైలులో కూడా గడిపారు.

రెండేళ్ల గడిచినా ఈ కేసు విచారణలో పురోగతి కనిపించటం లేదు. ఉన్నత స్థాయి విచారణ స్థానిక కోర్టు ఆధ్వర్యంలో సాగుతున్నది. ఈ కేసులో జనవరి 12న



విచారణ ప్రారంభించిన అదనపు జిల్లా న్యాయమూర్తి సునీల్ కుమార్ వర్మ ముందు 171 మంది ప్రాసిక్యూషన్ సాక్షులలో నలుగురు మాత్రమే తమ వాంగ్మూలాలను నమోదు చేయటం గమనార్హం. దాదాపు 30 మంది సాక్షుల జాబితాను డిఫెన్స్ సమర్పించింది. 2021లో హత్యకు గురైన రైతు గుర్విందర్ సింగ్ తండ్రి జగ్జీత్ సింగ్ ఆ రోజు కోర్టుకు హాజరైన ప్రాసిక్యూషన్ తరపు మొదటి సాక్షి. అప్పటి నుంచి మరో ముగ్గురు సాక్షులు కోర్టు ముందు నిలువగా, ఐదో సాక్షి వాంగ్మూలం కొనసాగుతున్నది.

ఏపీకి విద్యుత్ బకాయిల కేసులో తీర్పు రిజర్వు

ముగిసిన వాదనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



ఏపీకి విద్యుత్ బకాయిలు చెల్లించాలని తెలంగాణకు కేంద్రం ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేసిన కేసులో హైకోర్టులో మంగళవారం వాదనలు ముగిశాయి. తీర్పును రిజర్వు చేస్తున్నట్టు ప్రధాన న్యాయమూర్తి ఆలోక్ ఆరాదే, జస్టిస్ ఎన్ వి.శ్రవణ్ కుమార్‌ల డివిజన్ బెంచ్ ప్రకటించింది. ఏపీకి విద్యుత్ బకాయిలు రూ.344178 అసలు, చెల్లించకపోవడంతో సర్‌చార్జి రూ.3315 14 కోట్లతో కలిపి మొత్తం రూ. 6756.92 కోట్లను 30 రోజుల్లో చెల్లించాలంటూ గత ఆగస్ట 20న కేంద్రం ఉత్తర్వులిచ్చింది. దీనిని తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ విద్యుత్ సంస్థలు హైకోర్టులో సవాల్ చేశాయి. గతంలో హైకోర్టు స్టే ఇచ్చింది. మంగళవారం వాదనలు పూర్తయ్యాయి. రాష్ట్రం తరపున సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్, విద్యుత్తు సంస్థల తరపున వై.రామారావులు వాదనలు వినిపిస్తూ, రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 12 ప్రకారం రెండు రాష్ట్రాల మధ్య వివాదం ఏర్పడితే కేంద్రం జోక్యానికి వీల్లేదన్నారు. దక్షిణ ప్రాంత మండలిలో చర్చల ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. ఏపీ నుంచి తమకు బకాయిలు రావాలన్నారు. కేంద్రం పెత్తనం చేసే క్రమంలోనే ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. ఆ ఉత్తర్వులను రద్దు చేయాలన్నారు. దీనిపై ఏపీ తరపు సీనియర్ లాయర్ సీవీ మోహన్‌రెడ్డి, ఏపీ విద్యుత్తు సంస్థల తరపున సీనియర్ లాయర్ ఎం. విద్యాసాగర్ ప్రతివాదన చేస్తూ గతంలో మాదిరిగా విద్యుత్‌ను తెలంగాణకు ఇవ్వాలని కేంద్రం చెప్పినట్టుగా చేశామనీ, విద్యుత్ బకాయిలు చెల్లించకపోవడంతో తమ విద్యుత్ సంస్థలు ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లిపోతున్నాయని చెప్పారు. కేంద్రం చెప్పిందని 2017 వరకు ఏపీ విద్యుత్ సరఫరా చేసిందన్నారు. కేంద్రం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ సుందరేశన్ వాదిస్తూ విద్యుత్, బొగ్గు వంటి అంశాలపై వివాదం ఏర్పడితే కేంద్రం జోక్యం చేసుకోవచ్చునని చెప్పారు. అందుకే తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులిచ్చినట్టు చెప్పారు. వాదనల తర్వాత హైకోర్టు తీర్పును వాయిదా వేసింది.

16లోగా మానవ హక్కుల కమిషన్ చైర్మెన్ నియామక ప్రక్రియను వివరించండి

రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మెన్, సభ్యుల నియామకంపై ఈ నెల 16లోగా సీఎం, విపక్ష నేతలతో కూడిన కమిటీ ఏం నిర్ణయం తీసుకున్నది చెప్పాలని హైకోర్టు కోరింది. కమిషన్ చైర్మెన్, సభ్యుల నియామకాలు చేసేలా ఉత్తర్వులివ్వాలంటూ సికింద్రాబాద్‌కు చెందిన అద్నాన్ మహ్మద్ వేసిన పిల్‌ను ప్రధాన న్యాయమూర్తి లోక్ అరాదే, జస్టిస్ ఎన్. వి.శ్రవణ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారించింది. రెండు వారాల గడువిస్తే నియామకం గురించి చెబుతామని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది హరేందర్ పరిషద్ అన్నారు. చైర్మెన్ పోస్టుకు 4, జ్యుడిషియల్ సభ్యుల పోస్టుకు 10, నాన్ జ్యుడిషియల్ సభ్యుల పోస్టుకు 64 చొప్పున అప్లికేషన్లు వచ్చాయని తెలిపారు. సీఎం, హోం మంత్రి, ప్రతిపక్ష నేతతో కూడిన కమిటీ పేర్లను ఎంపిక చేయాల్సి ఉందన్నారు. గడువు ఇవ్వరాదని పిటిషనర్ లాయర్ కోరారు. గత 10 నెలలుగా ప్రభుత్వం వాయిదా వేస్తూనే ఉందన్నారు. ఈసారి గడువిస్తే ఎలక్షన్ నోటిఫికేషన్ వచ్చేస్తుందన్నారు. విచారణను ఈనెల 16వ తేదీకి వాయిదా వేస్తున్నామనీ, అప్పటికి కమిటీ నిర్ణయాలు చెప్పాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది.

చెంచు గ్రామాల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేయండి

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని చెంచు గ్రామాలను రెవెన్యూ గ్రామాలుగా గుర్తించే ప్రక్రియను 4 నెలల్లోగా పూర్తి చేయాలని రాష్ట్రానికి హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఆ జిల్లా సంక్షేమ శాఖ చేసిన ప్రతిపాదనలు ఆమోదించలేదని పేర్కొంటూ 2005లో స్వచ్ఛంద సంస్థ శక్తి హైకోర్టులో పిటిషన్ వేసింది. దీనిని ప్రధాన న్యాయమూర్తి అలోక్ ఆరాదే, జస్టిస్ ఎన్.వి.శ్రవణ్ కుమార్‌లతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం విచారించింది. పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది కె.ఎస్.మూర్తి వాదిస్తూ, 2005 నుంచి ఈ పిటిషన్ పెండింగ్‌లో ఉందనీ, ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. 2006లో ఎస్టీ, ఇతర సంప్రదాయ అటవీ నివాసితులు (అటవీ హక్కుల గుర్తింపు) చట్టం రూపొందిందని చెప్పారు. ఇది 2007 నుంచి అమల్లో ఉందన్నారు. అటవీ ప్రాంతంలో ఆవాసం ఉంటున్నవారు అటవీ ఉత్పత్తులను, వనరులను వినియోగించుకునేందుకు చట్టంలో అవకాశం ఉందన్నారు. అటవీ హక్కుల చట్టం అసలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వానికి 4 నెలల గడువిచ్చిన హైకోర్టు విచారణను వాయిదా వేసింది.

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఆప్ ఎంపీ అరెస్ట్

న్యూఢిల్లీ: ఆప్ ఎంపీ సంజయ్ సింగ్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బుధవారం అరెస్ట్ చేసింది. బుధవారం ఉదయం నుండి ఎంపి నివాసంలో ఈడీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఢిల్లీ లిక్కర్‌స్కాం కేసులో అరెస్ట్ చేసినట్లు సమాచారం. సుమారు పదిగంటల పాటు సోదాలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఢిల్లీ లిక్కర్ పాలసీ దర్యాప్తుకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో అరెస్ట్ చేసినట్టు సమాచారం. ఈ కేసులో నిందితుడైన వ్యాపారవేత్త దినేష్ అరోరా అప్రూవర్ గా మారిన తర్వాత సంజయ్ సింగ్ నివాసంపై ఈడి దాడులు నిర్వహించడం గమనార్హం. ఆప్ నేత తనను ఎక్సైజ్ మంత్రిగా ఉన్న మనీష్ సిసోడియాకు పరిచయం చేశారని అరోరా పేర్కొన్నట్లు ఈడి తెలిపింది. ఆప్ పార్టీకి సంబంధించి మూడో కీలక నేత అరెస్ట్ కావడం గమనార్హం. నాలుగు కంపెనీల ద్వారా మనీలాండరింగ్ చేశారనే ఆరోపణలపై ఢిల్లీ మాజీ ఆరోగ్య మంత్రి సత్యేందర్‌జైన్‌ను గతేడాది మేలో అరెస్ట్ చేశారు.

నవతెలంగాణ మానవి 11 కరీంనగర్
www.navatelangana.com
గురువారం 5 అక్టోబర్ 2023

స్వీట్లు అంటే ఇష్టపడని వారుండరు.. ఇంట్లో చేసుకునే స్వీట్లతో పాటు వెరైటీ స్వీట్ల కోసం షాపులకు వెళ్ళి మరీ తెచ్చుకుంటుంటారు. ఇలా కాకుండా ఇంట్లోనే స్వీట్లను వెరైటీగా చేసుకుంటే ఇంకా బాగుంటుంది కదా.. అందుకే ఈ వారం వెరైటీ స్వీట్లను ఎలా తయారు చేసుకోవాలో చూద్దాం...!

తియ్యగా... వెరైటీగా...

ద్రాక్ష హల్వా

కావలసిన పదార్థాలు : నల్లద్రాక్షలు - వంద గ్రాములు, మైదా - పావుకేజీ, చక్కెర - పావుకేజీ, జీడిపప్పుల ముక్కలు - టేబుల్ స్పూను, బాదం ముక్కలు - టేబుల్ స్పూను.

తయారు చేసే విధానం : ముందుగా మైదాపిండిలో కొద్దిగా నీళ్ళు పోసి ముద్దలా కలపాలి. కలిపిన ముద్దలో మూడు కప్పుల నీళ్ళు పోసి పూర్తిగా నీళ్ళలో కలిసేలా బాగా కలిపి పక్కన పెట్టాలి (మైదా పాలుగా అవ్వటానికి). అరగంటకి కలిపిన మైదాలో నీళ్ళు పైకి తేరుకుంటాయి. తేరుకున్న నీరు తీసేస్తే, అడుగున మైదా పాలు వుంటాయి. ద్రాక్షలో గింజలు తీసి మిక్సిలో వేసి జ్యూసలా చేసి ఉంచాలి. ఇప్పుడు స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి చక్కెర, కొద్దిగా నీళ్ళు పోసి పాకం పట్టాలి. తీగ పాకం వచ్చాక మైదా పాలు, ద్రాక్ష జ్యూసు వేసి కలపాలి. మాడిపోకుండా కలుపుతుండాలి. ఇది గట్టిపడి ముద్దలా అవుతుంది. తర్వాత నెయ్యి వేసి కలపాలి. మైదాపాలు, ద్రాక్ష రసం, చక్కెర, నెయ్యి బాగా కలిసి ముద్దలా అయి గిన్నె అంచుల నుంచి విడిపోయినట్లు అవుతుంది. అలా అయినపుడు దింపేసి, ఒక ప్లేటుకి నెయ్యి రాసి దానిలోకి తయారయిన హల్వాను వేసి సమంగా సర్ది, జీడిపప్పు ముక్కలు, బాదం ముక్కలు అద్దుకోవాలి. చల్లారక ముక్కలుగా కట్ చెయ్యాలి.



పనీర్ జిలేబీ

కావలసిన పదార్థాలు : పాలు - ఒక లీటరు, బొంబాయి రవ్వ - రెండు చెంచాలు, మైదా - ఒక చెంచా, నిమ్మరసం - ఒక చెంచా, మిల్క్ పౌడర్ - మూడు చెంచాలు, యాలకుల పొడి - ఒక చెంచా, బేకింగ్ పౌడర్ - చిటికెడు, నెయ్యి - ఒక చెంచా, చక్కెర - ఒకటిన్నర కప్పు, నీళ్లు - ఒకటిన్నర కప్పు, నూనె - వేయించడానికి సరిపడా.

తయారు చేసే విధానం : మూడు నాలుగు చెంచాల పాలలో బొంబాయి రవ్వ వేసి ఉంచాలి. మిగతా పాలను స్టౌ మీద పెట్టాలి. కాగిన తరువాత నిమ్మరసం వేయాలి. పాలు విరిగిపోయిన తర్వాత ఓ పల్చని గుడ్డలో వేసి గట్టిగా కట్టి, దానిమీద బరువు పెట్టాలి. నీరంతా పోయి గట్టి పదార్థం మిగులుతుంది. దీనిని మెత్తగా అయ్యేవరకూ చేతితో బాగా మెదపాలి. తర్వాత దీన్ని ఓ గిన్నెలో వేసి... పాలలో నానబెట్టిన బొంబాయి రవ్వ, మిల్క్ పౌడర్, నెయ్యి, యాలకుల పొడి వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని కొద్దికొద్దిగా తీసుకుని, అరచేతుల మధ్య ఉంచుకుని మెదుపుతూ, సన్నగా పొడుగ్గా చేసుకోవాలి. తర్వాత వీటిని జిలేబీ చక్రాల్లా చుట్టాలి. ఎక్కడా పగుళ్లు లేకుండా చూసుకోవాలి. అన్నిటినీ అలా చేసుకున్న తర్వాత నూనెలో డీప్ ఫ్రై చేసుకుని పక్కన పెట్టుకోవాలి. తర్వాత గిన్నెలో చక్కెర వేసి, నీళ్లు పోసి స్టౌ మీద పెట్టాలి. లేత పాకం అయ్యాక... వేయించుకున్న జిలేబీలను వేయాలి. పాకం బాగా పీల్చుకున్న తర్వాత వేరే గిన్నెలోకి మార్చుకుని తినొచ్చు.



స్వీట్ క్యారెట్ క్రాకర్స్

కావలసిన పదార్థాలు : క్యారెట్ తురుము - ఒకటిన్నర కప్పు, చక్కెర - ముప్పావు కప్పు, మైదాపిండి - ఒక కప్పు, నీళ్ల - అరకప్పు, చీజ్ తురుము - అరకప్పు, కోడిగుడ్లు - రెండు.

తయారు చేసే విధానం : క్యారెట్ తురుమును గిన్నె వేసి అందులో నీళ్ల పోసి స్టౌ మీద పెట్టాలి. క్యారెట్ బాగా ఉడికిన తర్వాత నీటిని ఒంపేసి తురుముని ఆరబెట్టాలి. చల్లారిన తర్వాత క్యారెట్, కోడిగుడ్డు సొన, చీజ్, చక్కెర కలిపి మిక్సీ జార్‌లో వేసి మెత్తగా బ్లెండ్ చేసుకోవాలి. దీన్ని ఓ గిన్నెలోకి తీసుకుని, కొద్దికొద్దిగా మైదాపిండి వేసి కలుపుతూ ఉండాలి. చపాతీ పిండిలా అయ్యేవరకూ బాగా కలుపుకుని పక్కన పెట్టేయాలి. అరగంట తర్వాత కొద్దికొద్దిగా మిశ్రమాన్ని తీసుకుని, ఉండలు చేసుకుని, చపాతీల్లా ఒత్తాలి. వీటిని నాలుగు వైపులా చాకుతో కోసేసి, చిన్న చిన్న క్యూబ్స్‌లా కట్ చేసుకోవాలి. మైక్రో ఓవెన్ ఉంటే 350 డిగ్రీల వద్ద పదిహేను నుంచి ఇరవై నిమిషాల పాటు బేక్ చేసుకోవాలి. లేకపోతే నూనెలో డీప్ ఫ్రై చేసుకోవచ్చు.



ఫ్రూట్ హల్వా

కావలసిన పదార్థాలు : అరటిపండు ముక్కలు - పావుకప్పు, పైనాపిల్ ముక్కలు - పావుకప్పు, యాపిల్ ముక్కలు - అరకప్పు, బొంబాయి రవ్వ - అకటిన్నర కప్పు, నీళ్లు - మూడున్నర కప్పులు, చక్కెర - పావుకప్పు, నెయ్యి - నాలుగు చెంచాలు, యాలకుల పొడి - అరచెంచా, జీడిపప్పు, కిస్‌మిస్ - గుప్పెడు.

తయారు చేసే విధానం : స్టౌ మీద కడాయి పెట్టి చెంచాడు నెయ్యి వేయాలి. వేడెక్కాక జీడిపప్పు, కిస్‌మిస్‌లను వేయించి పక్కన పెట్టుకోవాలి. తర్వాత బొంబాయి రవ్వను కూడా వేసి పచ్చి వాసన పోయే వరకూ వేయించి తీసేయాలి. తర్వాత మరో చెంచా నెయ్యి వేసి పండ్ల ముక్కలన్నిటినీ వేసి దోరగా వేయించాలి. వీటిని చల్లారబెట్టి మెత్తగా గ్రైండ్ చేయాలి. తర్వాత స్టౌ మీద గిన్నె పెట్టి నీళ్లు, చక్కెర వేయాలి. మరుగుతున్నప్పుడు రవ్వ వేయాలి. ఉండలు కట్టకుండా కలుపుతూ సన్నని మంట మీద ఉడికించాలి. రవ్వ మెత్తబడిపోయిన తర్వాత పండ్ల గుజ్జును కూడా వేయాలి. ఉండలు రాకుండా బాగా కలుపుతూ ఉడికించాలి. నీళ్లన్నీ ఇగిరిపోయి దగ్గరగా అయ్యాక మిగతా నెయ్యి, జీడిపప్పు, కిస్‌మిస్ వేసి కలపాలి. చివరగా యాలకుల పొడి చల్లి దించేసుకోవాలి. కావాలంటే కాస్త ఫుడ్ కలర్ కూడా వేసుకోవచ్చు.





కలబంద గుజ్జుతో...

కలబంద ఆరోగ్యానికి చాలా ఉపయోగకారి... దీన్ని చర్మ సంరక్షణతో పాటు ఆరోగ్యానికి కూడా ఉపయోగిస్తారు. కాలాలతో సంబంధం లేకుండా కలబందను ఉపయోగించి అద్భుత ప్రయోజనాలు పొందవచ్చు. అవేంటంటే...

→ చర్మాన్ని సూర్యరశ్మి నుంచి కాపాడుకోవడానికి, కాంతివంతంగా ఉంచుకోవడానికి కలబంద గుజ్జు చాలా ఉపయోగ పడుతుంది. ఇది మంచి కూలింగ్ ఏజెంట్‌గా పని చేస్తుంది. ప్రస్తుతం కాస్మెటిక్ రంగంలో కలబందకు మంచి డిమాండ్ ఉంది. ఫేస్ మాయిశ్చర్‌గా, కేశాల సంరక్షణ కోసం బాగా ఉపయోగపడుతుంది. బట్టతలను నివారి స్తుంది. మొటిమలను తొలగిస్తుంది.

→ చర్మం ముడతలు పడటాన్ని నిరో ధిస్తుంది. కంటికింద నలుపును పోగొడు తుంది. ప్రెగ్నెన్సీ అనంతరం వచ్చే ముడత లను తొలగిస్తుంది. సోరియాసిస్, గజ్జి తది తర చర్మ సంబంధిత వ్యాధులను అరికడుతుంది.

→ అధిక బరువు తగ్గాలనుకునే వారు వ్యాయామంతో పాటు కలబంద రసాన్ని తరచుగా తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. కలబంద శరీర అవయవాల చుట్టూ ఉండే కొవ్వును కరిగిస్తుంది. ఈ కలబంద రసం జీర్ణక్రియలు పెంచటానికి చక్కగా పనిచేస్తుంది. కప్పు వేడినీళ్ళల్లో కలబంద రసం, అల్లం ముక్క వేసుకుని బాగా వేడిచేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ప్రతిరోజూ సేవిస్తే మంచి ఉపశమనం లభిస్తుంది.

→ గ్రీన్ టీలో యాంటీ ఆక్సిడెంట్స్ అధికంగా ఉంటాయి. అధిక బరువును తగ్గించుటలో గ్రీన్ టీ దివ్యౌషధంగా సహాయపడుతుంది. అలానే గ్రీన్ టీలో కలబంద రసం వేసుకుని వేడిచేసి ఉదయాన్నే, రాత్రివేళ తీసుకుంటే ఆరోగ్యానికి చాలా మంచిదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

జుట్టు తెల్లబడకుండా...



వయసు పెరిగే కొద్ది వెంట్రుకలు తెల్లబడటం ప్రారంభమవుతుంది. కానీ ప్రస్తుత కాలంలో చిన్న వయసులోనే జుట్టు రంగు మారటం వల్ల చాలా మంది రంగు వేయటం ప్రారంభిస్తున్నారు. కానీ కొన్ని ఆహార పదార్థాలను ప్రణాళికలో కలుపుకుంటే రంగు వేసుకోవలసిన అవసరమే ఉండదు. ఆరోగ్యకరమైన ఆహారం ద్వారా జుట్టు తెల్లబడటాన్ని నివారించవచ్చు. అవేంటంటే...

పచ్చని ఆకుకూరలు : పచ్చని ఆకుకూరలు తలపై చర్మం పునరుద్ధపరిచే విటమిన్ 'బి' లను కలిగి ఉంటాయి. సాధారణంగా ఎర్రరక్తకణాల ఉత్పత్తికి, వెంట్రుక అన్ని భాగాలకు రక్తం పంపిణి చేయటానికి తలపై చర్మానికి విటమిన్ 'బి-6', విటమిన్ 'బి-12' లు అవసరం. మన జుట్టు నల్లగా ఉండటానికి లేదా సహజ రంగులో ఉండటానికి విటమిన్ 'బి-2' పై ఆధారపడి ఉంటుంది.

సాల్మన్ చేప : దీనిని జుట్టు తెల్లబడకుండా ఆపే ఆహార పదార్థాలలో ఇది ఒకటి. వెంట్రుకల ఆరోగ్యానికి కావలసిన హార్మోన్‌లను స్రవించుటకు సాల్మన్ చేపలో ఉండే సెలీనియం ఎంతో ఉపయోగపడుతుంది. వారంలో రెండు లేదా మూడు సార్లు సాల్మన్ చేపను తింటే మంచి ఫలితం ఉంటుంది.

గుడ్లు : జుట్టు తెల్లబడకుండా ఉండటానికి విటమిన్ 'బి-12' సహకరిస్తుంది. ఇది గుడ్డులో లభిస్తుంది. నిజానికి ఫ్రీరాడికల్‌లు మన వెంట్రుకలను తెల్ల రంగులోకి మార్చుతాయి. కావున రోజు తినే ఆహార పదార్థాలలో ఒక గుడ్డును తినటం వలన జుట్టు తెల్లబడటాన్ని కొంత వరకు నివారించవచ్చు.

ఐక్య పోరాటానికి తలొంచిన సర్కార్

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ అంగన్‌వాడీ ఆయాలకు రూ.లక్ష, టీచర్లకు రూ.2 లక్షలు చెల్లిస్తామనీ, 65 ఏండ్లలోపు రిటైరయ్యే అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు వీఆర్‌ఎస్ వర్తింప చేస్తామనీ, తెలంగాణ రాష్ట్ర రెండవ పీఆర్సీలో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రకటించిన ఐదు శాతం ఐఆర్‌ను అందరికీ వర్తింపచేస్తామని మంత్రులు హామీ ఇచ్చారు. దానితో పాటు సమ్మెకాలపు వేతనాన్ని కూడా చెల్లిస్తామని స్పష్టం చేశారు. ప్రమాదబీమా గురించి ఐసీడీఎస్ మంత్రి సత్యవతి రాథోడ్‌తో చర్చించి, వేతనాల పెంపు అంశాన్ని ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా ప్రయత్నిస్తామంటూ స్పష్టమైన హామీలు ఇచ్చారు. మరికొన్ని సమస్యల పరిష్కారానికి కొంత గడువు కావాలని అభ్యర్థించారు. దీనికి జేఏసీ నేతలు సానుకూలంగా స్పందించారు. అనంతరం సుందరయ్య పార్కు వద్ద జరిగిన భారీ బహిరంగసభలో జేఏసీ నేతలు పాల్గొని మాట్లాడారు. మంత్రులతో జరిగిన చర్చల సారాంశాన్ని వివరించారు. 24 రోజులు సమ్మె, అనంతర విజయాలను వారికి వివరించారు. సంఘటిత శక్తితో సాధించలేనిది ఏదీ లేదంటూ వారిలో ఉత్తేజాన్ని నింపారు. సమ్మెను విరమిస్తున్నట్టు ప్రకటించారు. భవిష్యత్ పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రామిక మహిళ సమన్వయ కమిటీ (సీఐటీయూ) కన్వీనర్ ఎస్ రమ, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కే ఈశ్వరరావు, కార్యదర్శి టీ వీరారెడ్డి, ఏఐటీయూసీ జాతీయ నాయకురాలు బీవీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

గరీబోళ్లపై నిర్బంధాన్ని ఆపాలి

(మొదటిపేజీ తరువాయి)

పడుతున్నారన్నారు. పేదరికంలో మగ్గుతున్న వారంతా అద్దెలు కట్టలేక ప్రభుత్వ స్థలంలో గుడిసెలేసుకుని జీవించాలనుకుంటే రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం గుడిసెల్ని కూల్చేయడం అన్యాయమన్నారు. పేదలపై కేసులు పెట్టి జైల్లో పెడతామంటూ భయభ్రాంతులకు గురి చేయడం అప్రజాస్వామిక చర్య అన్నారు. 615 సర్వే నెంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిని బీఆర్‌ఎస్ నాయకులు, పెత్తందారులు ఎకరాల కొద్దిగా ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ప్రయివేట్ కార్యాలయాలు, భవనాలు నిర్మిస్తున్న పెద్దలపై ఎలాంటి చర్యలూ తీసుకోని రెవెన్యూ, పోలీసు యంత్రాంగం పేదలేసుకున్న గుడిసెల్ని మాత్రం కూల్చేసి నిర్బంధాన్ని కొనసాగించడం దారుణమన్నారు. పూట గడవని పేదలను ఇబ్బందులపాలు చేయడం మానుకోవాలన్నారు.

కంది మండలంలో వందల ఎకరాల్లో ప్రభుత్వ భూములున్నాయని, వాటిని నిరుపేదలకు ఇండ్ల స్థలాల కోసం ఎందుకు కేటాయించడంలేదని ప్రశ్నించారు. కంది మండలంలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇండ్లను ఇతర మండలాలకు చెందిన వారికి ఇవ్వడం సరైంది కాదన్నారు. కందిలో నివాసముంటున్న పేదల్ని గుర్తించి ఇండ్లు, ఇండ్ల స్థలాలివ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు మాట్లాడుతూ.. పేదలకు ఇండ్ల స్థలాలు దక్కే వరకు తమ పార్టీ అండగా ఉండి పోరాడుతుందన్నారు. కబ్జాలకు గురవుతున్న ప్రభుత్వ భూముల్ని స్వాధీనం చేసుకుని పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అనంతరం వందలాది మంది పేదలు కంది తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఇండ్ల స్థలాలివ్వాలని అధికారుల్ని నిలదీశారు. వ్యక్తిగత దరఖాస్తుల్ని తహసీల్దార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.రామచంద్రం, ఎం.నర్సింహులు, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్యం, నాయకులు కృష్ణ, రాజు, పేదలు పాల్గొన్నారు.

రసాయనశాస్త్రంలో ముగ్గురికి నోబెల్

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటనలో తెలిపింది.

అయితే రసాయన శాస్త్రంలో బహుమతి గ్రహీతల పేర్లు ప్రకటనకు ముందే లీక్ అయినట్టు.. కొన్ని గంటల ముందు స్వీడిష్ మీడియా సంస్థలు ప్రకటించాయి. ఇలాంటి ఘటనలు అరుదుగా జరుగుతుంటాయని, నోబెల్ కమిటీ ప్రకటించేంతవరకు విజేతల పేర్లు బయటకు రాకుండా చూసేందుకు తీవ్రంగా యత్నిస్తుంటాయని సంబంధిత వర్గాలు తెలిపాయి.

కేసీఆర్‌కు అధిష్టానం మోడీనే


(మొదటిపేజీ తరువాయి)

మధ్య పొత్తు కుదిరిందని, సీట్ల సర్దుబాటు కూడా జరిగిందని వ్యాఖ్యానించారు. ఎంఐఎం ఎటువైపో తేల్చుకోవాలని కోరారు. బీఆర్‌ఎస్ ఏడు స్థానాల్లో, బీజేపీ తొమ్మిది స్థానాల్లో, ఎంఐఎం ఒక స్థానంలో పోటీ చేసేలా అవగాహన కుదిరిందని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే, కార్యదర్శి మన్సూర్ అలీఖాన్, మాజీ ఎంపీలు అంజన్‌కుమార్‌యాదవ్, మల్లు రవి, పొన్నం ప్రభాకర్, వార్‌రూమ్ ఇంచార్జి రోహన్‌గుప్తాతో కలిసి రేవంత్ విలేకర్లతో మాట్లాడారు. బీఆర్‌ఎస్‌కు మద్దతుపై ఎంఐఎం పునరాలోచించుకోవాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటే...మోడీ, కేసీఆర్‌ది ఫెవికాల్ బంధంల వారిది గల్లీలో కుస్తీ, ఢిల్లీలో దోస్తీ అని ఎద్దేవా చేశారు. అలాంటి వారికి అసదుద్దీన్ ఎలా మద్దతు ఇస్తారంటూ ప్రశ్నించారు. ఎంఐఎం ఎవరివైపు నిలబడుతుంది...బీజేపీతో దోస్తీ కడుతున్న బీఆర్‌ఎస్‌తోనా? బీజేపీ, బీఆర్‌ఎస్‌ను ఓడించాలంటున్న కాంగ్రెస్‌తోనా స్పష్టం చేయలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్, బీజేపీ ఫెవికాల్ బంధం గురించి నిజామాబాద్ సాక్షిగా మోడీ బయటపెట్టారని వ్యాఖ్యానించారు. బీఆర్‌ఎస్ అంటే బీజేపీ రిస్తేదార్ సమితి అని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ముందే చెప్పారని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని సర్వేలు పేర్కొంటున్న నేపథ్యంలో ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చి కేసీఆర్‌ను గెలిపించేందుకే ప్రధాని మోడీ తెలంగాణలో పర్యటిస్తున్నారని విమర్శించారు. పదేండ్లలో విభజన హామీల్లో ఏ ఒక్క హామీ నెరవేర్చే ప్రయత్నం చేయలేదని బీజేపీ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను మోడీ అపహాస్యం చేశారన్నారు.

ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవితను అరెస్టు చేయొద్దని కేసీఆర్ అడిగిన విషయాన్ని కూడా మోడీ చెప్పాల్సిందని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ ఆదేశాలతోనే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని మార్చారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ దోపిడీలో బీజేపీకి వాటాలు వెళుతున్నాయి కాబట్టే మోడీ చర్యలు తీసుకోవడం లేదన్నారు. కేసీఆర్ అవినీతిపై ఈడీ, సీబీఐ, ఐటీ విచారణ చేయడం లేదని విమర్శించారు. కేసీఆర్‌కు నీళ్లు అంటే.. కవిత కన్నీళ్లు గుర్తొస్తాయనీ, నిధులు అంటే దోపిడీ సొమ్ము, నియామకాలు అంటే కొడుకును సీఎం చేయడం గుర్తొస్తాయని విమర్శించారు. కేసీఆర్ కొల్లగొట్టిన సొమ్ములతోనే మోడీకి ఆయన దర్బారులో సన్మానం చేశారని విమర్శించారు. ఇదంతా కనిపించే ఒకవైపు మాత్రమేననీ, మరి ఎన్నికల కోసం పంపించిన కనిపించని వేల కోట్ల సంగతేంటని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ దోపిడీపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిజామాబాద్ సభలో మోడీ వ్యాఖ్యలతో కేసీఆర్ అధిష్టానం నరేంద్రమోడీ అని స్పష్టత వచ్చిందన్నారు. బండారం బయటపడిందనే కాంగ్రెస్‌పై బీజేపీ, బీఆర్‌ఎస్ ఆరోపణలు చేస్తున్నారన్నాయని చెప్పారు. వాళ్లిద్దరూ కాంగ్రెస్‌ను ఉమ్మడి శత్రువుగా భావిస్తున్నారని చెప్పారు. మోడీ చెప్పింది నిజమో, కాదో కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల దృష్టిని మరల్చడానికే నాపై హరీశ్‌రావు ఆరోపణలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. వాళ్ళు జైలుకెళ్లే టైం వచ్చిందనే తనపై ఆరోపణలు చేస్తున్నారని చురకలు అంటించారు. కొడంగల్‌లో పదేండ్లు నేను చేసిన అభివృద్ధి... ఐదేండ్లలో వాళ్ల చేసిన అభివృద్ధిపై చర్చ పెడదామని సవాలు విసిరారు. కోస్గి, కొడంగల్, మద్దూరులకు ఆస్పతులు తీసుకొస్తే వాటిని వాళ్ల ఇప్పటికీ పూర్తి చేయలేదన్నారు. 'నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే బస్‌డిపో కోసం 5 ఎకరాలు కొని ఇచ్చామన్నారు. బిల్లా, రంగాలు ఇద్దరూ కొడంగల్ రావాలి. కొడంగల్ అభివృద్ధిపై చర్చకు తాను సిద్ధమని హరీశ్‌రావుకు రేవంత్ సవాలు విసిరారు.

భూసేకరణ నోటిఫికేషన్‌కు ముందు విధిగా గ్రామసభ : హైకోర్టు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



షెడ్యూల్డ్ ఏరియాల్లో భూసేకరణ నోటిఫికేషన్లను రద్దు చేస్తూ హైకోర్టు తీర్పు చెప్పింది. షెడ్యూల్ ప్రాంతాల్లో భూసేకరణకు ప్రాథమిక నోటిఫికేషన్ జారీకి ముందు విధిగా గ్రామసభ అనుమతి పొందాలన్న నిబంధనను అధికారులు అమలు చేయలేదని తప్పుపట్టింది. షెడ్యూల్ ఏరియా భూసేకరణ చట్టంలోని సెక్షన్ 41(3) ప్రకారం గ్రామసభ తప్పనిసరని తీర్పు చెప్పింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మణుగూరు, సమితి సింగారం గ్రామాల్లో రైల్వేలైన్ నిమిత్తం చేపట్టిన భూసేకరణకు గ్రామసభ అనుమతి పొందకపోవడాన్ని తప్పుపట్టింది. అదే విధంగా మేడారంలో వీఐపీ గెస్ట్ హౌస్ నిర్మాణం నిమిత్తం చేపట్టిన భూసేకరణ నోటిఫికేషన్, దిండి ప్రాజెక్టు నిమిత్తం నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట మండలం మన్నేవారిపల్లిలోని ఒక తండాలో భూసేకరణకు ఇచ్చిన ప్రాథమిక నోటిఫికేషన్‌ను కూడా రద్దు చేసింది. ఈ మేరకు జస్టిస్ ఎం.సుధీర్‌కుమార్ ఇటీవల వేర్వేరు తీర్పులు చెప్పారు. షెడ్యూల్ ప్రాంతాల్లో గ్రామసభ అనుమతి లేకుండా భూసేకరణ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన వేర్వేరు పిటిషన్లను అనుమతిస్తూ తీర్పు చెప్పారు.

అసత్య ఆరోపణలు

(మొదటిపేజీ తరువాయి)

సమాచారం విలువ ఎంతో చెప్పలేదు. ఎలాంటి నిబంధనలు పాటించకుండా న్యూస్‌క్లిక్ ప్రాంగణం, ఉద్యోగుల నివాసాల నుండి ఎలక్ట్రానిక్ పరికరాలు స్వాధీనం చేసుకున్నారు. కార్యకలాపాలను కొనసాగనివ్వకుండా మమ్మల్ని నిరోధించే ప్రయత్నంలో మా కార్యాలయాన్ని కూడా మూసివేశారు" అని న్యూస్‌క్లిక్ ఆ ప్రకటనలో తెలిపింది.


"మా వెబ్‌సైట్‌లో చైనా అనుకూల ప్రచారానికి పాల్పడ్డామనే అభియోగంపై చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద కేసు నమోదు చేశారని తెలుసుకున్నాము. పాత్రికేయుల స్వాతంత్ర్యాన్ని గౌరవించడం తెలియని, హేతుబద్ధమైన విమర్శలను దేశద్రోహంగా లేదా దేశ వ్యతిరేక ప్రచారంగా పరిగణించే కేంద్ర ప్రభుత్వ దుర్మార్గ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాము" అని ఆ ప్రకటన పేర్కొంది.

"2021 నుండి ప్రభుత్వానికి చెందిన వివిధ సంస్థలను ఉపయోగించి వరుస చర్యలతో న్యూస్‌క్లిక్‌ను ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుంది. మా కార్యాలయాలు, ఉద్యోగుల నివాసాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఢిల్లీ పోలీసుల ఆర్థిక నేరాల విభాగం, ఆదాయపు పన్ను శాఖ దాడులు నిర్వహించాయి. పరికరాలు, లాప్‌టాప్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఫోన్లు మొదలైన వాటిని గతంలోనే స్వాధీనం చేసుకున్నారు. ఈ-మెయిల్స్‌ను, సమాచార మార్పిడులను మైక్రోస్కోప్‌లో విశ్లేషించారు. బ్యాంక్ స్టేట్‌మెంట్లు, ఇన్వాయిస్‌లు, చేసిన ఖర్చులు, న్యూస్‌క్లిక్ ఆదాయ వనరులను ఎప్పటికప్పుడు ప్రభుత్వ సంస్థలు పరిశీలిస్తున్నాయి. మా సంస్థకు చెందిన డైరెక్టర్లను, ఇతర వ్యక్తులను ప్రభుత్వ ఏజెన్సీలు గంటల తరబడి విచారించాయి" అని వివరించింది.

"ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ గత రెండు సంవత్సరాలుగా మనీ లాండరింగ్‌కు పాల్పడుతోందని ఆరోపిస్తూ న్యూస్‌క్లిక్‌పై ఈడీ ఫిర్యాదు దాఖలు చేయలేకపోయింది. ఐపీసీ కింద న్యూస్‌క్లిక్‌పై నేరారోపణ చేస్తూ ఢిల్లీ పోలీసులకు చెందిన ఆర్థిక నేరాల విభాగం ఛార్జ్‌షీట్ దాఖలు చేయలేకపోయింది. ఆదాయపుపన్ను శాఖ న్యాయస్థానాల ఎదుట తన చర్యలను సమర్థించుకోలేకపోయింది. గత కొన్ని నెలలుగా ప్రబీర్ పుర్కాయస్థను ఈ సంస్థలు కనీసం విచారణకు కూడా పిలవలేదు" అని న్యూస్‌క్లిక్ తెలిపింది.

"న్యూస్‌క్లిక్‌కి సంబంధించిన సమాచారం, పత్రాలు, సమాచార మార్పిడికి సంబంధించిన వివరాలు తన వద్ద ఉన్నప్పటికీ ఆరోపణలను ప్రభుత్వం రుజువు చేయలేకపోయింది. న్యూయార్క్ టైమ్స్‌లో వచ్చిన ప్రేరేపిత, బూటకపు కథనాన్ని అడ్డు పెట్టుకొని క్రూరమైన ఉపా చట్టాన్ని అమలు చేయడానికి, సంస్థ కార్యాలయాన్ని మూసివేయడానికి పూనుకుంది. దేశ వాస్తవ చిత్రాన్ని నిర్భయంగా, స్వతంత్రంగా అందించే గొంతులను నొక్కేయాలని ప్రయత్నిస్తోంది. రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు, ఇతర అణగారిన వర్గాల తరపున మాట్లాడే వారిని అణచివేయడంలో భాగంగానే మాపై దాడి జరిగింది" అని న్యూస్‌క్లిక్ పేర్కొంది.

"న్యూస్‌క్లిక్ ఒక స్వతంత్ర వార్తా వెబ్‌సైట్. మా వార్తలు, వ్యాసాలు ఎప్పుడూ వృత్తిపరంగా అత్యున్నత ప్రమాణాలపై ఆధారపడి ఉంటుంది. న్యూస్‌క్లిక్ ప్రత్యక్షంగా కానీ లేదా పరోక్షంగా కానీ ఏదైనా చైనా సంస్థ లేదా ఆ దేశ అధికారుల ఆదేశానుసారం ఎటువంటి వార్తలను, సమాచారాన్ని ప్రచురించదు. న్యూస్‌క్లిక్ తన వెబ్‌సైట్‌లో చైనా అనుకూల ప్రచారం చేయదు. న్యూస్‌క్లిక్ తన వెబ్‌సైట్‌లో పొందుపరచిన వార్తలు, వ్యాసాలకు సంబంధించి నెవిల్లే రాయ్ సింఘమ్ నుండి ఆదేశాలు తీసుకోదు. న్యూస్‌క్లిక్‌కు అందిన నిధులన్నీ సక్రమమైన బ్యాంకింగ్ పద్ధతుల ద్వారా చేరుతున్నవే. ఈ వివరాలన్నింటినీ చట్ట ప్రకారం, ఆర్‌బీఐ నిబంధనల మేరకు ఢిల్లీ హైకోర్టు ఆదేశానుసారం అధికారులకు అందజేశాము" అని తెలిపింది. "న్యూస్‌క్లిక్ వెబ్‌సైట్‌లో ఇప్పటివరకూ ప్రచురించిన అన్ని వార్తలు, వ్యాసాలు ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్నాయి. వీటిని ఎవరైనా చూడవచ్చు. చైనా అనుకూల ప్రచారంగా భావించే ఒక్క కథనాన్ని కానీ, వీడియోను కానీ ఢిల్లీ పోలీసుల ప్రత్యేక విభాగం ప్రస్తావించలేదు. ఢిల్లీ అల్లర్లు, రైతుల నిరసనలు వంటి ఘటనలపై ప్రత్యేక విభాగం వేసిన ప్రశ్నల తీరు చూస్తుంటే ఈ వ్యవహారం వెనుక దురుద్దేశం, హానికరమైన ఉద్దేశం ఉన్నట్లు అర్థమవుతోంది" అని విమర్శించింది. కోర్టులు, న్యాయ ప్రక్రియలపై తమకు పూర్తి విశ్వాసం ఉన్నదని, రాజ్యాంగం మేరకు పత్రికా స్వేచ్ఛ కోసం, తమ జీవితాల కోసం పోరాడతామని న్యూస్‌క్లిక్ స్పష్టం చేసింది.





ఈ దాడులపై జోక్యం చేసుకోండి

న్యూఢిల్లీ : దేశంలో పత్రికా స్వేచ్ఛపై జరుగుతున్న దాడుల పట్ల మీడియా సంస్థలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ విషయంలో జోక్యం చేసుకోవాలంటూ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు బుధవారం లేఖ రాశాయి. పాత్రికేయుల ఫోన్లు, లాప్‌టాప్‌లను ఇష్టానుసారం స్వాధీనం చేసుకోకుండా నిలువరించేందుకు నిబంధనలను, జర్నలిస్టుల విచారణకు సంబంధించి మార్గదర్శకాలను రూపొందించడంలో సాయపడాలని విజ్ఞప్తి చేశాయి. చట్ట విరుద్ధంగా వ్యవహరించే ప్రభుత్వ సంస్థలు, అధికారుల్లో జవాబుదారీతనం ఉండేలా చూడాలని కోరాయి. పాత్రికేయులు చట్టానికి అతీతులని తాము భావించడం లేదని, చట్టానికి లోబడి తమను విచారించాలని మాత్రమే కోరుతున్నామని తెలిపాయి. ప్రధాన న్యాయమూర్తికి రాసిన లేఖపై 16 పాత్రికేయ సంఘాలు సంతకాలు చేశాయి.దేశంలోని పలువురు పాత్రికేయులు నేడు ప్రతీకార ప్రమాదాన్ని ఎదుర్కొంటూ విధులు నిర్వర్తిస్తున్నారని ఆ లేఖలో జర్నలిస్టు సంఘాలు తెలిపాయి. న్యూస్‌క్లిక్ పోర్టల్ పాత్రికేయులు, ఉద్యోగుల నివాసాలపై జరిగిన దాడులను, వారి నుండి ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్న వైనాన్ని వివరించాయి. 'పత్రికలకు వ్యతిరేకంగా ప్రభుత్వ సంస్థలు పలు సందర్భాలలో అధికార దుర్వినియోగానికి పాల్పడిన విషయం మీకు తెలిసిందే. న్యూస్‌క్లిక్ పాత్రికేయులపై నిర్దిష్టత లేని నేరారోపణలు చేశారు. వాటితో సంబంధం లేని ప్రశ్నలు అడిగారు. ఉపా కింద అరెస్టయిన జర్నలిస్టులు బెయిల్ పొందడానికి ముందు నెలల తరబడి జైళ్లలో మగ్గాల్సి వస్తోంది. సిద్ధిక్ కప్పన్ అనే పాత్రికేయుడు బెయిల్ పొందడానికి ముందు 28 నెలలు జైలులో గడిపారు. ప్రభుత్వ చర్యలు ఇలాగే కొనసాగితే వాటిని సరిదిద్దే పరిస్థితే ఉండదు' అని వివరించాయి. ఈ లేఖపై వివిధ నగరాలకు చెందిన ప్రెస్‌క్లబ్‌లు, మీడియా సంస్థలు సంతకాలు చేశాయి.

జ్యోతి సురేఖకు స్వర్ణం



- నీరజ్ చోప్రాతోపాటు 4x400మీ. పరుగులోనూ పసిడి

భారత్ ఖాతాలో రికార్డు పతకాలు

హాంగ్జౌ: 19వ ఆసియా క్రీడల్లో భారత్‌కు పతకాల పంట పండుతోంది. ఈసారి 100 పతకాలపై గురి పెట్టిన భారత్ ఆ ఫీట్‌ను అందుకొనే దిశగా దూసుకెళ్తోంది. ఈ క్రమంలో తొలి రోజు నుంచి పతకాలు కొల్లగొడుతోంది. గురువారం భారత్‌కు మరో 12 పతకాలు దక్కాయి. దీంతో భారత్‌కు దక్కిన పతకాల సంఖ్య 81కు చేరింది. తాజాగా ఆర్చరీ మిక్స్‌డ్, జావెలిన్, 4x400మీ. పరుగులో స్వర్ణ పతకాలు దక్కాయి. దీంతో భారత్ 18స్వర్ణ, 31రజత, 32కాంస్యాలతో నాల్గో స్థానంలో నిలిచింది. అదే క్రమంలో ఇండోనేషియా వేదికగా జరిగిన 18వ ఆసియా క్రీడల్లో దక్కిన అత్యధిక(70) పతకాల రికార్డు (16స్వర్ణ, 23రజత, 31కాంస్య) తాజాగా బ్రద్దలైంది. గురువారం జరిగిన పురుషుల జావెలిన్ త్రో ఫైనల్లో నీరజ్ చోప్రా ఈటెను 88.88మీటర్ల దూరం విసిరి పసిడి పతకాన్ని చేజిక్కించుకున్నాడు. మరో త్రోయర్ కిషోర్ కుమార్ జెనా నాలుగో ప్రయత్నంలో ఈటెను 87.54 మీటర్ల దూరం విసిరి రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని సొంతం చేసుకున్నాడు. ఇక జపాన్‌కు చెందిన జావెలిన్ త్రోయర్ డీన్ రొడెరిక్ జెంకీ తన ఈటెను 82.68 మీటర్ల దూరం విసిరి మూడో స్థానంలో నిలిచి కాంస్యం దక్కించుకున్నాడు.



జ్యోతి సురేఖ-ఓజాస్‌కు స్వర్ణం..

ఆసియా క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ అద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. బుధవారం జరిగిన మిక్స్‌డ్ విభాగంలో ఓజాస్ దియోతలేతో కలిసి బరిలోకి దిగిన జ్యోతి సురేఖ బంగారు పతకాన్ని సాధించింది. ఆర్చరీ మిక్స్‌డ్ ఈవెంట్ ఫైనల్లో ఫేవరెట్ దక్షిణ కొరియా ఆటగాళ్లను ఒక్క పాయింట్ తేడాతో ఓడించారు. ఫైనల్లో సురేఖ-ఓజాస్ 159-158 పాయింట్ల తేడాతో సో చయివాన్-జూ జహివూన్ (కొరియా)పై ఉత్కంఠ విజయం సాధించారు.

4x400మీ. రిలే పరుగులోనూ..

పురుషుల 4x400మీటర్ల రిలే పరుగులో భారత్‌కు బంగారు పతకం దక్కింది. దాంతో పసిడి పతకాల సంఖ్య 18కి చేరింది. అలాగే మహిళల 4x400 మీటర్స్ రిలేలో కూడా భారత్‌కు రజతం దక్కింది. 35 కిలోమీటర్ల రేసు వాక్ మిక్స్‌డ్ టీమ్‌లో కాంస్యం పతకం లభించింది.

ఫైనల్‌కు హాకీజట్టు..

హాకీ ఫైనల్లోకి పురుషుల జట్టు ప్రవేశించింది. బుధవారం జరిగిన తొలి సెమీఫైనల్లో భారత్ 5-3గోల్స్ తేడాతో దక్షిణ కొరియాను చిత్తుచేసింది. సెమీఫైనల్ మ్యాచ్‌లో హార్దిక్ సింగ్ మన్‌దీప్ సింగ్, లలిత్ ఉపాధ్యాయ్, అమిత్ రోహిదాస్, అభిషేక్ తలా ఒక గోల్ చేశారు.

దక్షిణ కొరియా కేవలం మూడు గోల్స్ మాత్రమే చేయగలిగింది. దాంతో ఆసియా క్రీడల్లో భారత హాకీజట్టు 11సార్లు ఫైనల్‌కు చేరినట్లయ్యింది. శుక్రవారం జరగనున్న ఫైనల్‌లో చైనా లేదా జపాన్‌తో భారత్ తలపడనుంది. నేడు చైనా-జపాన్ జట్ల మధ్య రెండో సెమీస్ జరగనుంది.

అవినాష్, హర్మిలాన్‌కు రజతాలు..

పురుషుల 5వేల మీటర్ల పరుగు పందెం ఫైనల్లో భారత్ అథ్లెట్ నాయబ్ సుబేదార్ అవినాష్ సాబిల్ రెండో స్థానంలో నిలిచి రజత పతకం సొంతం చేసుకున్నాడు. బహ్రెయిన్‌కు చెందిన బాలివ్ బిర్హాణి యెమతా, అద్మాసు దవిత్ ఫికాడు వరుసగా బంగారు, కాంస్య పతకాలు నెగ్గారు. ఇక మహిళల 800 మీటర్ల ఫైనల్ ఈవెంట్‌లో కూడా భారత్‌కు రజత పతకం దక్కింది. భారత అథ్లెట్ 25 ఏళ్ల బెయిన్స్ హర్మిలాన్ 2 నిమిషాల 3.75 సెకన్‌ల టైమింగ్‌తో రేసును పూర్తిచేసి రెండో స్థానంలో నిలవడం ద్వారా రజత పతకాన్ని సొంతం చేసుకుంది. శ్రీలంక అథ్లెట్ దిస్సనాయక ముదియన్‌సేలాకు బంగారు పతకం, చైనా అథ్లెట్ వాంగ్ చున్‌యూకు కాంస్య పతకం దక్కాయి.

లవ్లీనాకు రజతం

మహిళల 75కిలోల విభాగం ఫైనల్లో లవ్లీనా బోర్గోహైన్ నిరాశపరిచింది. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో 26ఏళ్ల లవ్లీనా చైనా బాక్సర్ లీ-క్యుయాన్ చేతిలో ఓటమిపాలైంది. తొలిరౌండ్ పూర్తయ్యేసరికి 3-2పాయింట్లతో ఆధిక్యతలో ఉన్నా.. ఆ తర్వాత రెండు రౌండ్‌లలోనూ ఆశించినస్థాయిలో రాణించలేక పోయింది. దీంతో ఫైనల్లో ఓడిన లవ్లీనాకు రజత పతకం దక్కింది.

వన్డే ప్రపంచకప్ సంగ్రామం షురూ..!

ఇంగ్లండ్ X న్యూజిలాండ్ మ్యాచ్‌లో ప్రారంభం



అహ్మదాబాద్: ఐసిసి వన్డే ప్రపంచకప్ సంగ్రామం నేటినుంచి ప్రారంభం కానుంది. టోర్నీ ప్రారంభానికి ముందు జరిపే వేడుకలను ఈసారి నిర్వహించడం లేదని భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) వెల్లడించింది. దీంతో గత వన్డే ప్రపంచకప్ ఫైనలిస్ట్ జట్లయిన ఇంగ్లండ్-న్యూజిలాండ్ జట్ల మధ్య అహ్మదాబాద్‌లో జరిగే తొలి మ్యాచ్‌తో మెగా టోర్నీ ఆరంభం కానుంది. ఇక బుధవారం రాత్రి సంప్రదాయబద్ధంగా కెప్టెన్స్ డే ఈవెంట్‌ను నిర్వహించారు. అహ్మదాబాద్‌లోని గుజరాత్ క్రికెట్ అసోషియేషన్ క్లబ్ హౌస్‌కు చెందిన బాంక్వెట్ హాల్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో 10జట్ల కెప్టెన్లు పాల్గొన్నారు. అలాగే బాలీవుడ్‌కు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. గురువారం జరిగే తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌తో న్యూజిలాండ్ తలపడనుంది. అహ్మదాబాద్ వేదికగా ఆ మ్యాచ్ జరగనుంది. ఇంగ్లండ్ జట్టు దుర్భేధ్యఫామ్‌లో ఉండగా.. న్యూజిలాండ్ జట్టు గాయాలతో సతమతమౌతోంది. న్యూజిలాండ్ కెప్టెన్ కేన్ విలియమ్సన్, టిమ్ సౌథీలు జట్టుకు దూరమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆ ఇద్దరూ ప్రస్తుతం గాయాలతో ఇబ్బందిపడుతున్నారు. 2015, 2019 వన్డే ప్రపంచకప్ టోర్నీల్లో న్యూజిలాండ్ జట్టు ఫైనల్‌కు చేరింది. మరోవైపు ఇంగ్లండ్ జట్టు మాత్రం మేటి బ్యాటర్లతో బలంగా కనిపిస్తోంది. బెన్ స్టోక్స్‌తో పాటు జోస్ బట్లర్, జానీ బెయిర్‌స్టో, లివింగ్‌స్టోన్, జో రూట్, డేవిడ్ మలన్, హ్యారీ బ్రూక్ లాంటి హార్డ్ హిట్టర్లతో ఆ జట్టు బలీయంగా ఉంది. ఐపిఎల్‌లో ఆడిన అనుభవం వారికి అనుకూలించే అవకాశాలున్నాయి. 2019 వన్డే ప్రపంచకప్ ఫైనలో ఇంగ్లండ్ బౌండరీల ఆధారంగా ట్రోఫీని తొలిసారి ముద్దాడింది.

టిక్కెట్ల కోసం నన్ను అడగొద్దు.. ప్లీజ్ విరాట్ కోహ్లి ట్వీట్

న్యూఢిల్లీ : 'ప్రపంచకప్ 2023 టికెట్ల కోసం నన్ను అడగొద్దు.. మీ ఇండ్లలోనే మ్యాచ్‌ను చూసి ఎంజాయ్ చేయండి.. ప్లీజ్' అని టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ పోస్ట్ చేశారు. 2011లో భారత్ వన్డే ప్రపంచకప్‌కి ఆతిథ్యమిచ్చింది. అప్పుడు ఎంఎస్ ధోనీ సారథ్యంలో టీమిండియా కప్ కైవసం చేసుకుంది. మళ్లీ 12 ఏళ్ల తర్వాత ప్రపంచకప్‌కి భారత్ ఆతిథ్యం ఇస్తుంది. భారత్ హాట్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది. సొంత గడ్డపై కప్ అందుకోవాలని ఎదురుచూస్తోంది. ఇక అక్టోబర్ 5వ తేదీ నుంచి నవంబర్ 19 వరకు ప్రపంచకప్ వార్ జరగనుంది. అక్టోబర్ 8న చెన్నై వేదికగా ఆస్ట్రేలియాతో జరిగే మ్యాచ్‌తో భారత్ మెగా టోర్నీ వేటను ప్రారంభించనుంది. అక్టోబర్ 14న అహ్మదాబాద్ వేదికగా పాకిస్థాన్‌తో భారత్ తలపడనుంది.

లాంగ్ పెండింగ్ ప్రమోషన్స్ వెంటనే ఇవ్వాలి

- మా వాటా మాకు రావాల్సిందే..
- అతి పెద్ద సమస్య కుల వ్యవస్థను నిర్మూలించాలి : తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఎస్సీ అండ్ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు
- టీఎస్ఎస్‌పీడీసీఎల్ కార్యాలయం ఎదుట ధర్నా

నవతెలంగాణ-సిటీబ్యూరో

విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న అర్హులందరికీ వెంటనే లాంగ్ పెండింగ్ ప్రమోషన్స్ ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఎస్సీ అండ్ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. విద్యుత్ యాజమాన్యాల వైఖరికి నిరసనగా బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రధాన కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్యామనోహర్, రమేశ్ మాట్లాడుతూ.. ప్రమోషన్ల విషయంలో విద్యుత్ యాజమాన్యాలు మొండి వైఖరి వీడాలన్నారు. అర్హులైన జేఎల్ఎం కేడర్ నుంచి సీజీఎం స్థాయి వరకు వెంటనే ప్రమోషన్స్ ఇవ్వాలని కోరారు. కోర్టు కేసు పేరుతో రివర్షన్ ఇచ్చిన తెలంగాణ ఉద్యోగులందరికీ తిరిగి ప్రమోషన్స్ ఇవ్వాలన్నారు. మెరిట్ కమ్ సీనియార్టీపై ఇచ్చిన ఆర్డర్లను రద్దు చేయాలన్నారు. అమలులో ఉన్న కాన్సిక్వెన్షియల్ సీనియార్టీనే కొనసాగించాలన్నారు. 85వ రాజ్యాంగ సవరణ ప్రకారం వచ్చిన హక్కులకు భంగం కలిగిస్తున్న కాలం చెల్లిన క్యాచ్ అప్ రూల్‌ను అమలు చేయాలనే కుట్రను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్లకు ఏపీఎస్ఈబీ రూల్స్ వర్తింపజేయాలని కోరారు.

దేశానికి అతి పెద్ద సమస్య కుల వ్యవస్థ అని, దాన్ని నిర్మూలించాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోడీ బీసీ అయి ఉండి కూడా బీసీ జనగణన చేయడం లేదన్నారు. లౌకికత్వం, సోషలిజాన్ని ప్రధాని మోడీ తీసేశారని చెప్పారు. ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీల ప్రమోషన్లను తీసేయడానికి బీసీ ఉద్యోగులు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. తమ హక్కులను దొడ్డి దారిన తీసేయాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రమోషన్లు వస్తే ఓర్వలేకపోవడం సరికాదన్నారు. ఎవరి భిక్ష అవసరం లేదని, తమ వాటా తమకు రావాల్సిందేనని డిమాండ్ చేశారు. విద్యుత్ యాజమాన్యాల విధానాలకు ఉద్యోగులు బలవుతున్నారని చెప్పారు.

తెలంగాణ ఉద్యమంలో ఆర్టిజన్ల పాత్ర మరువలేనిదని, వారిని పర్మినెంట్ చేయాలన్నారు. ఈ ధర్నా శాంపిల్ మాత్రమే అని, సమస్యలు పరిష్కారం కాకపోతే భవిష్యత్‌లో విద్యుత్ సౌధలో మరో కార్యక్రమానికి సిద్ధమవుతామని తెలిపారు. విద్యుత్ యాజమాన్యాలు తమ డిమాండ్లను పెడచెవిన పెడితే సీఎం కేసీఆర్‌కు మెమోరాండం అందజేయడం, అఖిలపక్ష నేతలకు మెమోరాండం సమర్పణ, వారితో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

అలాగే కార్పొరేట్ ఆఫీసుల ఎదుట రిలే నిరాహార దీక్షలు, ఆ తర్వాత తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రయ్య, టీఎస్ఎస్‌పీడీసీఎల్ ప్రెసిడెంట్ ఆనంద్‌బాబు, ఎన్‌పీడీసీఎల్ ప్రెసిడెంట్ ఆనందం, కుమారస్వామి, జెన్‌కో ప్రెసిడెంట్ నాగరాజు, రమేష్, ట్రాన్స్‌కో ప్రెసిడెంట్ శరబంద్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నవచిత్రం

అన్ లిమిటెడ్ కామెడీ



ట్రైలర్‌ని చూసినప్పుడు మీరు ఎలా నవ్వుకున్నారో.. రెండు గంటల ముప్పై నిమిషాల రన్‌టైమ్ మొత్తం సిచ్యుయేషనల్ కామెడీని చూసి ప్రేక్షకులు నవ్వుతూనే ఉంటారు. రత్నం కృష్ణ ఈ కథ నెరేట్ చేసినప్పుడు కథ మంచి విజువల్-కామెడీ డ్రామాగా రూపొందే అవకాశం ఉందని నమ్మాను.

- కిరణ్ అబ్బవరం

కిరణ్ అబ్బవరం, నేహా శెట్టి ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'రూల్స్ రంజన్' ఈనెల 6న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో బుధవారం కథానాయకుడు కిరణ్ అబ్బవరం మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

'టైటిల్‌ని బట్టి ఇది రూల్స్‌కి సంబంధించినది అనుకోవద్దు.. ఇది పూర్తి వినోదాత్మక చిత్రం. ఈ సినిమా నుంచి అన్ లిమిటెడ్ కామెడీని ప్రేక్షకులు ఆస్వాదిస్తారు. మనో రంజన్ ఒక అమాయకపు వ్యక్తి. 'రాజా వారు రాణి గారు'లో కాస్త సాఫ్ట్‌గా నటించాను. అతని ఇంటి చుట్టుపక్కల చాలా జాగ్రత్తగా, ఆప్యాయంగా కొంతమంది పిల్లలు పెరుగుతారు. వారికి అన్ని సుఖాలు, సౌకర్యాలు ఉన్నాయి. మనో రంజన్ ఆ విధమైన పెంపకం ఉన్న వ్యక్తి. తనపై ఎవరైనా నిందలు వేసినా ఎలా స్పందించాలో తనకు తెలియదు. అతను కొన్ని పరిస్థితులను ఎదుర్కొన్నప్పుడు, తనను కంట్రోల్ చేసే వ్యక్తులపై రూల్స్ పెడతాడు. సినిమాలో అది అత్యంత వినోదాత్మకమైన భాగం. అంతా సజావుగా సాగిపోతున్న టైంలో అతని జీవితంలోకి ఓ అమ్మాయి ప్రవేశిస్తుంది. మనోరంజన్ రూల్స్ రంజన్‌గా ఎలా మారతాడు? అతని జీవితం ఎంత వినోదాత్మకంగా సాగుతుంది అనేది సినిమాలో చూస్తాం' అని కిరణ్ అబ్బవరం అన్నారు.

సరికొత్త హర్రర్ థ్రిల్లర్ సిరీస్



'రాజు గారి గది' సిరీస్ సినిమాలతో ప్రేక్షకుల్ని హర్రర్ కామెడీతో ఆకట్టుకున్న దర్శకుడు ఓంకార్ ఈసారి 'మాన్షన్ 24' అనే సరికొత్త హర్రర్ వెబ్ సిరీస్‌తో రాబోతున్నారు. హాట్ స్టార్స్ స్పెషల్స్‌గా డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో ఈ వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది. వరలక్ష్మి శరత్ కుమార్, అవికా గోర్, బిందు మాధవి, నందు, మానస్, అయ్యప్ప పి.శర్మ, రావు రమేష్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

ఈ సిరీస్ ట్రైలర్ లాంచ్ హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుకలో దర్శకుడు అనిల్ రావిపూడి అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు ఓంకార్ మాట్లాడుతూ, 'వెబ్ సిరీస్ అంటే టీవీ ప్రోగ్రాంకు ఎక్కువ, సినిమాకు తక్కువ అనే ఇంప్రెషన్ ప్రేక్షకుల్లో ఉంది. అయితే ఇప్పుడు ట్రెండ్ మారుతోంది. కొద్ది రోజుల్లోనే ఓటీటీ రీచింగ్ మరింత పెరుగుతుంది. అలాంటి రైట్ టైమ్‌లో నేను ఈ వెబ్ సిరీస్‌తో ఎంట్రీ ఇస్తున్నాను. ఇందులోని ఆరు ఎపిసోడ్స్ కంటిన్యూగా చూసేంత ఇంట్రెస్టింగ్‌గా ఉంటాయి. ప్రతి ఎపిసోడ్ ఒక హుక్ పాయింట్‌తో ఎండ్ అవుతుంది. ఫ్యామిలీ అంతా కలిసి చూడొచ్చు' అని తెలిపారు. 'అన్నయ్య ఓంకార్‌తో వెబ్ సిరీస్ చేసే అవకాశం కల్పించిన డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌కు బిగ్ థ్యాంక్స్. ఈ వెబ్ సిరీస్‌తో కూడా అన్నయ్య తనకంటూ ఓ మార్క్ క్రియేట్ చేసుకోవాలని కోరుకుంటున్నా' అని హీరో అశ్విన్ బాబు అన్నారు. వరలక్ష్మి శరత్ కుమార్ మాట్లాడుతూ, 'ఈ సిరీస్‌లో నాకు మంచి క్యారెక్టర్ ఇచ్చారు. ఈ వెబ్ సిరీస్‌లో నటించడం హ్యాపీగా ఉంది. హర్రర్ థ్రిల్లర్ కథకు మంచి మ్యూజిక్ చాలా అవసరం. అలాంటి సౌండింగ్ ఇచ్చారు మ్యూజిక్ డైరెక్టర్ వికాస్. నాకు ట్రైలర్ బాగా నచ్చింది' అని అన్నారు.

కంటెంట్ ఉన్న కమర్షియల్ సినిమా



సుధీర్‌బాబు

సుధీర్ బాబు, హర్షవర్ధన్ కాంబోలో రూపొందిన యూనిక్ యాక్షన్ థ్రిల్లర్ 'మామా మశ్చీంద్ర'. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పిపై నిర్మాతలు సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్ మోహన్ రావు నిర్మించిన ఈ చిత్రం తెలుగు, హిందీ భాషల్లో రూపొందింది. ఈ ద్విభాషా చిత్రాన్ని సృష్టి సెల్యులాయిడ్ సోనాలి నారంగ్, సృష్టి సమర్పిస్తున్నారు. ఈనెల 6న సినిమా విడుదలౌతున్న నేపథ్యంలో హీరో సుధీర్ బాబు మీడియాతో ముచ్చటించారు.

"మనం' చూసినప్పుడు ఎంత కొత్తగా అనిపించిందో.. ఈ సినిమా చూసినప్పుడు కూడా అలాంటి కొత్త అనుభూతిని ఇస్తుంది. ఈ కథలో ట్రిపుల్ రోలే బాగా నన్ను ఎగ్జైట్ చేసింది. ఈ మూడు పాత్రలకు మూడు డిఫరెంట్ యాసలు ఉంటాయి. ఒక పాత్ర తెలంగాణ, మరొకటి ఉత్తరాంధ్ర, ఇంకో పాత్రకు రాయలసీమ యాస ఉంటుంది. ప్రతి పాత్రకు వేరియేషన్ ఉంది. ఈ చిత్రం మెంటల్‌గా, ఫిజికల్‌గా ఒక ఛాలెంజ్. కంటెంట్ ఉన్న కమర్షియల్ సినిమా ఇది. ఫ్యామిలీ అంతా కలిసి హాయిగా చూడొచ్చు. చాలా మలుపులు, ట్విస్ట్‌లు ఉంటాయి. ఇది మల్టీ లేయర్స్ ఉన్న కథ. సెంట్రల్ లేయర్ పరశురాం పాత్ర. పరశురాం జీవితంలో ఒక సంఘటన జరుగుతుంది. ఆ సంఘటనలో జైలుకి కూడా వెళ్తాడు. బయటికి వచ్చిన తర్వాత తన జర్నీ ఎలా ఉంటుంది? తన పాత్ర మిగతా పాత్రలపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతుంది?, తన జీవితాన్ని మార్చింది ఎవరు? ఇలా చాలా కోణాల్లో కథ ఆసక్తికరంగా సాగుతుంది. నేను చేసిన ఈ మూడు పాత్రల్లో దుర్గా పాత్రలో చాలా ఫ్రెష్ నెస్ కనిపిస్తుంది. పరశురాం పాత్ర కథలో చాలా కీలకం. ఆ పాత్రతో సినిమా అంతా కనెక్ట్ అవుతారు. అలాగే డిజే పాత్రలో వేరియేషన్ చూపించడం కూడా ఒక సవాల్‌గా అనిపించింది. కృష్ణ బయోపిక్‌లో నటించే అవకాశం వస్తే తప్పకుండా చేస్తాను. అలాగే పుల్లెల గోపీచంద్ బయోపిక్ ఖచ్చితంగా ఉంటుంది. ప్రస్తుతం 'మా నాన్న సూపర్ హీరో' డబ్బింగ్ స్టేజ్‌లో ఉంది. అలాగే నా కెరీర్‌లో బిగ్గెస్ట్ ప్రాజెక్ట్ 'హరోం హర' కూడా జరుగుతోంది'.

బృందావనివే..యవ్వనివే..



ఆనంద్ దేవరకొండ, ప్రగతి శ్రీ వాస్తవ

యువ కథానాయకుడు ఆనంద్ దేవరకొండ 'గం..గం..గణేశా' మూవీతో మరో హిట్ అందుకునేందుకు రెడీ అవుతున్నారు. యాక్షన్ కామెడీ జోనర్‌తో ఈ సినిమాను హై-లైఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మిస్తున్నారు. ఉదయ్ బొమ్మిశెట్టి ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి 'బృందావనివే...' లిరికల్ సాంగ్‌ను హీరోయిన్ రష్మిక మందన్న రిలీజ్ చేశారు. ఆనంద్ గత సూపర్ హిట్ ఫిల్మ్ 'బేబి'లోని 'ప్రేమిస్తున్నా..' సాంగ్ కూడా రష్మికనే విడుదల చేశారు. ఆ సాంగ్ కంటే ఈ పాట బిగ్ హిట్ కావాలని బెస్ట్ విషెస్ తెలిపారు. చేతన్ భరద్వాజ్ కంపోజ్ చేసిన ఈ పాటకు వెంగి సుధాకర్ లిరిక్స్ అందించారు. సిద్ శ్రీరామ్‌తో కలిసి చేతన్ భరద్వాజ్ ఈ పాట పాడారు. 'బృందావనివే యవ్వనివే నీవే, నా మనసే నీ వశమే రా, ప్రేయసివే ఊర్వశివే నీవే, ఆరాధనమైనావే...' అంటూ మంచి లవ్ ఫీల్‌తో బ్యూటీఫుల్ మెలొడీగా ఆకట్టుకుంటోందీ పాట. ఈ సినిమా త్వరలో విడుదల కానుంది.

మరో అద్భుతమైన పాట



విక్రాంత్, మెహరీన్

'స్పార్క్ లైఫ్' సినిమాతో విక్రాంత్ హీరోగా తెలుగు తెరకు పరిచయం కాబోతోన్నారు. ఈ సినిమాతో హీరోగా మాత్రమే కాకుండా.. కథా రచన, స్క్రీన్ ప్లేను కూడా అందిస్తున్నారు.

ఈ మూవీలో మెహరీన్, రుక్సార్ ధిల్లాన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. డెఫ్ ఫ్రాగ్ ప్రొడక్షన్స్ మీద ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.రీసెంట్‌గా ఈ మూవీ చిత్రీకరణ పూర్తయింది. ఈ సైకలాజికల్ థ్రిల్లర్ నవంబర్ 17న థియేటర్లోకి రాబోతోంది.

'యమా ఆనందం..' అనే పాటతో ఈ మూవీ మ్యూజికల్ ప్రమోషన్స్ ప్రారంభించింది చిత్రయూనిట్. తాజాగా సెకండ్ సింగిల్ 'ఇది ఇది మాయ'ను రిలీజ్ చేసి మళ్లీ శ్రోతలను కట్టిపడేసేందుకు చిత్రయూనిట్ రెడీ అయింది.

బుధవారం ఈ పాటను రిలీజ్ చేశారు. అనంత శ్రీరామ్ సాహిత్యం, శ్రేయా ఘోషాల్, హేషమ్ అబ్దుల్ వాహబ్ ద్వయం గాత్రం ఈ పాటకు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. విక్రాంత్, మెహరీన్‌ల మీద చిత్రీకరించిన ఈ పాటలో వీరిద్దరి కెమిస్ట్రీ అద్భుతంగా పండినట్టుగా కనిపిస్తోంది.

సమాజానికి ఉపయోగపడే డర్టీ ఫెలో



దీపిక సింగ్, శాంతి చంద్ర, సిమ్రితి

ఒక తండ్రి తన కొడుకుని సరైన మార్గంలో పెట్టకపోతే ఆ కొడుకు విచ్చల విడిగా సమాజానికి హానికరంగా మారితే, ఆ తండ్రి తీసుకొనే నిర్ణయం ఏమిటి...

తండ్రి కొడుకుల మధ్య జరిగే యాక్షన్ ఎంటర్టైనర్ సినిమానే 'డర్టీ ఫెలో'. భద్ర కాళీ సమర్పణలో రాజ్ ఇండియా ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై శాంతి చంద్ర, దీపిక సింగ్, మిస్ ఇండియా 2022 సిమ్రితి హీరో, హీరోయిన్లుగా ఆడారి మూర్తి సాయి దర్శకత్వంలో జి.యస్. బాబు నిర్మిస్తున్న చిత్రమిది.

ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుని సెన్సార్‌కి వెళ్లిన సందర్భంగా చిత్ర యూనిట్ ఏర్పాటు చేసిన మీడియా సమావేశానికి ముఖ్యఅతిథిగా వచ్చిన హీరో శ్రీకాంత్ టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,'ఈ సినిమా కాన్సెప్ట్ నాకు బాగా నచ్చింది. ఆడారి మూర్తి సాయి ఈ సినిమాను చాలా బాగా తీశాడు. టీజర్ కూడా చాలా బాగుంది' అని చెప్పారు.

'సినిమా టైటిల్ కంప్లీట్ నెగిటివ్‌గా ఉన్నా సమాజానికి మంచి మెసేజ్ ఇచ్చేలా ఉంటుంది. నాసిక్, అరకు, వైజాగ్ వంటి ప్రదేశాల్లో రెయిన్ సీజన్‌లో కూడా చాలా కష్టపడి చేశాం' అని హీరో, నిర్మాత శాంతి చంద్ర అన్నారు. చిత్ర దర్శకుడు ఆడారి మూర్తి సాయి మాట్లాడుతూ, 'అందరూ సపోర్ట్ చేయడం వలన ఈ సినిమా చాలా బాగా వచ్చింది. ప్రేక్షకులు మెచ్చే అన్ని అంశాలు ఈ సినిమాలో ఉన్నాయి' అని తెలిపారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.